
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:241 హైదరాబాద్, ఆదివారం, 30 మార్చి 2025 పేజీలు: 12 వెల: 1.00

## సుక్మా జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్..

# 16 మంది మావోయిస్టుల మృతి

సుక్మా: దండకారణ్యంలో శనివారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. స్థానిక గోగుండా కొండపై మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈక్రమంలో మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఎదురుకాల్పులు జరిపిన పోలీసులు 16 మందిని హతమార్చారు. ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. కెర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కాల్పులు చోటుచేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. గాయపడిన సిబ్బంది డీఆర్‌జీ విభాగానికి చెందిన వారిగా పేర్కొన్నారు.



భారీగా ఆయుధాలు స్వాధీనం

సంఘటనా స్థలం నుంచి 16 మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ మీడియాకు తెలిపారు. పెద్ద సంఖ్యలో ఏకే-47 రైఫిల్స్‌తోపాటు, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్), ఇన్సాస్, రాకెట్ లాంచర్, బరెల్ గ్రనేడ్ లాంచర్ (బీజీఎల్)లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.

మావోయిస్టుల దుశ్చర్య.. ఐఈడీ పేలి ఇద్దరు చిన్నారుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. వారు అమర్చిన ఐఈడీ పేలిన ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందగా.. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు బీజాపూర్ పోలీసులు వెల్లడించారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లే మార్గంలో మావోయిస్టులు గతంలో ఐఈడీ అమర్చారు. అడవిలో పండ్లు ఏరుకునేందుకు తన పిల్లలతో కలిసి వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి వస్తుండగా.. అనుకోకుండా దానిపై కాలు వేయడంతో ఒక్కసారిగా అది పేలిపోయింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా.. ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు ఆమెను దగ్గర్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.



## ప్రజా ప్రయోజనాలే ముఖ్యం.. ఖర్చుకు వెనకాడొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా లింక్ రోడ్లు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై సీఎం సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండీఏ పరిధిలోని 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల అనుసంధానం, ఆటంకాలు లేని రాకపోకలకు వీలుగా రహదారులు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అదనపు భూసేకరణకు విషయంలో ఖర్చుకు వెనకాడవద్దని అన్నారు. ఈ సమీక్షలో సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రాజు, సీఎస్ శాంతి కుమారి, సీఎం కార్యాలయ ఉన్నతాధికారులు వి.శేషాద్రి, చంద్రశేఖర్ రెడ్డి, అజిత్ రెడ్డి, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లో కాల్పుల కలకలం. అదుపులో నిందితుడు



హైదరాబాద్: నగరంలోని గుడిమల్కాపూర్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో 'ఆనం మీర్జా' ఎక్స్‌పో జరుగుతోంది. ప్రదర్శనలో ఇద్దరు దుకాణదారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే వారిలో ఒక దుకాణదారుడు గాల్లోకి కాల్పులు జరిపాడు. దీంతో ఎక్స్‌పోకు వచ్చిన సందర్శకులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అక్కడి నుంచి పరుగులు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. గాల్లోకి కాల్పులు జరిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు పోలీసులు నిర్ధరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పేదలకు గుడ్‌న్యూస్.. సన్నబియ్యం పంపిణీపై ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

సూర్యాపేట : సన్నబియ్యం పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేపటి నుంచి ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. రేపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా మొత్తం కేబినెట్, ఎంపీలు హాజరు కాబోతున్నారని తెలిపారు. ప్రతి



కార్యకర్త కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాలని చెప్పారు. ఇవాళ(శనివారం) మెల్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి, మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెల్ల రేషన్ కార్డ్ దారులకు మూడు రంగుల కార్డ్... ఉన్నతులకు గ్రీన్ కార్డ్ అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. రాష్ట్రంలో 84శాతం జనాభాకు మేలు చేసే కార్యక్రమం చేపట్టబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఖమ్మం: ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సన్నబియ్యం పంపిణీ చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డికు ధన్యవాదాలు తెలిపారు. సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. నిర్లక్ష్యానికి గురైన సీతారామ ప్రాజెక్ట్ రైతాంగానికి సాగునీరు ఇచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. సాగర్ ఆయకట్టు స్థిరీకరణకు రాజీవ్ కెనాల్‌కు అడగ్గానే నిధులు మంజూరు చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.

భద్రాద్రి రామాలయం విస్తరణ పనులకు రూ.34 కోట్లు మంజూరు చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. మైన్స్ ఇంజినీరింగ్ కాలేజ్‌ను ఎర్త్ సైన్సెన్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డికు ప్రతిపాదన చేశామని గుర్తుచేశారు. రెండు, మూడు రోజుల్లో యూనివర్సిటీ జీవో వస్తుందని స్పష్టం చేశారు. కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు కేంద్రంతో సంప్రదింపులు జరిపామని అన్నారు. ఉగాది పర్వదినాన వేంసూరు మండలం కల్లూరు గూడెంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన చేస్తున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణ మారనుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# మంత్రివర్గ విస్తరణ...

## పలు శాఖాల్లో మార్పులు

హైదరాబాద్, మార్చి 29,

తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో ఎప్పుడెప్పుడు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. అయితే మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ అంతు పట్టడం లేదంటున్నారు. మంత్రిత్వ శాఖల భర్తీకి ఏఐసీసీ పచ్చజెండా ఊపినట్లు ప్రచారమైతే జరుగుతోంది. అయితే విస్తరణ ఎప్పుడు జరిగినా తమ శాఖలను మార్చాలని సిట్టింగ్ మంత్రులు అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారన్న ప్రచారం ఆసక్తి కరంగా మారింది. మరోవైపు పనితీరు ఆధారంగా కొందరు మంత్రుల పోర్టుపోలియోలు మారుస్తారంటున్నారు. తెలంగాణ కేబినెట్‌లో భారీగా ప్రక్షాళనకు అడుగులు పడుతున్నాయంట.. 18 మంది సభ్యులు ఉండాల్సిన తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. ఆ ఆరు పదవుల కోసం చాలా మంది నేతలే రేసులో కనిపిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో ఎప్పుడెప్పుడు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నాయి.గత కొంత కాలంగా కేబినెట్ విస్తరణ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం పలు దఫాలుగా చర్చలు జరుపుతూనే ఉంది. కొత్తగా వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జీ మీనాక్షీ నటరాజన్ కూడా రాష్ట్రంలోని కీలక నేతలతో వ్యక్తిగతంగా భేటీ అవుతూ.. పరిస్థితులపై ఆరా తీస్తున్నారంట. దీంతో.. మంత్రివర్గ విస్తరణ విషయంలో అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చిందని చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కేబినెట్ బెర్త్‌లు ఎవరెవరికి కేటాయించాలన్న దానిపై హైకమాండ్ ఓ నిర్ణయానికి వచ్చిందంటున్నారు.ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయడంతో పాటు ఇప్పుడున్న మంత్రుల శాఖలను కూడా మార్చే దిశగా కసరత్తు జరుగుతున్నట్లు చెప్తున్నారు. పనితీరు ఆధారంగా కాంగ్రెస్ హైకమాండ్ మంత్రుల శాఖల మార్పులు చేర్పులు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తనకు ఇచ్చిన శాఖలపై సీనియర్ నాయకుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారన్న ప్రచారం చాలాకాలంగా కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది. ఉత్తమ్ దగ్గరున్న పౌరసరఫరాలు, ఇరిగేషన్ శాఖలు వేరొకరికి ఇచ్చి.. వేరే కీలక శాఖలను ఆయనకు ఇచ్చే దిశగా చర్చలు జరుగుతున్నాయంట.అటు మరో సీనియర్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా తన శాఖ పట్ల అసంతృప్తిగా ఉన్నారంట. కోమటిరెడ్డి తన సీనియార్టీతో పనులు పరుగులు పెట్టించాలని చూస్తున్నా ఆయన నిర్వహిస్తున్న ఆర్ అండ్ బి శాఖలో అధికారులు సహకరించడం లేదన్న అభిప్రాయంలో ఉన్నారంట. అందుకే ఆయన కూడా తన శాఖను మార్చమని కోరుతున్నారన్న టాక్ వినిపిస్తుంది.మరోవైపు తెలంగాణలో ఎక్సైజ్ శాఖ పనితీరుపైనా ప్రభుత్వ, పార్టీ పెద్దలు అసంతృప్తితో ఉన్నారంటున్నారు.. ఆ శాఖను చూస్తున్న జూపల్లి కృష్ణారావు దగ్గరున్న ఎక్సైజ్ శాఖను మరొకరికి ఇచ్చే ఛాన్స్ ఉందంటున్నారు. అలాగే ఇప్పుడు మంత్రుల దగ్గర అదనంగా ఉన్న శాఖలను కొత్త మంత్రులకు ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నారంట. ప్రస్తుతానికి కేబినెట్‌లోకి నలుగురినే తీసుకోవచ్చంటున్నాయి ఏఐసీసీ వర్గాలు.ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరున్న హోంమంత్రి పదవి సుదర్శన్‌రెడ్డికి దక్కొచ్చంటూ ఢిల్లీ నుంచి లీక్‌లు వస్తున్నాయి. పార్టీలో సీనియర్ కావడం, వివాదరహితుడిగాఉన్న పేరు, గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండడంతో హైకమాండ్ ఆయన వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. మరి మంత్రి వర్గ విస్తరణపై ఎప్పుడు క్లారిటీ వస్తుందో?? శాఖల మార్పులు చేర్పులు ఎలా జరుగుతాయో కాని.. ఈ విస్తరణ తర్వాత కూడా రెండు కేబినెట్ పోస్టులను ఖాళీగా ఉంచే ఛాన్స్ ఉందంటున్నారు.

## రైల్వే టికెట్ కౌంటర్‌లో కొన్నా..ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చు

కేంద్ర రైల్వేశాఖ ప్రయాణికుల కోసం మరో సదుపాయం అమలుచేస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ప్రయాణికులు ఇకపై తమ టిక్కెట్లను రద్దు చేసుకోవడానికి స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రైల్వే టికెట్ కౌంటర్‌లో కొన్నా.. దానిని ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో లేదా 139కి ఫోన్ చేసి టికెట్ రద్దు చేసుకోవచ్చున్నారు. రిఫండ్స్ కోసం మాత్రం రిజర్వేషన్ కేంద్రాలకు వెళ్లాల్సిఉంటుందని తెలిపారు. తాము తీసుకుంటున్న ఈ చర్య వల్ల దేశవ్యాప్తంగా ఉన్న లక్షల మంది రైలు ప్రయాణికుల సమయం, శ్రమ ఆదా అవుతుందని భావిస్తున్నట్లు వెల్లడించారు.

సాధారణంగా ప్రయాణికులు టిక్కెట్లను రద్దు చేసుకోవడానికి, సొమ్ము వాపసు పొందడానికి రైల్వే కౌంటర్లకు తిరిగి వెళ్లాల్సిఉండడంతో.. దీనికి చాలా సమయం పడుతుంది. ప్రస్తుతం ఆన్‌లైన్



టికెట్ రద్దు సదుపాయం ద్వారా ఇబ్బందిలేకుండా సులభంగా టికెట్లను రద్దు చేసుకోవచ్చు. ప్రభుత్వ సంస్థలను డిజిటలైజేషన్ వైపు తీసుకువెళ్లాలనే ఉద్దేశంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

# మారని మధ్యతరగతి స్థితిగతులు

ఎక్కడ చూసినా ఉరుకులు– పరుగులు. కుటుంబ పోషణ కోసం పడరాని పాట్లు, ఆరోగ్య సంరక్షణ కోసం ఉదయాన్నే వ్యాయామాలు...పిల్లల చదువుల కోసం తంటాలు పడుతూ, లక్షల్లో ఫీజులు కడుతూ, హైరానా పడుతూ, నిద్రలేని రాత్రులు గడుపుతూ,మానసిక రుగ్మ తలకు గురవుతున్న మధ్యతరగతి జీవుల ఆర్థిక స్థితిగతులు మారకుండా సాంకేతిక పరిజ్ఞానం పేరుతో ఏదో సాధించేశామని చెప్పుకోవడం అతిశయోక్తి మాత్రమే కాగలదు. విజ్ఞానం పెరిగినా ఆర్థిక బాధలు ఆయుష్షును మింగేస్తున్నాయి.మానవ విజ్ఞానం గగనాన్ని తాకింది. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని దగ్గర చేసింది. అయినా ఎక్కడో ఏదో వెలి తి, అసంతృప్తి కనిపిస్తున్నాయి. ఒకప్పటికీ, ఇప్పటికీ మానవ జీవితంలో ఎన్నో మా ర్పులు సంభవించాయి. మానవ జీవిత గమనంలోని మలుపులను, మార్పులను ఒక్కసారి అవలోకనం చేసుకోవడానికి చరిత్ర పుటలను వెనక్కి తిప్పి చూస్తే మనకే ఆశ్చర్యం కలుగక మానదు. మానవ పరిణామ క్రమం ఒక ఎత్తయితే, నాగరికత పెరిగిన తర్వాత మనిషి జీవన విధానంలో సంభవించిన పెను మార్పులు మరొక ఎత్తు. దీనికి కారణం మనిషి ఆలోచనలు, ఆ ఆలోచనలకు కార్యరూపమిచ్చి, ప్రయోగాత్మక పద్ధతిలో విశ్లేషించడం, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ప్రదర్శించడం. తాము ఊహించిన విషయాలు, ఆలోచనలు నిజమా? కాదా? అనే అంశం పై ప్రయోగాల ద్వారా నిర్ధారణకు రావ డం విజ్ఞాన తృష్ణకు దారితీసింది. దీనినే క్లుప్తంగా సైన్స్ అని చెప్పవచ్చు. ప్రపంచ గమనాన్ని మార్చిన సైన్స్ ప్రజా జీవితాలను ఎంతో సౌకర్యవంతంగా మలచింది. ఈ ప్రపంచంలో ప్రతీ జీవికి తెలివితేటలున్నాయి. అయితే మానవజాతికున్న మేధస్సు మిగిలిన జీవరాశులకు లేకపోవడం వల్ల సమస్త ప్రాణులను, సకల సృష్టిని శాసించగల స్థితికి మానవుడు చేరుకున్నాడు. మానవ సామర్థ్యానికి ఆసక్తి, పట్టుదల తోడు కావడం వల్ల ఏదైనా సాధించగల మహోన్నత స్థితిని సాధించాడు. పూర్వకాలంలో కొన్ని ప్రపంచ దేశాలు పలు రకాల మహమ్మారులకు తుడిచిపెట్టుకుపోయాయి. ఇలాంటి సంఘటనలు వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడానికి దోహదం చేసాయి. ఇటీవలి కాలంలో కోవిడ్ మహమ్మారికి ప్రపంచం సుమారు రెండు సంవత్సరాలు స్తంభించిపోయింది. మానవ విజ్ఞానం వల్ల ఈ మహమ్మారికి త్వరితగతిన వ్యాక్సిన్ కనిపెట్టడం జరిగింది.మశూచి, ప్లేగు, కలరా వంటి మహమ్మారుల వల్ల కోట్లాది మంది ప్రజలు మృ త్యువాత పడ్డారు. అప్పట్లో వైద్యశాస్త్రం అంతగా అభివృద్ధి చెందలేదు. ఈ కారణంగానే ఇంతటి విధ్వంసం జరిగింది. ఎడ్వర్డ్ జెన్నర్ ప్రపంచంలో మొట్టమొదటి సారిగా వ్యాక్సిన్‌ను కనిపెట్టి మశూచికి అడ్డుకట్ట వేసాడు. తర్వాత కాలంలో అనేక వ్యాధులకు అనేక వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చి, మరణాల సంఖ్యను తగ్గించాయి.ఈ విశాలమైన భూభాగంపై మానవాళి భాగస్వామ్యం ఒకశాతం మాత్రమే. భూతలంపై ఇంత స్వల్ప శాతం గల మానవుడు 99 శాతం జీవరాశులను శాసించ డం, కేవలం మానవ దయాదాక్షిణ్యాల మీద పలు జీవరాశుల మనుగడ ఆధారపడి ఉండడం పెరిగిన మానవాధిక్యతకు పరాకాష్ఠ గా చెప్పవచ్చు.మానవ విజ్ఞానం పెరగడం, టెక్నాలజీ శరవేగంగా మానవ జీవితాల్లో ప్రవేశించడం వల్ల అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన మాట వాస్తవం. అనేక రంగాల్లో మానవ మేధ స్సు ప్రపంచ గమనాన్ని సమూలంగా మార్చడం జరిగింది. పంచ భూతాలను సైతం తమ అధీనంలోకి తెచ్చుకోవాలని ఆశిస్తున్న శాస్త్ర విజ్ఞానం మరణాన్ని జయించడంలో మాత్రం వైఫల్యం చెందింది. వార్ధక్యాన్ని నిలువరించి, వయసును తగ్గించడానికి ఏజ్ రివర్సింగ్ పేరిట పరిశోధ నలు జరుగుతున్నాయి. శాస్త్ర పరిశోధనల విషయంలో కూడా ఇకపై సంయమనం పాటించాలి.ఒకవైపు సైన్స్ ఎంతగా అభివృద్ధి చెందినా, మరోవైపు ప్రజాజీవితం సాఫీగా సాగడం లేదు. చాలా దేశాలు పేదరికంతో అలమటిస్తున్నాయి. తినడానికి తిండి, ఉం డడానికి గూడు, తాగడానికి సరైన నీరు దొరక్క అత్యంత దుర్భర జీవితం గడుపుతున్న అభాగ్యుల ఆర్తనాదాలు శూన్యంలో కలిసి పోతున్నాయి. విద్య,వైద్య సదుపాయాలు లేక ప్రపంచంలో చాలామంది ప్రజలు మిగిలిన ప్రపంచంతో పోటీ పడలేక దైన్యంగా,భారంగా జీవితాలను నెట్టు కొస్తున్నారు. పేదరికంలో మగ్గిపోతున్న దేశాల సంగతి ఈ విధంగా ఉంటే, అభివృద్ధి చెందిన,అభివృద్ధి సాధించిన దేశాల పరిస్థితి మరో విధంగా ఉంది. పెరిగిన కాలుష్యం మనం పీల్చే గాలిని విషతుల్యం చేస్తున్నది.మనం భుజించే ఆహారం రసాయనాలతో నిండి ఉంటున్నది. ఒకవైపు భూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. శీతల దేశాలు కూడా రాబోయే కాలంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల అనేక మార్పులు సంతరించుకునే అవకాశాలున్నాయి. నీటి లభ్యత లేక పంటలు పండక, పలు దేశాల్లో ఆహార భద్రతకు పెను ప్రమాదం ఏర్పడే అవకాశముంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను అదుపు చేయకపోతే సమస్త భూగోళం గందరగోళంలో పడే అవకాశముంది.ఏది ఏమైనప్పటికీ పెరుగుతున్న విజ్ఞానం వలన కొత్తగా సమస్యలు ఉత్పన్నం కారాదు. మన పరిశోధనల గమ్యం మారాలి. ప్రజలందరూ ఆరోగ్యవంతంగా జీవించే విధంగా మార్గాలు చూపాలి. పరిశుభ్రమైన నీరు అందరికీ అందాలి. అంతరిస్తున్న నీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రసాయనాలకు ప్రత్యామ్నాయంగా కాలుష్యానికి తావులేని ఆవిష్కరణలు జరగాలి. ప్రజలకు ఆరోగ్య వంతమైన జీవన విధానం అందించడంలో శాస్త్ర వేత్తలు కృషిచేయాలి. నూతన పరిశోధనల వల్ల ఏర్పడే విపత్కర పరిణామాలకు పరిష్కారం కనుగొనాలి. మానవాళికి ఇబ్బంది లేని పరిశోధనలకు ప్రాధాన్యత నివ్వాలి కాలక్రమంలో జరిగిన అనేక మార్పుల వల్ల మానవుడు నేడు ఆధునిక యుగానికి ఆవిష్కర్తగా మారాడు.

# సూర్యలంక బీచ్ కు మహర్దశ

ఒంగోలు, మార్చి 29,

బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ ప్రాజెక్టుకు కేంద్రం పచ్చ జెండా ఊపింది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద సూర్యలంక బీచ్ ఫ్రంట్ అభివృద్ధికి 97.52కోట్లు కేటాయించింది. రాష్ట్ర పర్యాటక శాఖ టూరిజం సమర్పించినడీపీఆర్ కు అనుగునంగా ఈ నిధులు కేటాయింపు జరిగింది. సూర్యలంక కు వచ్చే పర్యాటకులు ప్రపంచ స్థాయి పర్యాటక అనుభూతిని పొందేలా ఈ నిధులు ఖర్చు చేస్తామని రాష్ట్ర పర్యాటకమంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ నిధుల్లో పర్యాటకానుభూతిని మెరుగుపరచడానికి, కొత్త అంశాలను రూపొందించేందుకు ?15.43 కోట్లు, షాపింగ్ స్ట్రీట్ అభివృద్ధికి ?4.37 కోట్లు, స్థి పర్యాటక వాహనాల పార్కింగ్ సదుపాయాల కోసం ?7.76 కోట్లు ఖర్చు చేస్తారు. అలాగే బ్యాక్ వాటర్ కోసం ?11.69 కోట్లు, సూర్యలంక ఎక్స్ పీరియన్స్ అభివృద్ధికి ?19.36 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ?18 కోట్లు వినియోగించనున్నారు.ఇంతకు ముందే అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టుల కోసం కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ 172.34 కోట్లు మంజూరు చేసింది. ఈ ఆమోదంతో, ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాజెక్టులకు కేటాయించిన మొత్తం నిధులు ?269.86 కోట్లకు చేరాయి.బాపట్ల జిల్లా సూర్యలంకలోని బీచ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. కొత్త రాజధాని అమరావతికే కాదు.. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు కూడా సమీపంలో ఉన్న బీచ్ సూర్యలంక. హైదరాబాద్ నుంచి 320 కిలోమీటర్ల దూరంలో ఇది ఉంది. ఇప్పటికే ఉన్న అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేను నర్సరావుపేట వద్ద నుంచి బాపట్లతో కలిపేలా మరో నాలుగు వరుసల హైవేకు ఈ మధ్యనే ఆమోదం తెలిపారు. అది పూర్తైతే... హైదరాబాద్ నుంచి నేరుగా బీచ్‌కు ఫోర్‌లేన్ జాతీయ రహదారి వచ్చేస్తుంది. కోస్తా జాతీయ రహదారిని ఇప్పటికే డవలప్ చేశారు. ఇక బాపట్ల బీచ్ కేవలం సముద్ర తీరం మాత్రమే కాదు. దీంట్లోకి ఓ కెనాల్ కూడా కలుస్తుంది. దాంతో బ్యాక్‌వాటర్ టూరిజం ను కూడా డవలప్ చేయొచ్చు.అమరావతికి సముద్రతీరాన ఉన్న ప్రధాన అట్రాక్షన్ సూర్యలంక. ఇప్పటికే ఇక్కడ టూరిజం శాఖ హరిత రిసార్ట్‌లు నిర్వహిస్తోంది. ఇది కాకుండా కొన్ని ప్రైవేట్ రిసార్టులున్నాయి. సూర్యలంకను గ్లోబల్ ఐకానిక్ గా తీర్చిదిద్దాలనే సంకల్పంలో భాగంగా స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ పథకం కోసం 101కోట్లకు డీపీఆర్ ఇచ్చింది. ఇందులో బీచ్ ఫ్రంట్ ను అభివృద్ధి చేయడం, లాండ్ స్కేపింగ్, ఫ్లోటింగ్ రెస్టారెంట్, సైక్లింగ్ జాగింగ్ ట్రాక్ ల అభివృద్ధి, సెయిలింగ్ క్లబ్ వంటి అంశాలున్నాయి. బీచ్‌లో ఐకానిక్ ధ్యానమందిరం కన్వెన్షన్ సెంటర్‌ను కూడా ప్రతిపాదించారు. బీచ్‌లో కలిసే కాలువపైన హౌస్ బౌటింగ్, ఫ్లొటొంగ్ రెస్టారెంట్ ను ప్రపోజ్ చేశారు. ఇది కాకుండా సూర్యలంక సమీపంలో ప్రైవేట్ భాగస్వామ్యంలో 650కోట్లతో ఫైవ్ స్టార్ హోటళ్లు, రిసార్టులు వస్తున్నాయని కూడా డీపీఆర్‌లో పేర్కొన్నారు.స్వదేశ్ దర్శన్ 2.0 ప్రాజెక్ట్ కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ చేపట్టిన ఒక పర్యాటక అభివృద్ధి కార్యక్రమం. ఇది స్వదేశ్ దర్శన్ ప్రాజెక్ట్ కి కొత్త రూపం, దీని ద్వారా దేశీయ పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేయడం, స్థానిక ప్రజల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటం, రోడ్లు, హోటళ్లు, పార్కింగ్, సమాచార కేంద్రాలు వంటి మౌలిక వసతులు కల్పించడం, భారతీయ సంస్కృతి, వారసత్వం, సంప్రదాయాలను ప్రోత్సహించడం వంటివి ఈ ప్రాజెక్టులో చేపడతారు. స్వదేశ్ దర్శన్ 2.0 ప్రత్యేకంగా సమగ్ర పర్యాటక ప్రణాళికపై దృష్టి సారిస్తుంది. ఇందులో రూరల్, ఎకోటూరిజం, ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తుంది.

# గూగుల్ తో టీటీడి ఒప్పందం

తిరుమల, మార్చి 29,

తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకునేందుకు భక్తులు నానా కష్టాలు పడతారు. సుదూర ప్రాంతాల నుంచి అక్కడికి వస్తుంటారు. ఒక్కసారి శ్రీవారిని దర్శించుకుంటేచాలని కొందరు అనుకుంటారు. మరికొందరైతే ప్రతీ ఏడాది వెళ్తున్నారు. ప్రతీ రోజూ వేలల్లో భక్తులు అక్కడికి వస్తుంటారు. అయినా గంటల తరబడి భక్తులు క్యూ కాంప్లెక్సుల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.భక్తులకు వేగంగా దర్శనం అయ్యేందుకు టీటీడీ చర్యలు చేపడుతోంది. దీనికి టెక్నాలజీని వినియోగించుకోవాలని భావిస్తోంది. సీఎం చంద్రబాబు సూచన మేరకు గూగుల్‌తో ఒప్పందానికి రెడీ అవుతోంది. టీటీడీ–గూగుల్ మధ్య మరో వారంలో ఒప్పందం జరగనుంది. ఈ ఒప్పందం ప్రకారం తిరుమలకు వచ్చే భక్తుల దర్శనాలతోపాటు వసతి, వివిధ సేవల కోసం గూగుల్ సాయం తీసుకోనుంది.తిరుమలకు ఏ సీజన్‌లో భక్తులు అధికంగా వస్తున్నారు? రద్దీ ఎక్కువగా ఎక్కడ ఉంటోంది? ఏ టైమింగ్ ఎక్కువగా దర్శించుకుంటున్నారు? అనే సమాచారం టీటీడీ తెలియనుంది. అందుకు అనుగుణంగా గూగుల్ తన సేవలు అందించనుంది. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసుకోవడానికి వీలవుతుంది.దర్శనానికి సంబందించిన విధివిధానాలు, డ్రెస్ కోడ్, స్థానికంగా అనుసరించాల్సిన నియమాల గురించి ఏఐ సాయంతో భక్తులు తెలుసుకోవడం ఇక ఈజీ అవుతుంది. దేశ విదేశాల నుంచి భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వారి భాషల్లో సమాచారం అందించనుంది.ఒప్పందం తర్వాత గూగుల్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. గతంలో ఎదురైన ఘటనలు దృష్టిలో ఉంచుకుని మార్పులు చేర్పులు చేయనున్నారు. ఆ తర్వాత ఏఐని వినియోగించనున్నారు. కొన్ని దేవాలయాలు ఏఐని వినియోగిస్తున్నాయి. కేవలం భక్తులకు సమాచారం అందించడానికే పరిమితమైంది. తిరుమలలో ఏఐ సేవలు ఉచితంగా అందించడానికి గూగుల్ ముందుకొచ్చింది.గూగుల్ మ్యాప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు రద్దీ గురించి భక్తులు తెలుసుకోవడం వీలవుతుంది. ముఖ్యంగా భక్తులు ఎక్కువగా గదుల కోసం సీఆర్వో కార్యాలయం వస్తుంటారు. ఆ తర్వాత అన్న ప్రసాద కేంద్రం, కల్యాణ కట్ట వద్ద రద్దీ, ఆరోగ్య కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో ఇకపై ఎవర్నీ అడగాల్సిన అవసరం ఉండదు. నేరుగా ఫోన్ ద్వారానే సమాచారం తెలుసుకోవచ్చు. వారి ఫోన్‌లకే ఆయా నోటిఫికేషన్లు వస్తాయి.తిరుమలలో గూగుల్ ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయనుంది. తద్వారా అనుమానితులు, నిందితులు ఎవరైనా సంచరిస్తున్నారా? అన్నది నేరుగా విజిలెన్స్ సిబ్బందికి తెలియనుంది. దీంతో వారిపై నిఘా ఉంచేందుకు వీలవుతుంది. నిందితుల ఫొటోలు నిక్షిప్తంగా ఉంటాయి కూడా. ఏఐ ద్వారా దళారులకు అడ్డుకట్ట వేయవచ్చు. ఫలితంగా మోసపోయే భక్తుల సంఖ్య తగ్గడం ఖాయమన్నది టీటీడీ ఆలోచన.గూగుల్ ఏఐ ప్రాజెక్టు సక్సెస్ అయితే ఒక్కో భక్తుడికి శాశ్వత ఐడీ రానుంది. రాబోయే రోజుల్లో భక్తులు ఆ ఐడీ ద్వారానే దర్శనం, సేవలు, గదుల బుకింగ్ చేసుకోవచ్చు. ఆ భక్తుడు తిరుమల వచ్చినప్పుడు తన ఫోన్ ద్వారా సంబంధిత సేవలు తెలుస్తాయి.ఎవరెన్నిసార్లు దర్శనానికి వచ్చారు? ఎన్ని గదులు తీసుకున్నారనేది సమాచారం టీటీడీ వద్ద ఉండనుంది. కేవలం సమాచారానికి షేర్ చేయడానికి మాత్రమే కాకుండా రెండో వైపు తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వారి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు అందించే అవకాశం ఉండనున్నట్లు తెలుస్తోంది.

# పాపం...సుజనాచౌదరీ

విజయవాడ, మార్చి 29,

బీజేపీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరికి ఈసారి రాజకీయంగా కలసి రాలేదని అనుకోవాలి. బీజేపీలో ఉన్నప్పటికీ ఆయన కేవలం ఎమ్మెల్యేగా ఒక నియోజకవర్గానికి పరిమితం కావాల్సి వచ్చింది. రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ఆయన ఢిల్లీలో ఒక ఊపు ఊపిన నేత నేడు మౌనంగానే ఉంటున్నారు. తన నియోజకవర్గానికే పరిమితి అయ్యారు. కాదు.. కాదు.. నియోజకవర్గానికి.. అందులోనూ విజయవాడలోని ఒక ప్రాంతానికే పార్టీ పరిమితం చేసిందని చెప్పక తప్పదు. సుజనా చౌదరి సామాజికంగా, ఆర్థికంగా బలమైన నేత. టీడీపీ నుంచి బలమైన నేతగా ఎదిగినా 2019 ఎన్నికల్లో పార్టీ రాష్ట్రంలో ఓటమి పాలయిన తర్వాత సుజనా చౌదరి బీజేపీలోకి జంప్ అయ్యారు. అప్పటి వరకూ కేంద్ర మంత్రిగా ఆయన రాష్ట్రంలో పర్యటిస్తూ హల్ చల్ చేసేవారు. ఆయన తనకంటూ ఒక ఇమేజ్ ను ఏర్పరుచుకున్నారు. కానీ బీజేపీ ఆయన ను ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టినట్లయిందన్న కామెంట్స్ బలంగా వినిపిస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో సా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి పోటీ చేశారు. పార్టీ కూడా వెంటనే ఆయన కు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చింది. ఎంపీ టిక్కెట్ ఆశిస్తే ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి మొదటి దెబ్బ కొట్టిందంటారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో కూటమిలోని మూడు పార్టీలూ ఒక్కసారి కూడా గెలిచిన దాఖలాలు లేవు. తెలుగుదేశం పార్టీ ఒక్కసారి గెలిచింది కానీ అదీ 1983లో మాత్రమే. అంటే ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పుడు మాత్రమే ఇక్కడ టీడీపీ గెలిచింది. 1983 తర్వాత తెలుగుదేశం పార్టీకి ఇక్కడ విజయం అనేది దొరకలేదు. అంటే నలభై ఏళ్లకు పైగానే పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ జెండా చూడటం లేదనే చెప్పాలి. 2009లో వెల్లంపల్లి శ్రీనివాస్ ఇక్కడి నుంచి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా గెలిచారు. అయితే ఇక్కడ నుంచి సుజనా చౌదరి ఎట్టకేలకు నెగ్గుకొచ్చారు. గెలిచి చూపించారు. పార్టీ నాయకత్వం కూడా ఊహించలేదంటారు. ఆ నియోజకవర్గం చరిత్ర చూస్తే ఎవరైనా అక్కడి నుంచి పోటీ చేయడానికి భయపడే పరిస్థితి ఉంటుంది. ఈ నియోజకవర్గంలో ముస్లింలే ఎక్కువగా ఉంటారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి 1972లో అసిబ్ బాషా, 1989లో ఎంకే బేగ్, 1999లో కాంగ్రెస్, 20214లో వైసీపీ నుంచి జలీల్ ఖాన్ , 20024లో కమ్యునిస్టు పార్టీ అభ్యర్థిగా నాజర్ వలి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వామపక్షాలు కూడా బలంగా ఉన్నాయి. అంటే ఆ ఓటు బ్యాంకు సుజనాకు రావడం కష్టమేనని భావించి టిక్కట్ ఇచ్చిందా? అన్న అనుమానాలు అందరిలోనూ కలిగాయి. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సుజనా చౌదరి గెలుపొందారు. సుజనా చౌదరి తాను ఎమ్మెల్యేగా గెలవడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రి పదవి రావడం ఖాయమని భావించారు. కానీ ఆయన ఆశలుతలకిందులయ్యాయి. 2014లో కమ్మ సామాజికవర్గం నుంచి కామినేని శ్రీనివాసరావుకు అప్పట్లో మంత్రి పదవి లభించడంతో అదేకోటాలో తనకు లభిస్తుందనిగట్టిగా నమ్మకం పెట్టుకున్నా ఆయనకు



మంత్రి పదవి దక్కలేదు. సత్యకుమార్ కు మంత్రి పదవి లభించడంతో సుజనా తీవ్ర నిరాశకు గురయ్యారు. అప్పటి నుంచి పెద్దగా పార్టీలో యాక్టివ్ గా లేకపోవడంతో పాటు తన నియోజకవర్గానికే పరిమితం అవుతున్నారు. అలాగని పార్టీ కేంద్ర నాయకత్వాన్ని కాదనే సాహసాన్నిసుజనా చౌదరి చేయరన్నది వాస్తవం. ఎందుకంటే కేంద్ర నాయకత్వంతో పెట్టుకుంటే పాత కేసులు తిరగదోడే అవకాశముండటంతో సమయం కోసం వెయిట్ చేయడం తప్ప సుజనా చేయగలిగిందేమీ లేదు.

# రాప్తేడులో రంజుగా రాజకీయం

అనంతపురం, మార్చి 29,

రాప్తాడు.. రాయలసీమలో అత్యంత సున్నితమైన నియోజకవర్గం. ఇక్కడ రాజకీయం ఎప్పుడూ హాట్ హాట్‌గా ఉంటుంది. పరిటాల ఫ్యామిలీ వర్సెస్ తోపుదుర్తి కుటుంబం ఇందుకు కారణం. తాజాగా రాప్తాడులో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు అలర్ట్ అవ్వడంతో ఘర్షణలు జరగలేదు.రాప్తాడు రాజకీయం మళ్లీ వేడెక్కింది. టీడీపీ వర్సెస్ వైసీపీ ఫైట్ ఉద్రిక్తతకు దారితీసింది. వివిధ స్థానాలకు గురువారం జరిగిన మండలాధ్యక్షుల ఉప ఎన్నికలు ఉద్రిక్తతకు కారణమయ్యాయి.

రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఘర్షణకు దారితీశాయి. రాప్తాడులో అసలు ఏం జరిగిందో ఇప్పుడు చూద్దాం.ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ స్థానాలకు గురువారం మండలాధ్యక్షుల ఉప ఎన్నికలు జరిగాయి. రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది..రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదాపడడంతో మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు సుజాత, సాయిలీల, ఆదిలక్ష్మి, భారతి, వెంకటలక్ష్మి, చిన్నకొండయ్యలను బైండోవర్ చేయడం కోసం పోలీసులు పెనుకొండ తహసీల్దార్ వద్దకు తీసుకొచ్చారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, జడ్పీ ఛైర్ పర్సన్ గిరిజ అక్కడికి వచ్చారు. తమ పార్టీ ఎంపీటీసీ సభ్యులను బయటకు పంపాలని డిమాండ్ చేశారు.తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తన అనుచరులతో కలసి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించారు.

ఆయన్ను పోలీసులు అడ్డుకుని బయటకు పంపారు..అదే సమాయానికి తెలుగుదేశం పార్టీ నాయకులు అక్కడికి వచ్చారు. పరిటాల శ్రీరామ్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. పోటీగా వైసీపీ కార్యకర్తలు జగన్, ప్రకాష్ రెడ్డికి మద్దతుగా నినాదాలు చేశారు.పోటాపోటీ నినాదాలతో తహసీల్దార్ ఆఫీస్‌లో టెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను కంట్రోల్ చేశారు. అయినా నినాదాలు ఆగలేదు..తెలుగుదేశం పార్టీ నాయకులకు ఇక్కడేం పని అని తోపుదుర్తి పోలీసులను ప్రశ్నించారు. టీడీపీ లీడర్ల నినాదాలపై ఆగ్రహించిన ప్రకాష్ రెడ్డి.. వారిపైకి దూసుకెళ్లారు.ఈ సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వెంటనే పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

పోలీసుల చర్యలపై ఆగ్రహించిన ఉషశ్రీచరణ్, గిరిజ పార్టీ శ్రేణులతో కలసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు.బైండోవర్ చేసిన తరువాత ఎంపీటీసీ సభ్యులను అధికారులు బయటకు పంపారు. వారిలో ఐదుగురు ఎంపీటీసీలు వైసీపీ నాయకులతో వెళ్లారు. ఒకరు మాత్రం టీడీపీ నాయకులతో వెళ్లిపోయారు.తాజాగా పరిస్థితుల నేపథ్యంలో.. రాప్తాడు నియోజకవర్గంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. రామగిరి మండలంలో ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు. సున్నితమైన గ్రామాలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు.

=============

## ఏసీబీ వలలో ఆర్ఐ

అనకాపల్లి మార్చి 29,

అనకాపల్లి జిల్లా నక్కపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఇన్ ఛార్జ్ ఆర్ఐ కన్నబాబు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. రైతు వద్ద 12 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. పొలం లో బోర్ కనెక్షన్ ఇచ్చేందుకు ఆర్ఐ కన్నబాబు లంచం అడగడం తో.. రైతు ఏసీబీ ని ఆశ్రయించారు.దింతో అధికారులు కన్నబాబు లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్నారు.

## తెలుగుజాతి ఆశాజ్యోతి తెలుగుదేశం: డాలర్స్ దివాకర్

తిరుపతి

తెలుగుజాతి ఆశాజ్యోతి గా, పేదల పక్షపతిగా నిలిచి నాలుగు దశాబ్దాల పైగా సేవలందిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి డాలర్స్ గ్రూప్ అధినేత డాక్టర్ సి దివాకర్ రెడ్డి కొనియాడారు.



శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రేణిగుంట డాలర్స్ గ్రూప్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన తెలుగుదేశం జెండాను ఎగురవేసి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ యుగపురుషుడు ఎన్టీఆర్ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటాలనే ఉద్దేశ్యముతో తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారన్నారు.

ఆయన స్ఫూర్తితో సీఎం నారా చంద్రబాబు నాయుడు పార్టీకి రథసారథిగా పేదల పక్షపాతిగా తెలుగుజాతికి సేవలందించారని కొనియాడారు. ఆయన మార్గదర్శకంలో పార్టీ అంచలంచెలుగా ఎదుగుతూ నేడు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకుందని తెలిపారు. కార్యకర్తలు పార్టీకి అండగా నిలబడి జెండా భుజాన మోస్తూ సేవ చేయడం అభినందనీయమన్నారు. యువ నేత రాష్ట్ర మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని వారి శ్రేయస్సుకు పాటుపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ కార్యకర్తల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విలేకరులపై దాడులు తగదు

బద్వేలు

రాష్ట్ర వ్యాప్తంగా విలేకరులపై జరుగుచున్న దాడులపై ప్రభుత్వాలు తగు చర్య తీసుకోవాలని కడప జిల్లా ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, దళిత ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజా సమస్యలపై జీతభత్యాలు లేకుండా సమస్యల సాధనకై కృషి చేస్తున్న పత్రికా విలేకరులపై దాడిని సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని వారు అన్నారు. విజయవాడలో ప్రజాపాలన దినపత్రిక స్టేట్ బ్యూరో పీతల అప్పాజీ పై అక్కడ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది దాడి చేయడం అనేది దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నాం అని అన్నారు. ఆస్పత్రిలో ఓపి విభాగంలో రోగులు అధికంగా ఉండటం దృష్ట్యా వారికి కనీస సదుపాయాలు కల్పించాలనే విధంగా ఉన్నటువంటి విధానాన్ని వార్త కవరేజ్ కి చేస్తున్న అప్పాజీ పై దాడి చేసి సెల్ఫోన్ లాక్కొని తీవ్ర పథజాలంతో దూషించడాన్ని ఖండిస్తున్నాం అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రవ్యాప్తంగా విలేకరులపై జరుగుచున్న దాడులను అరికట్టాలని, విలేకరులకు రక్షణ కల్పించాలని అప్పాజీ పై దాడి చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలకు వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విలేకరులకు దాడులను అరికట్టే విధంగా ఒక టీం ఏర్పాటు చేసి న్యాయపరంగా విలేకరులకు భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా విలేకరుల పట్ల ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు వారి సేవలు వినియోగించుకొని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి తప్ప విలేకరులపై దాడులు చేయడం అనేది సభ్య సమాజం లో సిగ్గుచేటని అన్నారు.

## నేడు ఉగాది పండుగ

కొడిమ్యాల,నేడు తెలుగు సంవత్సరంగా జరుపుకునే పండుగ ఉగాది తెలుగు ప్రజలు ఎంతో భక్తి తో జరుపుకుని చిన్నలు, పెద్దలు ఉదయమే మేల్కొని కొత్త బట్టలు ధరించి ఉగాది పచ్చడిని స్వీకరించి ఫలహారాలు చేసుకుని తిని సాయంత్రం వేళ ఆలయాలకు వెళ్లి పంచాంగశ్రవణం చేస్తారు. ఈ ఉగాది విశ్వవాసు సంవత్సరం పేరుతో పిలుస్తారు. ఉగాదిలో ఉగ' అంటే నక్షత్ర గమనం. నక్షత్ర గమనానికి ఆది ఉగాది అంటే సృష్టి ఆరంభమైన రోజే ఉగాది. యుగం అనగా 'ద్వయం; లేదా 'జంట' అని అర్థం. ఉత్తారయణ, దక్షిణాయణలు కలిసి యుగం కాగా.. ఆ యుగానికి మొదలు యుగాదిగా మారింది. యుగాది శబ్దానికి ప్రతిరూపంగా కాలక్రమేణా ఉగాదిగా రూపొందింది.

# నెక్ట్స్ ఎవరు...

గుంటూరు, మార్చి 29,

వైసీపీ అధినేత జగన్ కు సొంత పార్టీలో పనిచేసిన వారే శత్రువులుగా మారుతున్నారు. వారిని రెచ్చగొట్టే మాటలు మాట్లాడటంతోనే వారు నిజాలు బయటపెడుతున్నారు. వారే ఇప్పుడు ప్రధానంగా ఆరోపణలు చేస్తుండటంతో అందుకు బలమైన ఆధారాలను బయటపెడుతూ జగన్ ను కొంత డైలమాలో పడేస్తున్నారు. బాలినేని శ్రీనివాసులురెడ్డి, విజయసాయిరెడ్డి, లావు శ్రీ కృష్ణ దేవరాయలు వీళ్లు ముగ్గురు 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచిన వారే. వీరిలో ఒకరు మంత్రి పదవి చేపట్టగా, మరొకరు ఎంపీగా గెలిచారు. మరొకరు రాజ్యసభకు ఎన్నికయ్యారు. అయితే వీరు చేస్తున్న ఆరోపణలకు టీడీపీకి ఊతమిచ్చినట్లయింది. ఎందుకంటే కొన్నేళ్ల పాటు పార్టీలో ఉండి దగ్గరగా చూసిన వ్యక్తులు కావడంతో వారు చెప్పే మాటలను కూడా ప్రజలు విశ్వసించే అవకాశముంది అయితే వెళ్లిన నేతలను గెలుకుతున్నందునే వారు విమర్శలు చేస్తున్నారంటున్నారు. విజయసాయిరెడ్డి తన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు. అప్పుడు కూడా జగన్ విషయంలో ఆయన మాట తూలలేదు. తనకు రెండు సార్లు రాజ్యసభ పదవి ఇచ్చిన జగన్ కు ధన్యావాదాలు సాయిరెడ్డి తెలిపారు. వైఎస్ కుటుంబం అంటే వల్లమాలిన ప్రేమ అని కూడా చెప్పారు. కానీ ఆ తర్వాత జగన్ ఒక మీడియా సమావేశంలో సాయిరెడ్డి గురించి చేసిన వ్యాఖ్యలు ఆయనకు ఆగ్రహాన్ని తెప్పించాయని అంటున్నారు. విజయసాయిరెడ్డి లాంటి వాళ్లు కూడా భయపడితే.. బెదిరిస్తే.. ప్రలోభాలు చూపితే లొంగిపోతే ఎలా అని ప్రశ్నించారు. దీంతో సాయిరెడ్డికి కాలి మద్యం కేసులో ఉన్న విషయాలను కక్కేసారు. సాయిరెడ్డి విషయాన్ని జగన్ ప్రస్తావించకపోయి ఉంటే ఈ విషయాన్ని ఆయన బయటపెట్టి ఉండేవారు కాదంటున్నారు. ఇక నరసరావుపేట ఎంపీగా పనిచేసిన లావు శ్రీ కృష్ణదేవరాయలు కూడా అంతే. ఆయన పార్టీ మారి టీడీపీలో చేరినా తన పని తాను చేసుకుంటున్నారు. పెద్దగా విమర్శలు చేయడం లేదు. జగన్ పేరు ఎక్కడా లావు శ్రీ కృష్ణదేవరాయలు ఈ పదినెలల కాలంలో ప్రస్తావించలేదు. గత ఐదేళ్లలో జరిగిన విషయాలను కూడా బయట పెట్టలేదు. తన మానాన తన పని చేసుకుని పోతున్న లావు శ్రీ కృష్ణదేవరాయలను మాజీ మంత్రి విడదల రజనీ గెలికారు. తన ఫోన్ ను ట్యాపింగ్ చేశారని, లావుపై ఆరోపణలు రజనీ చేయడంతో ఆయన వెంటనే లోక్ సభలోనే మద్యం కుంభకోణం జరిగిందని, రెండు వేలకోట్లు దుబాయ్ తరలించినట్లు చెప్పారు. అంతటితో ఆగకుండా నేరుగా అమిత్ షాను కలసి ఈడీ అధికారుల చేత సోదాలను నిర్వహించాలని కూడా కోరారు. ప్రస్తుతం మద్యం కుంభకోణంపై దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉంది. మద్యం కుంభకోణం విషయంలో జగన్ కు ప్రధాన శత్రువులుగా మారింది సొంత పార్టీ నేతలే. తొలుత విజయసాయిరెడ్డి ఈ విషయం బయటపెట్టారు. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేరును విజయసాయిరెడ్డి బయట పెట్టారు. తర్వాత లావు వచ్చి ఎన్ని నిధులు చేతులు మారింది చెప్పారు. ఇక బాలినేని కూడా తన డిజిటల్ సంతకాన్ని ఉపయోగించి నిర్ణయాలు తీసుకున్నారని కూడా ఆరోపించారు. బాలినేని విషయంలోనూ గెలుక్కోవడంతో పాటు ఆయనను వైసీపీ నేతలు టార్గెట్ చేయడంతో శ్రీనివాసులు రెడ్డి కూడా బయటపడ్డారు. ఇంకా చాలా విషయాలు బయటపెడతామంటూ హెచ్చరిస్తున్నారు. ఇలా ఎలా చూసినా కెలుక్కోవడం ఎందుకు? కక్కించుకోవడం ఎందుకు? అన్న ప్రశ్న ఇప్పుడు సర్వత్రా వినిపిస్తుంది.

# అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ

విజయవాడ మార్చి 29

టెక్ చంద్రబాబు మరో పెద్ద ప్రయత్నం చేస్తున్నారు. దేశంలోని తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీని అమరావతిలో ఏర్పాటు చేయిస్తున్నారు. ఐకె దిగ్గజం ఐఐటీ మద్రాస్ ఇందులో భాగస్వామ్యం వహిస్తోంది. దీనికి సంబంధించిన అవగాహన కుదిరింది. ఐఐటీ మద్రాస్‌లో ఓ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. భారత్ 2023లో 6వేల కోట్లతో ప్రకటించిన నేషనల్ క్వాంటమ్ మిషన్ కు అనుగునంగా ఇది ఉంటుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా అమరావతిలో భారీ క్వాంటమ్ టవర్‌ను నిర్మిస్తారు.క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ అనేది క్వాంటమ్ టెక్నాలజీ పరిశోధన–అభివృద్ధికి కేంద్రంగా ఏర్పడే హబ్. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎికి సిలికాన్ వ్యాలీ ఏవిధంగా కేంద్రమో? క్వాంటెక్నాలజీకి ఇది కూడా ముఖ్యకేంద్రంగా ఉంటుంది. క్వాంటమ్ కంప్యూటర్లు క్విబిట్స్ అనే ప్రత్యేకమైన డేటా యూనిట్లను ఉపయోగించి సాధారణ కంప్యూటర్ల కంటే వేగంగా సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించగలుగుతాయి.. ఇది డ్రగ్ డిస్కవరీ, క్లైమేట్ మోడలింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకురావచ్చు.టెక్నాలజీలను ఒడిచిపట్టుకోవడంలో చంద్రబాబు తీరే వేరు. ఆయన నేతృత్వంలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 30ఏళ్ల కిందటే ఐటీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఐటీ తర్వాత వచ్చిన బయో టెక్నాలజీని కూడా చంద్రబాబు ప్రోత్సహించారు. అప్పుడే జీనోమ్ వ్యాలీని ఏర్పాటు చేయించారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత బ్లాక్ చైన్, క్లౌడ్ కంప్యూటింగ్, ఫిన్‌టెక్ వచ్చాయి. మూడోసారి సీఎం అయినప్పుడు వాటికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆ తర్వాత ఆయన ఓడిపోయారు. ఇప్పుడు మోస్ట్ అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ టెక్నాలజీపై దృష్టి సారించారు. క్వాంటమ్ వ్యాలీని అమరావతి కేంద్రంగానే ఏర్పాటు చేయనున్నారు.ఈ ప్రాజెక్ట్ భారతదేశపు నేషనల్ క్వాంటమ్ మిషన్‌తో అనుసంధానంగా ఉంది, దీని కోసం 2023లో ?6,000 కోట్ల బడ్జెట్ కేటాయించారు. ఈ మిషన్ లో 50 నుండి 1,000 ఫిజికల్ క్విబిట్స్ కలిగిన మధ్యస్థాయి క్వాంటమ్ కంప్యూటర్ల అభివృద్ధి, దేశీయంగా అంతర్జాతీయంగా 2,000 కిలోమీటర్ల దూరంలో శాటిలైట్ ఆధారిత భద్రతా కమ్యూనికేషన్ వ్యవస్థలు స్థాపన వంటి లక్ష్యాలున్నాయి.ఈ ప్రాజెక్ట్‌లో ఐఐటీ మద్రాస్ భాగస్వామ్యం ఉంది. అంతేకాకుండా, టీసీఎస్, ఎఃఓ వంటి ప్రముఖ టెక్ కంపెనీలు కూడా ఇందులో భాగస్వామ్యమవుతాయని తెలుస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టీసీఎస్, ఎఃఓ సంస్థలతో చర్చలు జరిపింది. "క్వాంటమ్ టెక్నాలజీ అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులను తెస్తుంది. 1990లలో ఐటీ రంగంలో ముందుండినట్లుగా, ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీలో నాయకత్వం వహించాలి" అని చంద్రబాబు ఐఐటీ మద్రాస్ కార్యక్రమంలో అన్నారు. ఇప్పటి వరకూ కెనడాలోని వాటర్ లూ , జర్మనీలోని మ్యూనిచ్ లో క్వాంటమ్ వ్యాలీలు ఉన్నాయి. అమరావతి కేంద్రాన్ని కూడా అదే రీతిలో అభివృద్ధి చేయాలన్నది ఆలోచన. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం మార్చ్ 18న ఓ టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని నిపుణులతో ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో పాటు.. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడం, భాగస్వామ్యాలు నెలకొల్పడం ఈ టాస్క్ ఫోర్స్ ప్రధాన ఉద్దేశ్యం

# విదేశాలకు విశాఖ కార్పరేటర్లు...

విశాఖపట్టణం, మార్చి 29,

గ్రేటర్ విశాఖ పీఠం ఫైట్ పీక్స్‌కు చేరుకుంది. మేయర్ పీఠం కోసం కూటమి, వైసీపీ నేతలు వేగంగా పావులు కుదుపుతున్నారు. క్యాంప్ పాలిటిక్స్‌లో స్పీడ్ పెంచారు. వైసీపీ కార్పొరేటర్లను బెంగళూరుకు తరలిస్తే.. కూటమి కార్పొరేటర్లను ఏకంగా దేశం బార్డర్ దాటించేస్తున్నారువిశాఖ మేయర్ పీఠం కోసం కూటమి, వైసీపీ మధ్య ఫైట్ రోజురోజుకు తీవ్రమవుతోంది. పీఠాన్ని కాపాడుకోవడానికి వైసీపీ, మేయర్ సీటు కోసం కూటమి తెగ ట్రై చేస్తున్నారు. ఏ వర్గం ఎక్కడా తగ్గడం లేదు. ఎవరికి వారు ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నారు. కూటమి నాయకులు ప్రస్తుత మేయర్ హరి వెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి.. పదవిని దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు.నిజానికి కూటమి అధికారంలోకి రాగానే.. మేయర్ హరి వెంకట కుమారికి పదవీ గండం తప్పదనే ప్రచారం జరిగింది. ఐతే సవరించిన మున్సిపల్ చట్టం ప్రకారం అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే కనీసం నాలుగేళ్ల గడువు పూర్తి కావాలి. ఇప్పుడు ఆ టైమ్ మార్చి 18తో ముగిసింది. దీంతో కూటమి పార్టీలు.. ప్లాన్ ఆఫ్ యాక్షన్ మొదలుపెట్టేశారు. అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కూటమి నాయకులు కలెక్టర్‌ను కలిసి నోటీసు ఇచ్చారు.అవిశ్వాస తీర్మానంపై నోటీసులో సంతకాలు చేసిన కార్పొరేటర్లకు కలెక్టర్ నుంచి లేఖలు అందాలి. వారు సమ్మతిస్తే.. సంతకాలను మారోసారి పరిశీలించి మేయర్‌పై అవిశ్వాసం పెట్టడానికి సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు సమయం పట్టే అవకాశముంది. దీంతో కూటమి పార్టీలు క్యాంప్ రాజకీయాలను నమ్ముకున్నారు. కూటమి కార్పొరేటర్లతో పాటు కూటమికి మద్దతు తెలుపుతున్న కార్పొరేటర్లను ఏకంగా దేశం దాటించాడాని డిసైడ్ అయ్యారు. వీరందరిని మలేసియా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారట. ఇప్పటికే కార్పొరేటర్లు.. టీడీపీ ఫ్లోర్ లీడర్‌కు పాస్‌పోర్టులు ఇచ్చేశారట.ఇటు వైసీపీ కూడా మేయర్ పీఠం కాపాడుకునేందుకు వెనక్కి తగ్గడం లేదు. పార్టీ నాయకులు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లతో సమావేశాలు నిర్వహించారు. కూటమి ఆకర్షణలకు లొంగకుండా తమ వారిని కాపాడుకోవడానికి వైసీపీ క్యాంప్ రాజకీయాలకు తెరలేపింది.ఇప్పటికే 36 మంది కార్పొరేటర్లను కుటుంబ సమేతంగా బెంగళూరు, ఊటీకి తరలించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 5లోపు అవిశ్వాస తీర్మానం జరిగే అవకాశముంది. కనీసం 10 రోజుల పాటు కార్పొరేటర్లను క్యాంపుల్లోనే ఉంచాలని వైసీపీ నిర్ణయించినట్లు సమాచారం. ఈ వ్యూహంతో కూటమికి అవసరమైన సంఖ్యాబలం దక్కకుండా చేయాలని చూస్తోంది వైసీపీ. ఈ రెండు వర్గాల వ్యూహాలతో విశాఖ రాజకీయాలు హడావిడిగా మారాయి.జీవీఎంసీలో మొత్తం కార్పొరేటర్ల సంఖ్య 98. గ్రేటర్ పీఠం దక్కాలంటే 74మంది మద్దతు అవసరం. 2001 ఎన్నికల్లో 59 స్థానాల్లో వైసీపీ, 29 స్థానాల్లో టీడీపీ కార్పొరేటర్లు గెలిచారు. మిగిలిన వాటిలో ఇండిపెండెంట్లు నలుగురు, జనసేన నుంచి ముగ్గురు విజయం సాధించారు.ఐతే కూటమి అధికారంలోకి వచ్చాక నంబర్ మారిపోయింది. 20మంది వరకు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ, జనసేన కూటమిలోకి జంప్ అయ్యారు. దీంతో జీవీఎంసీలో కూటమి బలం 53కి పెరగ్గా.. వైసీపీ బలం 38కి పడిపోయింది. దీనికి తోడు మరికొంతమంది వైసీపీ కార్పొరేటర్లు సైతం కూటమికి జైకొట్టేందుకు రెడీ అవుతున్నారట.ఈ పరిణామాలతో విశాఖ రాజకీయాలు హీటెక్కాయి. కూటమి అవిశ్వాస తీర్మానం విజయవంతమైతే, వైసీపీకి పెద్ద ఎదురుదెబ్బ తప్పేలా లేదు. రాష్ట్రంలోని అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌పై కూటమి పట్టు సాధిస్తుంది. మరోవైపు, వైసీపీ తన వ్యూహంతో అవిశ్వాసాన్ని విఫలం చేస్తే, కూటమికి ఇది రాజకీయంగా చేదు అనుభవం అవుతుంది. ప్రస్తుతం రెండు వర్గాలు కార్పొరేటర్లను కాపాడుకోవడానికి, ఆకర్షించడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ పోరులో ఎవరు గెలుస్తారనేది త్వరలోనే తేలనుంది.

## వ్యక్తి జీవన విధానంలో చైతన్యాన్ని ప్రేరేపించే మాసం రంజాన్

జకాత్ దానం ద్వారా తమ సామాజిక వర్గ అభ్యున్నతికి సవాలక్ష అవకాశాలు ఉన్న, తెలుగు నాటతో సహా సమస్త భారత దేశంలోనూ అటువంటి కృషి జరుగుతున్న ఉద్దంతం ఒకటి కూడా లేకపోవడం విచారకరం. జకాత్ దానం ద్వారా విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టవచ్చు. ముస్లిం సమాజంలోని పేదలకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థ గాని,ఆసుపత్రి గాని,తెలుగు నాట ఒకటి కూడా లేదు.కనీసం నవాబుల నగరమైన హైదరాబాదులో విద్యా అవకాశాల కొరకు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే, ముస్లిం బాల బాలికలకు నీడనివ్వడానికి విద్యార్థుల వసతి గృహం ఒకటి కూడా లేదంటే పరిస్థితిని ఊహించుకోవచ్చు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఇళ్లలో, మసీదులలో, జకాత్ ఇవ్వమని వచ్చే అసంఖ్యాకులలో ఏ ఒక్కరు కూడా ఒక పాఠశాల లేదా, వైద్యశాల నిర్మాణం, కోసం రాకపోవడానికి కారణం ఆ దిశగా సమాజం అడుగువేయకపోవడమే కాదూ.సామాజిక వికాస కార్యక్రమాలను జకాత్ ద్వారా చేయడం పెద్ద సమస్య ఏమి కాకున్నా ఎందుకు ముస్లిం సమాజం మినాంటి ఉండిపోతుంది. హైదరాబాద్ నగరంలోని ఒక టోలిచౌకి ప్రాంతానికి చెందిన ప్రవాసులు నిబద్ధతగా జకాత్ ఇస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ముస్లిం సామాజికులకు ఈ దిశగా నేతృత్వం వహించే ఆమోదయోగ్యమైన నాయకుడు ఒక్కడు కూడా లేకుంటే ఆశ్చర్యము కలుగుతుంది.అటు కర్ణాటక సరిహద్దులోని హిందూపురం మొదలు, ఇటు మహారాష్ట్ర సరిహద్దులోని బోధన వరకు తెలుగు నాట ముస్లిం సమాజం దీనిపై ఆత్మ విమర్శ చేసుకోవాలి.తమ వెనుకబాటుతనానికి పాలకులే కారణం అంటూ నిందించటం వల్ల ప్రయోజనం ఏముంది. వివక్షకు గురవుతున్న బాధితులుగా చెప్పుకుంటూ వాపోవడం కంటే తమ పరిధిలో తమ ఎంతవరకు తమవారికి మేలు చేయగలుగుతామనే కనీస కిం కర్తవ్యాన్ని ముస్లిములు విస్మరిస్తున్నారు. ప్రార్థనలతో పాటు దానానికి కూడా ముందుకు వస్తేనే ఆధ్యాత్మికతకు పరిపూర్ణత ఉంటుందని నూర్ భాషా సంఘం నందికొట్కూరు మండల అధ్యక్షుడు డి.గోకరి సాహెబ్ తెలిపారు.ఈ నెలలో స్వర్గ ద్వారాలు పూర్తిగా తెరిచి ఉంటాయి నరక ద్వారాలు మూతపడతాయి వయసుతో నిమిత్తం లేకుండా విశ్వాసులు ఇంటిల్లిపాది రాత్రింబవులు ఆధ్యాత్మికత లో మునిగి తేలుతారు. దైవం పట్ల విశ్వాసాన్ని పటిష్టపరుచుకుంటారు. పుణ్య కార్యాల పట్ల ఆకాంక్షను పాపకర్యాల, పట్ల విముకుతను పెంచుకుంటారు. అల్లాహ్ తన బోధనామృతాన్ని ప్రజలకు అందజేసిన మాసం ఇది ఆయన తన అపార అనుగ్రహాన్ని వర్షిస్తాడు. ధనవంతులకు పేదల హక్కును గుర్తుచేసి జకాత్, పిత్రాలాంటి ధర్మాలను నిర్వర్తించడాన్ని విధిగా నిర్దేశించిన రంజాన్ నెల ఉపవాసాల ద్వారా ఆర్తుల ఆకలి దప్పులను సంపన్నులకు అనుభవపూర్వకంగా తెలియజేస్తుంది. దానధర్మాలకు సంబంధించిన కార్యాలు ముమ్మరమవుతాయి, సోదర భావం పరస్పరం బలపడుతుంది. శాంతియుత వాతావరణం లో విశ్వాసులు భక్తి ప్రవర్తులతో ప్రార్థనలు చేస్తారు. యంత్రాలు ఎడతెరిపి లేకుండా కొంతకాలం పని చేసిన తర్వాత వాటికి విశ్రాంతి కావాలి. వాటి భాగాలను ఊడదీసి శుభ్రం చేయాలి. అప్పుడే మలినాలన్నీ పోతాయి. మళ్లీ సమర్థమైన విధి నిర్వహణకు సిద్ధమవుతుంది. అలాగే మన జీర్ణ వ్యవస్థకు విశ్రాంతిని ఇచ్చి దానికి క్రమబద్ధతను చేకూర్చే ఆరాధన రోజా ఉపవాసం అని రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులందరికీ డి.గోకరిసాహెబ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రముఖ మెహందీ ఆర్టిస్టు పింకీ ఆత్మహత్య

రంగారెడ్డి

రాజేంద్రనగర్ అత్తాపూర్ లో విషాదం జరిగింది... హైదరాబాద్ టాప్ మెహందీ ఆర్టిస్ట్ పింకీ ఆత్మహత్య చేసుకుంది. చున్నీ తో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. అత్తాపూర్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సంవత్సరం క్రితం అమిష్ లోయా అనే వ్యక్తి తో పింకీ కోర్టు మ్యారేజ్ చేసుకుంది. కుటుంబ కలహాల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. పింకీ ఆత్మహత్య కు తన భర్త వేధింపులు కారణమా లేదా వేరే ఏమైనా కారణమా అనే కోణం లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నరు...

## ఆక్రమిత భూమిని తొలగించాలని కాసినాయన ఎమ్మార్వో కు బద్వేలు ఆర్డీఓ ఆదేశాలు

బద్వేలు

బద్వేలు నియోజకవర్గం కాసినాయన మండలం గొంటువారిపల్లె గ్రామములో 12 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఆక్రమణ జరిగిందని అనేకసార్లు ఆర్డీవో దృష్టికి రావడంతో శుక్రవారం తీటనీ చంద్రమోహన్ స్పందించారు.ఈ మేరకు కాసినాయన ఎమ్మార్వో వెంకటసుబ్బయ్య కు తక్షణమే ఆక్రమణ వాగుకు హద్దులు నిర్ణయించి ఆక్రమిత భూమిని తొలగించి వారి పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో చంద్రమోహన్ ఆదేశాలు జారీచేశారు.



ఆర్డీవో ఆదేశాలతో ఎమ్మార్వో వెంకటసుబ్బయ్య వెంటనే స్పందించి ఆక్రమణ వాగును పరిశీలించి, ఎర్ర జండాలు పాతి హద్దులు నిర్ణయించారు.రెండురోజుల లో ఆక్రమిత భూమిని తొలగించి ప్రభుత్వ వాగును స్వాధీనం చేసుకుంటామని,ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో విఆర్ఓ నాయబ్ రసూల్, సర్వేయర్ నవదీప్, వీఆర్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్యనటుడు, నూటొక్క జిల్లాల అందగాడు నూతన్ ప్రసాద్

–నేడు ఆయన వర్ధంతి

( పెంద్యాల రామ్ కుమార్, మంథని ) నూటొక్క జిల్లాల అందగాడు నూతన్ ప్రసాద్ అసలు పేరు తడినాథ వరప్రసాద్. 1970వ, 80వ దశకములో తెలుగు సినిమా రంగములో ప్రసిద్ధి చెందిన హాస్య నటుడు,ప్రతినాయకుడు.

నూతన్ ప్రసాద్ 1945, డిసెంబర్ 12న కృష్ణా జిల్లా కైకలూరులో జన్మించాడు. బందరులో ఐటిఐ చదివిన ప్రసాద్, నాగార్జునసాగర్, హైదరాబాదులో ఉద్యోగాలు చేశాడు.

ఎచ్ఎఎల్ లో ఉద్యోగం చేస్తున్న సమయంలో రంగస్థల నటుడు, దరశ్యకుడైన భాను ప్రకాష్ పరిచయం అయ్యాడు. భాను ప్రకాష్ స్థాపించిన 'కళారాధన' సంస్థ తరపున ప్రదర్శించిన 'వలయం', ' గాలివాన', 'కెరటాలు' వంటి నాటకాలు ద్వారా నూతన్ ప్రసాద్ నాటకరంగానికి పరిచయమయ్యాడు. ఎ.ఆర్.కృష్ణ దర్శకత్వంలో మాలపల్లి 101 సార్లు ప్రదర్శించాడు.

1973 లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి అక్కినేని నాగేశ్వరరావు నటించిన అందాల రాముడు చిత్రంతో చిత్రరంగ ప్రవేశము చేశాడు. ఆ తరువాత నీడలేని ఆడది మొదలైన చిత్రాలలో నటించినా, ఈయనకు తొలి గుర్తింపు ముత్యాల ముగ్గు చిత్రంలో రావుగోపాలరావుతో పాటు ప్రతినాయకునిగా నటించడముతో వచ్చింది. ఈ చిత్రము విజయముతో తదుపరి అనేక చిత్రాలలో ప్రతినాయకుని పాత్రలు వచ్చాయి. అవన్నీ ఈయన తనదైన శైలిలో పోషించాడు. ఈయన తనదైన శైలిలో పలికే సంభాషణలతో ప్రతినాయక పాత్రలకు హాస్యవన్నె లద్దారు. అనేక చిత్రాలలో అగ్ర నటులైన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఘట్టమనేని కృష్ణ, చిరంజీవి సరసన హాస్య, ప్రతినాయక, సహాయ మొదలైన విభిన్న పాత్రలు పోషించాడు. ఒక చిత్రంలో కథానాయకునిగా కూడా నటించాడు.

నూతన్ ప్రసాద్ సైతాన్గా నటించిన రాజాధిరాజు చిత్రముతో ఈయన నట జీవితము తారాస్థాయికి చేరుకొన్నది. 1984 లో సుందరి సుబ్బారావు చిత్రంలో నటనకు ఆయనకు నంది పురస్కారం లభించింది. 2005 లో ఎన్టీఆర్ పురస్కారం లభించింది. తన 365వ సినిమా 'బామ్మమాట బంగారుబాట' చిత్రీకరణ సమయంలో జరిగిన ప్రమాదంలో గాయపడి కొంతకాలం నటజీవితామనికి దూరంగా ఉన్నా తిరిగి కోలుకుని నటించడం మొదలెట్టి, 112 సినిమాలలో నటించాడు. కాళ్ళు అచేతనావస్థలో ఉండిపోయిన కారణంగా పరిమితమైన పాత్రలనే పోషించగలిగాడు. 'దేశం చాలా క్లిష్టపరిస్థితిలో ఉంది' 'నూటొక్క జిల్లాల అందగాడిని' అనే డైలాగులు ప్రేక్షకాదరణ పొందాయ. ఎన్ని వైవిధ్యమైన పాత్రలు, ఏ ప్రాత పోషించినా ప్రాణం పోసేవాడు.. ప్రసాద్ దాదాపు 365 సినిమాల్లో నటించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొద్ది రోజులు రవీంద్ర భారతికి ఇన్‌ఛార్జ్ గా ఉన్నాడు. వ్యక్తిగతంగా తెలుగుదేశం పార్టీ అభిమాని.ఆయన మార్చి 30, 2011 బుధవారం హైదరాబాదులో అనారోగ్యంతో కన్నుమూశాడు.

## మారనున్న బెల్లంపల్లి

అదిలాబాద్, మార్చి 29,

ఎట్టకేలకు బెల్లంపల్లి కార్మిక క్షేత్రానికి మహర్దశ ఆవరించింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల మంజూరులో బెల్లంపల్లికి చోటు కల్పి ంచారు. దీంతో ఈ ప్రాంత వాసుల్లో సంతో షం వెల్లివెరుస్తోంది. పారిశ్రామిక ప్రాంతం గా పేరుగాంచి భూగర్భ గనుల వెనుకడుగుతో బెల్లంపల్లి ఉనికినీ కోల్పోతుంది. ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరుతో బెల్లంపల్లికి పూర్వ వైభవం రానుంది. నూతనంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరులో బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజక వర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. రూ. 200 కోట్లతో ఒక్కో పాఠశాల 25 ఎకరాల విస్తీర్ణంలో అత్యున్నతమైన ప్రమాణాలతో భవనాలు ఏర్పాటు చేయనున్నారు.నూతనంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల విద్యా బోధన లభిస్తుంది. భవిష్యత్తులో కేజీ నుంచి పీజీ వరకు ఈ ప్రాంతం పిల్లలకు అత్యున్నతమైన విద్య అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరులో ప్రత్యేక చొర వను కనపరిచినట్లు తెలుస్తుంది. సీఎం రేవం త్‌రెడ్డిని ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు విషయంలో తగిన శ్రద్ధ వహించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. బెల్లంపల్లిలో పాలిటెక్నిక్ కళాశాల మాత్రమే ఉన్నత విద్యా అవ కాశాలకు ఏకైక మార్గంగా ఉంది. ఎంతోకాలంగా ఈ ప్రాంత ప్రజలు తమ పిల్లల ఉన్న త విద్య కోసం సుదూర ప్రాంతాలకు పంపిస్తున్నారు.లక్షల రూపాయలను కార్పొరేటు కళాశాలలకు ఫీజులు రూపంలో చెల్లిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో ఈ ప్రాంత విద్యార్థులు అందిపుచ్చుకోనున్నారు. ఇప్పటి వర కు బెల్లంపల్లి ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఏ ఎమ్మెల్యే, ప్రభుత్వాన్ని ఒప్పిం చి ఉన్నత విద్య కళాశాలను సాధించిన ఘనత లేదు.బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను సాధించి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇదే కాకుండా బెల్లంపల్లిలో ఇంజనీరింగ్ కళాశాల కూడా తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఇంజనీరింగ్ కళాశాల ఒకటి అనే విషయం తెలిసిందే. ఇది ఇలా ఉంటే అత్యున్నతమైన విద్య ప్రమాణాలు గల స్కూల్‌ను సాధించడంతో ఈ ప్రాంత ప్రజలు ఆనంద డోలికల్లో మునిగిపోతున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుతో బెల్లంపల్లి జాతీయస్థాయిలో విద్య ప్రమాణాల సరసాన నిలువనుంది. ఏది ఏమైనా ఈ ప్రాంత ప్రజల ఊహకందని అత్యున్నతమైన విద్య ప్రమాణాలు గల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కల నెరవేరినట్టయింది. ఈ మేరకు అధికారగణం స్కూల్ నిర్మాణం కోసం 25 ఎకరాల స్థల సేకరణలో ఉన్నారు. స్థలం గుర్తింపు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారని సమాచారం. ఆమోదయోగ్యమైతే త్వరలోనే ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ స్కూల్ ఏర్పాటులో తొలి ఘట్టం సుఖాంతమైనట్టే.

## తిరువూరు టీడీపీలో వర్గపోరు...

విజయవాడ, మార్చి 29,

తిరువూరు టీడీపీలో గ్రూప్ రాజకీయాలు చల్లారడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, లోకల్ టీడీపీ నేతల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. స్థానిక నేత రమేశ్ రెడ్డిపై 48గంటల్లో చర్యలు తీసుకోకుంటే రాజీనామా చేస్తానంటూ ఎమ్మెల్యే అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు. ఎమ్మెల్యే బాగోతాలు బోలెడు ఉన్నాయంటూ స్థానిక పార్టీ నేతలు రచ్చకెక్కారు. తిరువూరు ఎపిసోడ్‌పై టీడీపీ హైకమాండ్ దృష్టిసారించింది. నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ వర్గపోరు పార్టీ హైకమాండ్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. స్థానిక ఎమ్మెల్యే, లోకల్ లీడర్ల మధ్య తరుచూ వివాదాలు రాజుకుంటున్నాయి. తాజాగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ రావు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి మధ్య విభేదాలు భగ్గుమన్నాయి.ఓ మహిళను రమేశ్ రెడ్డి వేధించారంటూ ఎమ్మెల్యే కొలికిపూడి తీవ్ర ఆరోపణలు చేయడంతో ఒక్కసారిగా పార్టీలో తీవ్రచర్చనీయాంశమైంది. సొంత పార్టీ నేతపైనే ఎమ్మెల్యే ఆరోపణలు చేయడంతో హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యే ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ రమేశ్ రెడ్డి వర్గం రివార్స్ అటాక్ మొదలుపెట్టారు. ఇలా స్థానిక గ్రూప్ రాజకీయాలు తిరువూరులో నాటకీయ పరిణామాలకు తెరతీశారుకూటమి పొత్తులో భాగంగా అనేకమంది టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేలకు, పార్టీ విధేయులకు కూడా దక్కని సువర్ణ అవకాశం కొలికపూడిని వరించింది. మొదటసారి ఎమ్మెల్యే అయిన కొలికపూడి ప్రభుత్వ కార్యక్రమాలతో కన్నా వ్యక్తిగత వివాదాలతోనే ఎక్కువగా వార్తలలో నిలుస్తున్నారు. నిత్యం ఏదో ఒక వివాదంతో వార్తలలో నిలుస్తూ చివరికి టీడీపీ పార్టీ అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు. అలాగే ఆ పార్టీ క్రమశిక్షణా సంఘం ముందు గతంలో హాజరై వివరణ కూడా ఇచ్చుకున్నారు కొలికపూడి.పార్టీ క్రమశిక్షణ సంఘం విచారణ చేపట్టిన తర్వాత కొలికిపూడి కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపంచారు. అయితే ఇప్పుడు ఆకస్మాత్తుగా కొలికపూడి జూలు విదిల్చారు. రమేశ్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అధిష్టానానికి ఆల్టిమేటం జారీ చేశారు. రమేశ్ రెడ్డిపై తాను ఫిర్యాదు చేసి పది రోజులు అవుతున్నా పట్టించుకోలేదని, 48 గంటల్లో రమేశ్ రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యే పదవికే రాజీనామా చేస్తానని ప్రకటించి కాక రాజేశారు. ఎప్పుడూ అధిష్టానం నుంచి అక్షింతలు వేయించుకునే కొలికపూడి రివర్స్ లో పార్టీ అధిష్ఠానంపై అటాక్ చేయడం పొలిటికల్ సర్కిళ్లలో బిగ్ డిబెట్ పాయింట్‌గా మారింది.మొత్తానికి తిరువూరు ఎపిసోడ్‌పై టీడీపీ హైకమాండ్ దృష్టి సారించింది. తిరువూరులో జరిగిన పరిణామాలపై నివేదిక ఇవ్వాలని పార్టీ హైకమాండ్ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు, రీజినల్ కో ఆర్డినేటర్, విజయవాడ ఎంపీ, ముగ్గురిని కలిపి నివేదిక ఇవ్వాలని అధిష్టానం ఆదేశించింది.ఇదిలా ఉండగా ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్ ఆరోపణలను రమేశ్‌రెడ్డి తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు తనను 2 కోట్లు డిమాండ్ చేశారని ఇవ్వనందుకే కక్షగట్టారని రమేష్‌రెడ్డి చెబుతున్నారు. 3 దశాబ్దాలుగా టీడీపీ తరఫున ప్రజలకు సేవ చేసుకుంటూ బతుకుతుంటే, లేనిపోని నిందలు వేస్తూ సస్పెండ్ చేయించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.ఏదిఏమైనా తిరువూరు టీడీపీలో వర్గపోరు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదంపై రిపోర్ట్ తీసుకున్నాక హైకమాండ్ ఎటువంటి చర్యలు తీసుకుంటుందనేది ఉత్కంఠగా మారింది. పార్టీ ఐక్యతను కాపాడుకోవడం టీడీపీ ముందున్న ప్రధాన సవాలుగా కనిపిస్తోంది. మరి ఈ ఎపిసోడ్ ఇంకెన్ని మలుపులు తీసుకుంటుందో చూడాలి.

## 284 మంది భారతీయుల దగ్గరే రూ. 98 లక్షల కోట్లు

ముంబై, మార్చి 29,

దేశంలోనే అత్యంత ధనవంతుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ బాస్ ముకేశ్ అంబానీ.. ప్రపంచంలోని టాప్–10 కుబేరుల జాబితాలో ఈసారి స్థానం కోల్పోయారు. ఏడాది వ్యవధిలోనే ఆయన సంపద విలువ 13 శాతం తగ్గి రూ. 8.6 లక్షల కోట్లకు పరిమితమైంది. అయినప్పటికీ.. ఆసియాలో అత్యంత సంపన్నుడిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. మరోవైపు అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ.. ప్రపంచంలోనే గతేడాది అత్యధికంగా సంపద పెంచుకున్న వ్యక్తిగా నిలిచారు. ఆయన సంపద రూ. 1 లక్ష కోట్ల మేర పెరిగి రూ. 8.4 లక్షల కోట్లకు చేరుకుంది. హురూన్ విడుదల చేసిన 2025 గ్లోబల్ రిచ్ లిస్ట్ ఈ వివరాలను వెల్లడించింది. కనీసం రూ. 8500 కోట్ల సంపద (1 బిలియన్ డాలర్) ఉన్న వారితో హురూన్ లిస్ట్ విడుదల చేసింది.భారత జీడీపీ రూ. 350 లక్షల కోట్లలో, కుబేరుల సంపద దాదాపు మూడో వంతు ఉన్నట్లు హురూన్ పేర్కొంది.రిలయన్స్ గ్రూప్‌లోని ఇంధనం, రిటైల్ వ్యాపారాలలో వృద్ధి మందగించడం సహా అమ్మకాలు తగ్గడం, రుణ భారం పెరగడం వంటి కారణాలతో.. ముకేశ్ అంబానీ సంపద 13 శాతం తగ్గింది.

2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో అదానీ గ్రూప్ షేర్లు భారీగా పడిపోయాయి. తర్వాత గత ఏడాది కాలంలో వాటి విలువ తిరిగి పెరగడంతో అదానీ సంపద గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలోనే 13 శాతం పెరిగింది.

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ (రూ. 3.5 లక్షల కోట్లు) దేశంలోనే అత్యంత సంపన్న మహిళగా నిలిచారు. ఆమెకు తండ్రి శివనాడార్ నుంచి హెచ్‌సీఎల్‌లో 47 శాతం వాటా బదిలీ కావడం ఇందుకు కారణం. ప్రపంచవ్యాప్తంగా చూస్తే.. మహిళా కుబేరుల్లో ఆమె 5వ స్థానంలో నిలిచారు.సగటు సంపదలో భారత్.. చైనాను మించిపోయింది. భారత కుబేరుడి సగటు సంపద రూ. 34,514 కోట్లు కాగా.. చైనాలో ఇది రూ. 29,027 కోట్లుగా ఉంది. ఇది భారత్‌లోని కుబేరుల సంపద పెరుగుతున్నట్టు సూచిస్తోంది.ఇక నగరాల పరంగా చూస్తే.. ముంబైలో కుబేరుల సంఖ్య 90కు చేరింది, గత ఏడాదితో పోల్చితే 11 మంది పెరిగారు. అయితే, ఆసియాలో 'కుబేరుల రాజధాని' హోదా ముంబై కోల్పోయి, షాంఘై దక్కించుకుంది.

రంగాల పరంగా చూసినట్లయితే.. ఆరోగ్య సంరక్షణ రంగంలో 53 మంది కుబేరులు ఉన్నారు. 35 మంది కన్జ్యూమర్ గూడ్స్, 32 మంది ఇండస్ట్రియల్ ప్రొడక్ట్స్ రంగానికి చెందిన వారు.

భారత కుబేరుల సగటు వయస్సు 68 ఏళ్లుగా ఉంది. అంతర్జాతీయ కుబేరుల సగటు వయసు కంటే ఇది 2 సంవత్సరాలు ఎక్కువ. 34 ఏళ్ల శశాంక్ కుమార్, హర్షిల్ మాథుర్ పిన్న వయస్కులైన కుబేరులుగా నిలిచారు. ప్రపంచ కుబేరుల జాబితాలో టెస్లా, స్పేస్ ఎక్స్, ఎక్స్ (ట్విట్టర్) సంస్థల అధినేత ఎలాన్ మస్క్ అగ్రస్థానంలో నిలిచారు. మస్క్ సంపద 82 శాతం (182 బిలియన్ డాలర్లు) పెరిగి 420 బిలియన్ డాలర్లకు చేరుకుంది.2025 హురూన్ రిచ్ లిస్టులో తెలుగు వ్యాపారవేత్తలు వారి కుటుంబాల గురించి తెలుసుకుందాం. దివీస్ లేబోరేటరీస్.. దివి మురళి 260వ ర్యాంకులో నిలిచారు. సంపద 10 బిలియన్ డాలర్లుగా ఉంది. ఎంఈఐఎల్‌కు చెందిన పి. పిచ్చిరెడ్డి సంపద 5.8 బిలియన్ డాలర్లుగా ఉంది. 600 వ ర్యాంకులో నిలిచారు. ఓఇఎఓ కే చెందిన పి.వి. కృష్ణారెడ్డి సంపద 5.6 బిలియన్ డాలర్లుగా ఉంది. అపోలో హాస్పిటల్స్ ప్రతాప్ సి.రెడ్డి సంపద 3.3 బి.డాలర్లు. మరో 14 మంది కూడా ఒక బిలియన్ డాలర్లకుపైగా సంపద కలిగి ఉన్నారు.

===========

## నిలిచిపోయిన జీఎంఎస్...

హైదరాబాద్, మార్చి 29,

దీర్ఘకాలంలో బంగారం దిగుమతిపై దేశం ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు ఉత్పాదక ప్రయోజనాల కోసం దాని వినియోగాన్ని సులభతరం చేయడానికి దేశంలోని గృహాలు, సంస్థల వద్ద ఉన్న బంగారాన్ని సమీకరించడం కోసం సెప్టెంబర్ 15, 2015న గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్‌ను ప్రకటించింది. సాధారణంగా జీఎంఎస్ 3 భాగాలను కలిగి ఉంటుంది. స్వల్పకాలిక బ్యాంక్ డిపాజిట్ (1–3 సంవత్సరాలు), మధ్యకాలిక ప్రభుత్వ డిపాజిట్ (5–7 సంవత్సరాలు), దీర్ఘకాలిక ప్రభుత్వ డిపాజిట్ (12–15 సంవత్సరాలు)గా విభజించారు.గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ పనితీరు, మారుతున్న మార్కెట్ పరిస్థితుల పరిశీలన ఆధారంగాచి జీఎంఎస్‌కు సంబంధించిన మీడియం టర్మ్, లాంగ్ టర్మ్ గవర్నమెంట్ డిపాజిట్ భాగాలను నిలిపివేయాలని నిర్ణయించామని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. జీఎంఎస్ కింద బ్యాంకులు అందించే స్వల్పకాలిక బ్యాంక్ డిపాజిట్లు ఆయా బ్యాంకుల అభీష్టానుసారం కొనసాగుతాయని పేర్కొంది. అయితే ఈ స్కీమ్ అమలు విషయంలో రిజర్వ్ బ్యాంక్‌ను సంబంధించిన వివరణాత్మక మార్గదర్శకాలు అనుసరించాల్సి ఉంటుంది. మార్చి 26, 2025 నుంచి జీఎంఎస్‌కు సంబంధించిన ఎంఎల్‌టీజీడీ భాగాల కింద నియమించబడిన కలెక్షన్ అండ్ ప్యూరిటీ టెస్టింగ్ సెంటర్ (సీపీటీసీ) లేదా జీఎంఎస్ మొబిలైజేషన్, కలెక్షన్ అండ్ టెస్టింగ్ ఏజెంట్ (జీఎంసీటీఏ) లేదా నియమించిన బ్యాంక్ శాఖల్లో టెండర్ చేసిన ఏవైనా బంగారు డిపాజిట్లు అంగీకరించమని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.ఎంఎల్‌టీజీడీ కింద ఉన్న డిపాజిట్లు జీఎంఎస్‌కు సంబంధించిన ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం రిడెంప్షన్ వరకు కొనసాగుతాయి. నవంబర్ 2024 వరకు మొత్తం 31,164 కిలోల బంగారంలో స్వల్పకాలిక బంగారు నిక్షేపాలు 7,509 కిలోలు, మధ్యకాలిక బంగారు నిక్షేపాలు 9,728 కిలోలు, దీర్ఘకాలిక బంగారు నిక్షేపాలు 13,926 కిలోలు ఉన్నాయి. జీఎంఎస్‌లో దాదాపు 5,693 మంది డిపాజిటర్లు పాల్గొన్నారు. జనవరి 1, 2024న 10 గ్రాములకు రూ.63,920గా ఉన్న బంగారం ధరలు ప్రస్తుతం 41.5 శాతం పెరిగి రూ.90,450కి చేరుకుంది.

## మిర్యాలగూడలో ఇఫ్తార్ హాజరయిన ఎమ్మెల్యే బత్తుల

మిర్యాలగూడ

ముస్లింల సంక్షేమ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్ ), ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ లు ..పట్టణంలోని చిన్న మసీదులో పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం తరపున ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ కోటాలో జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలయేల కృషి చేస్తామన్నారు. వివిధ స్థాయి రాజకీయ సీట్ల కేటాయింపులో ముస్లింల కోటాను నూరు శాతం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక మత పెద్దలు కోరిన వెంటనే అవంతిపురం, రైల్వే స్టేషన్ సమీపంలో ఈద్గాలకు స్థలాల కేటాయింపు జరిపినట్లు తెలిపారు. మసీదులలో సకల సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కుల మతాలకతీతంగా మిర్యాలగూడ అభివృద్ధిలో ముస్లింలు భాగస్వామ్యం కావాలని కోరారు.వారితో కలిసి మసీదులో ప్రార్థనలు జరిపారు.

## సబ్ కలెక్టర్ తిట్టాడని ఆత్మహత్యాయత్నం

నల్గొండ

కుటుంబ పంచాయతీలో విచారణ కోసం వచ్చిన తనను సబ్ కలెక్టర్ దూషించాడు అంటూ నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామపంచాయతీ పరిధిలోని చింతలగూడెంకు చెందిన పొంతటి పున్నమ్మ క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది.బంధువులు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.బాధితురాలు కథనం మేరకు తమ పోషణ చూడటం లేదంటూ అత్తరాములమ్మ ఇటీవల మాడుగులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కుమారుడు పొంతటి దామోదర్ రెడ్డి, కోడలు పున్నమ్మలపై ఫిర్యాదు చేయడంతో వారికి నోటీసులు అందజేసినట్లు తెలిపారు. కాగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో విచారణకు హాజరైన సందర్భంలో సబ్ కలెక్టర్ అసభ్య పదజాలంతో దూషించాడని దామోదర్ రెడ్డి,పున్నమ్మ దంపతులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి విచారణ జరపకుండా, తమ వివరణ కోరకుండా,అసభ్య పదజాలంతో దూషిస్తూ,మహిళా కానిస్టేబుల్ తో బయటికి గెంటించి వేశారని ఆరోపిస్తున్నారు.దీంతో మనస్థాపానికి గురైన పున్నమ్మ క్రిమిసంహారకమందు సేవించడంతో, గమనించిన బంధువులు ఏరియా ఆసుపత్రికి తరలించారని తెలిపారు.ప్రాథమిక చికిత్స అందజేశామని, ప్రాణాపాయం తప్పినా,24 గంటల వరకు అబ్జర్వేషన్ లో ఉంచినట్లు డ్యూటీ డాక్టర్ తులసీరామ్ తెలిపారు.

## ఎస్టీపీ పనులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ

నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని శేషమ్మ గూడెం వద్ద ఉన్న సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటును పనులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తనిఖీ చేసారు. నెలలోపు ఎస్టిపి ని పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశం ఇచ్చారు. నల్గొండ పట్టణంలో సుమారు 80 శాతం ఇండ్లు 20 ఏళ్ల కింద సీవరేజ్ ట్రీట్మెంట్ అనుసంధానించబడ్డాయి. 2014లో 38 కోట్లతో ఎస్టిపి మంజూరైనప్పటికీ నేటికీ పూర్తి కాకపోవడం బాధాకరం. వెంకటేశ్వర కాలనీ ,రాఘవేంద్ర కాలనీ అన్నింటికీ ఎస్టిపి కనెక్షన్లు ఉన్నాయి. రానున్న 25 ,30 రోజుల్లో ఎస్టీపీని పూర్తి చేయమని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను, పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించామని అన్నారు. సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పూర్తితో పాటు, చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయాలి. తక్కిన 30% ఇండ్లకు కూడా ఎస్ టి పి కనెక్షన్లు ఇస్తాం . నర్సప్ప గూడ వద్ద అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మరో ఎస్టిపి నిర్మాణం జరగనుంది. ఇందుకు ప్రజలు సహకరించాలి. ప్రజలు ఇబ్బందులు పడే పని ఎప్పటికీ చేయమని అన్నారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ గౌడ్, ఆర్డీవో అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబు అహ్మద్ ఉన్నారు

## బీసీ రిజర్వేషన్లు... యూ టర్న్ తీసుకున్న బీజేపీ

హైదరాబాద్, మార్చి 29, (

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లుపై తెలంగాణ బీజేపీ రివర్స్ గేర్ వేసింది. అయితే ఈ బిల్లు ఇప్పటికే శాసన సభలోను, శాసన మండలిలో ఆమోదం పొందింది. ఇప్పటి దాకా విద్య ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో బీసీలకు అమల్లో ఉన్న 29 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి రిజర్వేషన్ల పెంచుతూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన నిర్వహించింది. ఈ గణనలో 56.36 శాతం బీసీలు రాష్ట్రంలో ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు 42శాంత రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టినపుడు బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదించదని కొన్ని పార్టీలు ప్రచారం చేస్తున్నాయని.. అది తప్పుడు ప్రచారమని అసెంబ్లీలో బీసీ రిజర్వషన్ల బిల్లుపై చర్చ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు.అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన తెలంగాణ బీజేపీ నేతలు ఇప్పుడు మాట మారుస్తున్నారు. రాష్ట్ర బీజేపీ వైఖరి మార్చుకోవడం వెనక అమిత్ షా ఎఫెక్ట్ ఉందని ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులతో ఢిల్లీ వెళ్లిన రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. ఆ సమావేశంలో బీజేపీ కేంద్ర పార్టీ విధానానికి వ్యతిరేకంగా బీసీ బిల్లుకు ఎలా మద్దతు ప్రకటించారని అమిత్ షా ప్రశ్నించారని సమాచారం..తెలంగాణ బీజేపీ నేతలపై షా ఎఫెక్ట్ పడటంతో ముస్లింలను బీసీల్లో కలిపి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లు రూపొందించడం తప్పని తెలంగాణ బీజేపీ నేతలు అభ్యంతరం తెలుపుతున్నారు.మొత్తానికి బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో సంపూర్ణ మద్దతు తెలిపిన తెలంగాణ బీజేపీ అమిత్ షా ఎఫెక్ట్‌తో ఇప్పుడు ఇరకాటంలో పడినట్లు కనిపిస్తోంది.

# కొత్త ఉగాది తో కొత్త ఆశలు:

తెలంగాణ రాష్ట్రంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ.

తెలంగాణ రాష్ట్రంలో ఉగాది పండుగ కొత్త నందన సంవత్సరం సందర్భంగా ముఖ్యమైన ప్రజా సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేసే నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం నిరుపేదలకు నాణ్యమైన ఆహారం అందించడమే కాకుండా రేషన్ సరఫరాలో అవకతవకలను అడ్డుకునేందుకు కూడా దోహదపడనుంది.

హుజూర్ నగర్ నుండి ప్రారంభం:



ఈ సంక్షేమ కార్యక్రమాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వంత నియోజకవర్గం హుజుర్ నగర్‌లో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు , ఇతర మంత్రులు హాజరుకానున్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంతోమంది ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

పేద ప్రజల ఎదురు చూపులకు తెరపడింది.

ఎన్నో ఏళ్లుగా రాష్ట్రంలోని ప్రజలు, ముఖ్యంగా నిరుపేదలు, సన్న బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ బియ్యం నాణ్యతకు ప్రసిద్ధి చెందిందని, తక్కువ ధరలో అత్యుత్తమ ఆహారంగా ఉపయోగపడుతుందని ప్రజలు నమ్ముతున్నారు. తెలంగాణ ప్రభుత్వం వారి కోరికను నెరవేర్చుతూ ఉగాది పండుగ సందర్భంగా సన్న బియ్యం పంపిణీని ప్రారంభించడం ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది.

అవినీతికి అడ్డుకట్ట.

రేషన్ పంపిణీ వ్యవస్థలో పలు ఇబ్బందులు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. రేషన్ సరుకులను అక్రమంగా వాడుకోవడం, నాణ్యతలో లోపాలు వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టాయి. కానీ ఈ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ద్వారా అలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. వారు తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలోని నిరుపేదల ఆహార భద్రతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించనుంది.

ప్రజల హితంలో ముందుకు.

సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత మేలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించుకుంది. సన్న బియ్యం పంపిణీతో పాటు, ఇతర పౌరసరఫరాల మెరుగుదల కోసం మరిన్ని చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ విధంగా, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందుకు రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నిజంగా అభినందనీయమైనదే. ఇది రేషన్ సద్వినియోగాన్ని పెంపొందించి, లబ్ధిదారులకు నిస్వార్థంగా సహాయం చేసే ఒక పెద్ద ముందడుగు.

================================

# అమలాపురంలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

అమలాపురం

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో అమలాపురం టీడీపీ కార్యాలయం వద్ద ఘనంగా జరిగాయి. టీడీపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతలక్ష్మి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు ముఖ్యతిదులుగా పాల్గొని ఎమ్మెల్యే ఆనందరావు కలసి టీడీపీ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు..పేద బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడినది స్వర్గీయ ఎన్టీ రామారావు అని ఆయన అడుగుజాడల్లోనే యువత పయనించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన దగ్గర్నుంచి మహిళలు అభివృద్ధికి కృషిచేసిన స్వర్గీయ ఎన్టీఆర్ అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి ఎనలేనిదని జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతలక్ష్మి అన్నారు. బిసి ఎస్సీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో పెద్దపీట వేసి రిజర్వేషన్ కల్పించిన ఘనత టిడిపి పార్టీకే దక్కుతుందని రమణబాబు అన్నారు.భారతదేశంలో మొట్టమొదటిగా పింఛన్లు కల్పించిన ఘనత టిడిపికే బాధ్యత దక్కుతుందని, ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పించింది కూడా టిడిపి పార్టీ అని పెచ్చెట్టి విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్చిలోనే మండుతున్న ఎండలు

హైదరాబాద్, మార్చి 29,

మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. బయటకు వెళ్తే మాడు పగిలిపోతోంది. మరోవైపు వడగాలులు భయపెడుతున్నాయి. ఇప్పటికే ఉష్ణోగ్రత 41 డిగ్రీలు దాటింది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక అలర్ట్ ఇచ్చింది. 15 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.తెలంగాణలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతుంది. వడగాల్పుల ప్రభావం కూడా ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో ఇవాళ 15 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, ఖమ్మం, కొమరంభీం, మంచిర్యాల, ములుగు, నాగర్ కర్నూల్, నారాయణపేట్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వనపర్తి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ అయ్యింది.

ఇప్పటికే తెలంగాణలో గరిష్టంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రత దాటింది. మరింతగా ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని.. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. హైదరాబాద్‌లో కూడా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. రాబోయే మూడు నెలల్లో ఎండలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు 42 నుంచి 46 డిగ్రీల సెల్సియస్‌కు చేరే అవకాశం ఉందని.. నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణ, మధ్య తెలంగాణ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అధిక వేడి ఉంటుందని చెబుతున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. 1901-2025 మధ్య సగటు ఉష్ణోగ్రతలు తీసుకుంటే.. ఈ ఏడాదే తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. మార్చి 1 నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయని వాతావరణ శాఖ తెలిపింది. మార్చి నెలాఖరు నాటికి 42 నుంచి 43 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు చేరుకుంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.వేసవిలో చెమట రూపంలో శరీరం నుంచి నీరు బయటకు వెళ్లిపోతుంది. కాబట్టి డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే నీరు ఎక్కువగా తాగాలి. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. కాటన్ వంటి తేలికపాటి, వదులైన దుస్తులు ధరించడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ సమయంలో బయటకు వెళ్లడం తగ్గించాలని వైద్యులు సూచిస్తున్నారు.ఎండలో తిరగాల్సి వస్తే తప్పనిసరిగా సన్ స్క్రీన్ లోషన్ ఉపయోగించాలి. పుచ్చకాయ, ద్రాక్ష, కర్బూజ వంటి పండ్ల రసాలు తాగడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది. మజ్జిగ, కొబ్బరి నీరు తాగడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. వేసవిలో ఆహారం త్వరగా పాడవుతుంది. కాబట్టి తాజా ఆహారం మాత్రమే తీసుకోవాలి. కళ్లను తరచుగా చల్లటి నీటితో కడుక్కోవాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు కళ్లజోడు ధరించాలని వైద్యులు చెబుతున్నారు.చర్మాన్ని ఎండ నుంచి రక్షించుకోవడానికి చల్లటి నీటితో స్నానం చేయాలి. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఎండలో తిరగడం తగ్గించాలి. నీరు ఎక్కువగా తాగాలి. ఫ్రిజ్ లోని నీరు తాగడం వల్ల గొంతు నొప్పి వస్తుంది. కావున మట్టి కుండలోని నీటిని తాగడం మంచిది. వేసవిలో చెమట ఎక్కువగా పడుతుంది కాబట్టి రోజూ స్నానం చేయడం మంచిదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

# హబ్సీపూర్-లచ్చపేట్ కొత్తగా డబుల్ రోడ్డు

మెదక్, మార్చి 29, (

తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పెషల్ ఫోకస్ పెట్టాయి. ఇప్పటికే ఉన్న రహదారులను విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. కొత్తగా రోడ్ల నిర్మాణం కూడా చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రాలను కలుపుతూ డబులు రోడ్లు నిర్మిస్తామని రేవంత్ సర్కార్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా డబుల్ రోడ్డు నిర్మాణానికి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే రిక్వెస్ట్‌కు స్పందించిన సీఎం రేవంత్ వెంటనే నిధులు కూడా మంజురూ చేశారు.దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుబ్బాకలో యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేయాలని రిక్వెస్ట్ చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన రేవంత్‌రెడ్డి.. అక్కడ వర్సిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. స్థల పరిశీలనకు దుబ్బాక వెళ్లాలని సీఎంవో అధికారులను ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా హబ్సీపూర్-లచ్చపేట్ మధ్య ఎప్పట్నుంచో డబుల్ రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. దీనిపై కూడా సీఎంతో చర్చించారు. అక్కడ డబుల్ రోడ్డు నిర్మాణం చేపడితే చాలా పల్లెలలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందని ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి సీఎం దృష్టికి తీసుకొచ్చారు.సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి డబుల్ రోడ్డు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రూ.35 కోట్లు నిధులు మంజూరు చేశారు. హామ్ మోడల్‌లో ఆ రోడ్డును అభివృద్ధి చేస్తామని అధికారులు తెలిపారు. తాము అడిగిన వెంటనే స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డికి దుబ్బాక నియోజకవర్గ ప్రజల పక్షాన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.కాగా,గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులను హామ్ విధానంలో నిర్మిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇటీవల అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. ఆ రహదారులకు ట్యాక్స్ వసూలు చేయబోమని అన్నారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి మండలం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. రహదారుల ద్వారానే అభివృద్ధి జరుగుతుందని.. రోడ్ల విస్తరణపై తమ ప్రభుత్వ స్పెషల్ ఫోకస్ పెట్టిందని వెల్లడించారు.

==================

# భారీగా పెరుగుతున్న ఇళ్ల అద్దెలు

హైదరాబాద్, మార్చి 29,

హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది.హైదరాబాద్.. తెలంగాణ రాజధాని. విశ్వనగరంగా గుర్తింపు పొందింది. పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించడంతో ఇక్కడికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీంతో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉద్యోగులు హైదరాబాద్‌లో స్థిరపుతున్నారు. కొందరు అద్దెకు ఉంటుండగా, కొందరు ఇళుల కొనుగోలు చేస్తున్నారు.హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లు మరియు ఉన్నత స్థాయి రెసిడెన్షియల్ ప్రాంతాలైన గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా, హైదరాబాద్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల ధరలు స్థిరంగా పెరుగుతున్నాయి. 2024లో ఒక స్క్వేర్ ఫీట్ ధర సగటున రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఉండగా, 2025 నాటికి ఇది కొన్ని ప్రాంతాల్లో రూ.11 వేల నుంచి రూ.12,500 దాటింది. దీనికి ప్రధాన కారణాలు ఐటీ రంగ విస్తరణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, నగరంలోకి వలస వచ్చే జనాభా పెరుగుదల.అద్దెల విషయానికొస్తే, హైదరాబాద్‌లో అద్దె ధరలు కూడా పెరిగినప్పటికీ, ఇళ్ల ధరలతో పోలిస్తే అవి నిష్పత్తిలో తక్కువ వేగంతో పెరుగుతున్నాయి. గచ్చిబౌలిలో 2 ఃఊఐ అపార్ట్‌మెంట్ అద్దె సగటున రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటే, అదే ప్రాంతంలో ఇంటి కొనుగోలు ధర రూ.80 లక్షల నుంచి రూ.1.2 కోట్ల వరకు ఉంటోంది. దీని ఫలితంగా, రెంటల్(అద్దె ద్వారా వచ్చే ఆదాయం శాతం) సగటున 4?5% వద్ద ఉంటోంది, ఇది ఇళ్ల ధరల పెరుగుదలతో సమానంగా లేదు.ఈ పరిస్థితి కొనుగోలుదారులకు ఒక సవాలుగా మారుతోంది, ఎందుకంటే అద్దెకు ఇళ్లు తీసుకోవడం కంటే కొనడం ఖరీదైన ఎంపికగా మారింది. అయితే, ఈ ధరల పెరుగుదల నగర ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులకు ఇది ఇప్పటికీ ఆకర్షణీయమైన ప్రాంతంగా ఉందని సూచిస్తోంది.

అద్దెలు ఇలా..

హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు నగరంలోని ప్రాంతం, సౌకర్యాలు, రియల్ ఎస్టేట్ డిమాండ్ ఆధారంగా మారుతూ ఉంటాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్ల ధరల వివరాలు ఇలా ఉన్నాయి.

1. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్ (ఐటీ హబ్ ప్రాంతాలు):

స్క్వేర్ ఫీట్ ధర: రూ.8 వేలు ? రూ. 12,500

2 ఃఊఐ అపార్ట్‌మెంట్ ధర: రూ.75 లక్షలు ? రూ. 1.2 కోట్లు

3 ఃఊఐ అపార్ట్‌మెంట్ ధర: రూ. 1.2 కోట్లు ? రూ. 2 కోట్లు

విల్లాలు (గేటెడ్ కమ్యూనిటీ): రూ. 2.5 కోట్లు ?రూ. 5 కోట్లు

కారణం: ఐటీ కంపెనీల సామీప్యత, మెరుగైన మౌలిక సదుపాయాలు, మెట్రో కనెక్టివిటీ.

2. కొండాపూర్, కూకట్‌పల్లి (ఉప?ప్రాంతాలు):

స్క్వేర్ ఫీట్ ధర: రూ. 6 వేలు ? రూ. 9 వేలు.

2 ఃఊఐ అపార్ట్‌మెంట్ ధర: రూ.60 లక్షలు ? రూ.90 లక్షలు

3 ఃఊఐ అపార్ట్‌మెంట్ ధర: రూ. 90 లక్షలు ?రూ. 1.5 కోట్లు

కారణం: ఐటీ హబ్‌కు దగ్గరగా ఉండటం, సాపేక్షంగా సరసమైన ధరలు.

3. బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్ (ప్రీమియం ప్రాంతాలు):

స్క్వేర్ ఫీట్ ధర: రూ. 12 వేలు ? రూ. 20 వేలు

2 ఃఊఐ అపార్ట్‌మెంట్ ధర: రూ. 1.5 కోట్లు ? రూ. 2 కోట్లు

3 ఃఊఐ అపార్ట్‌మెంట్ ధర: రూ.2 కోట్లు ? రూ. 3.5 కోట్లు

విల్లాలు/ఇండిపెండెంట్ హౌస్: రూ.5 కోట్లు ? రూ. 15 కోట్లు

కారణం: లగ్జరీ జీవనశైలి, సెలబ్రిటీలు మరియు వ్యాపారవేత్తల నివాసం.

4. ఉప్పల్, ఔఆ నగర్, దిల్‌సుఖ్‌నగర్ (తూర్పు మరియు దక్షిణ హైదరాబాద్):

స్క్వేర్ ఫీట్ ధర: రూ.4,500 ? రూ.7 వేలు

2 ఃఊఐ అపార్ట్‌మెంట్ ధర: రూ.45 లక్షలు ? రూ.70 లక్షలు

3 ఃఊఐ అపార్ట్‌మెంట్ ధర: రూ.70 లక్షలు ? రూ.1 కోటి

కారణం: సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు అనుకూలం, మెట్రో విస్తరణ.

# ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించే తెలుగు సంవత్సరాది

## యువతకు భక్తినేర్పరిచే విశ్వావసు

## విశ్వావసు తెలుగు సంవత్సర ప్రాముఖ్యతను తెలిపిన ప్రముఖ జ్యోతిష్య పండితులు చక్రధర సిద్ధాంతి

తిరుపతి

ఆర్థిక సమృద్ధికి పెట్టింది పేరు విశ్వావసు నామ తెలుగు సంవత్సరమని వెల్లడించారు

రాష్ట్ర నంది అవార్డు గ్రహీత, జ్యోతిష్య చక్రవర్తి, ప్రముఖ జ్యోతిష్య పండితులు, దైవాజ్ఞ రత్న డాక్టర్ చక్రధర సిద్ధాంతి.

తెలుగు సంవత్సరాది ఉగాది నేపథ్యంలో విశ్వావసు నామ సంవత్సర విశేషాలను ఆయన శనివారం తెలుగు ప్రజలకు తెలియజేసారు. విశ్వానికి ప్రతిరూపం శ్రీ విశ్వావస నామ సంవత్సరమని చెప్పిన చక్రధర్ సిద్ధాంతి..., ముందుగా తెలుగు ప్రజలందరికీ.., శ్రీ విశ్వాస నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీ విశ్వావసు అంటే అష్ట వసూలు ఈ భూమి మీదకు వచ్చిన దినమని పేర్కొన్నారు. ఉగస్య ఆది అనేదే ఉగాదని,.., “ఉగ” అనగా నక్షత్ర గమనం - జన్మ - ప్రపంచం జన్మ ఆయుష్షులకు మొదటిరోజు కనుక ఉగాది అయిందన్నారు చక్రధర సిద్ధాంతి. ఇంకొకవిధంగా చెప్పాలంటే, ‘యుగం’ అనగా రెండు లేక జంట అని కూడా అర్థం వస్తుందని.., ఉత్తరాయణ, దక్షిణాయనములనబడే.. ద్వయ సంయుతం ‘యుగం’ కాగా, ఆ యుగానికి ఆది యుగాది అయిందనీ..., అదే ఉగాది గాను, తెలుగు సంవత్సరాదిగా ప్రాచుర్యం పొందని వివరించారు.



పురాణాల ప్రకారం, చైత్ర మాసం శుక్ల పక్షం శుద్ధ పాడ్యమి తిథి నాడు అంటే ఉగాది రోజున సృష్టి ప్రారంభమైనట్లు పండితులు చెబుతారనీ.. వేదాలను తస్కరించిన సోమకుడిని హతమార్చి మత్స్యావతారంలో ఉండే విష్ణువు వేదాలను బ్రహ్మ దేవుడికి అప్పగించిన శుభ తరుణ పురస్కారంగా విష్ణువు ప్రీత్యర్థం “ఉగాది”ఆచరణలోకి వచ్చిందని..,. చైత్ర శుక్ల పాడ్యమి తిథి నాడే ఈ విశాల ప్రపంచాన్ని బ్రహ్మదేవుడు సృష్టించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోందనీ,. అందుకే సృష్టి ఆరంభానికి సంకేతంగా ఉగాది పండుగను జరుపుకుంటారని వివరించారు.

యుగ ప్రారంభానికి నాంది పలికిన రోజు ఉగాది కనుకనే...ఈ రోజున పంచాంగ శ్రవణం చేయడం వల్ల సకల శుభాలను చేకూరుస్తుందని తెలియజేశారు. తెలుగు సంవత్సరాది రోజున ఉగాది పచ్చడికి ప్రత్యేక స్థానం ఉందని చెప్పిన చక్రధర్ సిద్ధాంతి.., షడ్రుచుల కలయికే ఉగాది పచ్చడికి ప్రతిరూపమన్నారు. మానవ జీవితం కూడా షడ్రుచులతో మిళితమై ఉంటుందన్నారు.

తెలుగు వారి క్యాలెండర్ ఉగాది నుంచి ప్రారంభం అవుతుందనీ..., ఈ తెలుగు నూతన సంవత్సరం మొదటి రోజుని ఉగాదిగా జరుపుకుంటామన్నారు. దీనికి కారణం ప్రకృతి సహజత్వమనీ.., మనిషి ప్రకృతికి, కాలానికి అనుగుణంగా జీవిస్తున్నాడని చెప్పారు. కనుక ప్రకృతి నూతనంగా మారినప్పుడు.. మనిషి జీవన విధానం కూడా నూతనంగా మొదలవుతుందనీ తెలియజేశారు. హిందూ పంచాంగం ప్రకారం ఒకొక్క తెలుగు సంవత్సరానికి ఒకొక్క పేరు ఉంటుంది. ఈ ఏడాది ఉగాది పేరు విశ్వావసు నామ సంవత్సరమనీ చక్రధర సిద్ధాంతి వెల్లడించారు.

మార్చి 30 వ తేదీ ఆదివారం పాడ్యమి తిథి నుంచి ఈ విశ్వవాసు సంవత్సర మొదలు కానున్న నేపథ్యంలో ఈ ఏడాది మనిషి జీవితం ఎలా సాగనుంది..,ఆదాయ, వ్యయాలు, కష్ట, సుఖాలు, వ్యాధులు వంటి అనేక విషయాలను తెలుసుకోవాలని భావిస్తామన్నారు. ఈ ఏడాదిలో మొక్కలు పెరుగుదల అంతంత మాత్రంగానే ఉంటుందనీ.,. దీంతో రైతులకు ఫలాలను కూడా మోస్తరు రేటుతో ఇస్తాయన్నారు. సంపద అధికంగా ఉండదు. అదే సమయంలో అసలు ఈ రోజు చేతిలో డబ్బులు లేవు అనే రోజు ఉండదని తెలిపారాయన. ఈ సంవత్సరంలో వర్షాలు అధికంగా పడవు లేదా కరువు కూడా ఏర్పడదన్నారు. అంటే వర్షాలు సమృద్ధిగానే కురుస్తాయన్నారు . దొంగతనం భయం పెరుగుతుందనీ,. కొత్త వ్యాధులు లేదా ప్రతిచోటా ఒకే వ్యాధి వ్యాపించడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దురాశతో నిండి ఉంటారనే విషయాన్ని సిద్ధాంతి బహిరంగపరిచారు. రాజకీయాల్లో కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు..

ముఖ్యంగా విశ్వావసు తెలుగు సంవత్సరం ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందిస్తుందనీ.., యువతకు భుక్తి మార్గాన్ని చూపిస్తుందని తెలిపారు. విశ్వావసు సంవత్సరం ఆదివారం రావడం వల్ల.., సూర్యుడు తన ఆధిపత్యాన్ని కొనసాగించే అవకాశం ఉందన్నారు.దీంతో ఎండలు కూడా మండే సందర్భం లేకపోలేదన్నారు.ఉగాది పండగ రేవతి నక్షత్రంతో ప్రారంభమవుతుందనీ..,ఈ నక్షత్రంలో ఏడాది ప్రారభం కావడం వలన ప్రజలు సౌమ్యంగా ఉంటారని చెప్పారు. ఈ నక్షత్రం వలన కలిగే శుభ ఫలితాలను మార్గశిర మాసంలో చూడవచ్చునన్నారు. ఈ సంవత్సరంలో సంపద సమృద్ధిగా ఉంటుందనీ,... ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లగలరన్నారు.ఉగాది ప్రారంభంలో ఐంద్ర యోగం ఉంటుందనీ..,. ఇది శుభ యోగంగా పరిగణించబడుతుందని ప్రవచించారు. కనుక ఈ సంవత్సరం రాష్ట్రానికి, దేశానికి శుభప్రదమైనదని కాంక్షించారాయన. రాష్ట్రంలో అనుకున్న పనులు నెరవేరుతాయనీ..,. పాలకులు, ప్రజలు ఇద్దరూ సంతోషంగా ఉంటారనీ ప్రముఖ జ్యోతిష్య పండితులు చక్రధర సిద్ధాంతి.., విశ్వావసు నామ తెలుగు సంవత్సరాదిలో గోచరించే ఫలితాలను వెల్లడించారు.

# పోక్సో చట్టం మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం








కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, శ్రీమతి జి. శ్రీదేవి, అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు కడప మున్సిపల్ హై స్కూల్ మెయిన్ నందు అవగాహన కార్యక్రమమును నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఫర్ మొబైల్ కోర్టు జడ్జ్ మేడం కుమారి ఆశ ప్రియ మాట్లాడుతూ పోక్సో చట్టం అంటే లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, 2012, ఇది పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించబడింది. ఈ చట్టం పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించేందుకు, మరియు బాధితులకు మద్దతు ఇచ్చే వ్యవస్థను, నేరస్థులను పట్టుకోవడానికి మెరుగైన పద్ధతులను నిర్దేశిస్తుంది, 2012లో ఈ చట్టం ఆమోదించబడింది, ఎందుకంటే పిల్లలపై లైంగిక నేరాల సమస్యను సమగ్రంగా పరిష్కరించడానికి ఇది అవసరం అని ప్రభుత్వం భావించింది. శిక్షలు:ఈ చట్టం ప్రకారం, లైంగిక నేరాలకు పాల్పడే వారికి కఠినమైన శిక్షలు, తీవ్రమైన లైంగిక వేధింపుల కేసుల్లో మరణశిక్ష, జరిమానాలు మరియు జైలుశిక్ష విధించవచ్చు. 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ రక్షణ కల్పిస్తుంది. విభిన్నమైన నేరాల రక్షణ:లైంగిక వేధింపులు, లైంగిక వేధింపులు మరియు అశ్లీలత వంటి నేరాల నుండి పిల్లలను రక్షించడానికి బలమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను అందించడానికి ఈ చట్టం రూపొందించబడింది. న్యాయ ప్రక్రియలో పిల్లల ప్రయోజనాలు:న్యాయ ప్రక్రియ యొక్క ప్రతి దశలో పిల్లల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చట్టం రూపొందించబడింది. వయసు:18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలతో లైంగిక చర్యలన్నీ లైంగిక నేరంగా పరిగణించబడుతుందని చట్టం భావిస్తుంది. పోక్సో ఈ-బాక్స్:ఫిర్యాదులను నమోదు చేయడానికి జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ (%చీజూజ=%) యొక్క అధికారిక పోర్టల్ లో "%ూూజూ వ-దీశీఇ%" బటన్ ఉంది సద్వినియోగం చేసుకోగలరు, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఫర్ మొబైల్ కోర్టు జడ్జి కుమారి ఆశ ప్రియ మేడం అలాగే హెడ్మాస్టర్ శ్రీమతి నాగమణి , కడప ఎంఈఓ శ్రీ ఇర్షాద్ అహ్మద్ మరియు టూ టౌన్ పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తమ్ముడు చేతిలో అన్న దారుణ హత్య

తిరుపతి

నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపులూరు దరకాస్తు కంట్రికలో తమ్ముడు అన్నను హతమార్చాడు. శుక్రవారం రాత్రి అన్నదమ్ముల మధ్య చిన్నపాటి ఘర్షణతో మొదలై హత్యకు దారి తీసింది. వెంకటరమణయ్యను తమ్ముడు బాబు కత్తితో హత్య చేసాడు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య చంగమ్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ బాబి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అక్రమార్కులపై గొట్టిముక్కుల ప్రెస్ మీట్ దెబ్బ - కొత్తపల్లిలో మట్టికుప్పల సీజ్

పెద్దపల్లి

జిల్లాలో అక్రమ మట్టిదాందాపై గొట్టేముక్కుల సురేష్ రెడ్డి ప్రెస్ మీట్ తో అధికారుల్లో చలనం కలిగింది. గతంలో అక్రమంగా తరలిస్తున్న సీజ్ చేసిన మట్టిని ప్రభుత్వానికి జరిమానా చెల్లించకుండా తరలిస్తున్నార నే ఆధారాలతో సహా బయటపెట్టారు. ఇందులో ఓ ఎమ్మెల్యేతో పాటు గిర్దావర్ హస్తం ఉందని మీడియా ముందు ప్రవేశ పెట్టిన సాక్ష్యంతో అధికారులు దిద్దు బాటు చర్యలకు ఉపక్రమించి నట్లుగా తెలుస్తున్నది విజిలెన్స్ అధికారుల బృందం శుక్రవారం కొత్తపల్లికి చేరుకొని మట్టిని సీజ్ చేయడం సంచలనంగా మారింది. దీంతో సురేష్ రెడ్డి సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకు న్నది. కాగా గొట్టేముక్కుల చొరవ అక్రమార్కులకు శరాఘాతం కాగా, అధికారుల కు తమ అధికారాలను గుర్తు చేసినట్లు అయ్యింది. అంతే కాకుండా అప్పుల్లో ఉన్నా ప్రభుత్వానికి దాదాపు రూ. 40లక్షల ఆదాయం సమకూరనుందని పలువురు చర్చించుకోవడం గమనార్హం. ఏదీ ఏమైనా అధికారులు ప్రజలకు జవాబుదారిగా వుండాల్సింది పోయి ప్రజాప్రతినిధులకు వంత పాడటం సరైన పద్ధతి కాదని పలువురు పేర్కొంటున్నారు.

# 6,729 ఉద్యోగాలు తొలగిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్,

తెలంగాణలోని రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది పదవీ విరమణ పొందాకకూడా కాంట్రాక్టు పద్ధతిలో కీలక పదవుల్లో కొనసాగుతున్న వారిని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తం 6,729 మందిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వం తొలగించిన జాబితాలో మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ వైటీడీఏ, వైస్ చైర్మన్ జి.కిషన్ రావుతోపాటు కన్సల్టెంట్ ఇంజినీరు బీఎల్ఎన్ రెడ్డికూడా ఉన్నారు.

పది మంది ట్రాన్స్ కో, జెన్ కో డైరెక్టర్లు కూడా ఉన్నారు. ఖాళీ అవుతున్న స్థానాల్లో కొత్త వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఉద్యోగాలు భర్తీ చేయడం, పదోన్నతులు కల్పించడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ మేరకు ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆదేశా లుసైతం జారీ చేసినట్లు తెలుస్తోంది.ప్రభుత్వ ఉత్తర్వులతో మునిసిపల్ శాఖ వెంటనే చర్యలను ప్రారంభించింది. తమ శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై కొనసాగుతున్న 177 మంది రిటైర్డ్ ఉద్యోగులను తొలగిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ గురువారం ఉత్తర్వు లు జారీ చేశారు. వీరిని తక్షణమే తొలగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ప్రస్తుతం 6,729 మందిని తొలగించిన నేపథ్యంలో గ్రూప్-1 నుంచి గ్రూప్-4 స్థాయిలో కొత్త నోటిఫికేషన్ల ద్వారా భర్తీకి అవకాశాలు న్నాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.

మరోవైపు ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల పెద్దెత్తున ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# గ్రూప్ 2 ర్యాంకర్ ను సన్మానించిన ఎమ్మెల్యే

వనపర్తి

పెబ్బేరు మండల కేంద్రానికి చెందిన అజయ్ కుమార్ రెడ్డి ఇటీవల నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలలో సత్తా చాటడంతో శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శాలువాలతో సన్మానించి అభినందించారు.

సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివే ప్రతి విద్యార్థికి మంచి గుర్తింపు ఉంటుందని, జోనల్ టాపర్, రాష్ట్ర 17వ ర్యాంకు సాధించిన అజయ్ కుమార్ రెడ్డి ప్రతి ఒక్కరికి ఆదర్శవంతంగా నిలిచాడని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కార్యక్రమంలో పెబ్బేరు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మయన్మార్ థాయిలాండ్ భూకంపంపై ప్రధాని మోదీగ్భ్రాంతి

న్యూఢిల్లీ,మయన్మార్ థాయిలాండ్‌లలో భూకంపం వల్ల సంభవించిన భయంకరమైన విధ్వంసంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.మయన్మార్, థాయిలాండ్‌లలో భూకంపం తర్వాత పరిస్థితి గురించి తాను ఆందోళన చెందుతున్నానని ఆయన అన్నారు. అందరి భద్రత, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నానన్నారు.భారతదేశం అన్ని విధాలుగా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# గ్రామాలలో స్పెషల్ ఆఫీసర్ల మార్క్ ఎక్కడ..?



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 29: నిర్మల్ జిల్లా గ్రామాలలోని సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీ పాలన వ్యవహారాలు చక్కబెట్టేందుకు ప్రత్యేక అధికారులను తెరపైకి తెచ్చి రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీలకు ఒక స్పెషల్ ఆఫీసర్ ను నియమించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే సర్పంచులు పోయిన తర్వాత స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఎలాంటి వివక్ష లేకుండా గ్రామాలు అభివృద్ధి బాట పడతాయని అందరూ భావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ జిల్లా లోని మండలలోనీ గ్రామాల అభివృద్ధి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా గ్రామాల అభివృద్ధిలో, ప్రజా సమస్యల పరిష్కారంలో స్పెషల్ ఆఫీసర్ల మార్పు ఎక్కడ కనిపించడం లేదని, గ్రామాలకు వారు సరిగా వచ్చేది లేదు. వచ్చిన వారు పెద్దగా చేసింది ఏమీ లేదని ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కనీసం గ్రామాలపై అవగాహన లేని ఆఫీసర్లకు అభివృద్ధి సాధ్యమేనా..

ఒకపక్క మండల స్థాయిలో బిజీగా ఉంటూ గ్రామ పలనపై కనీసం అవగాహన లేని వివిధ హోదాల్లో ఉన్న అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నిర్మించడం వల్ల వారి విధులు నిర్వహిస్తూ గ్రామాల మీద సరైన దృష్టి సారించి లేకపోవడంతో గ్రామాల పాలన పూర్తిగా నశించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఏమైనా ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి కి చెప్పండి..

గ్రామాలలోని ఏదైనా సమస్యలు ప్రత్యేక అధికారికి చెప్పాలి అనుకున్న ఫలితం లేకుండా పోయింది. ఏది అడిగిన గ్రామ పంచాయతీ కార్యదర్శి చెప్పండని సమాధానం వస్తుందని దీంతో కార్యదర్శి అన్ని తామై నడిపిస్తున్నారని ఏమాత్రం దానికి స్పెషల్ ఆఫీసర్లు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మాకెందుకు ఈ కర్మ అన్నట్టుగా..

మండల స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించడం తో వారి అసలు పనిపై దృష్టి పెట్టలేక గ్రామ సమస్యలపై అవగాహన చేయలేక పని భారం తో ఇబ్బంది పడుతూ మాకెందుకు ఈ కర్మ అన్నట్టుగా పల పరిస్థితి మారిందని పలువురు అధికారులు ఎవరికీ చెప్పుకోలేక లోలోన మదన పడుతున్నారు అని వినికిడి.

అంతో కొంతో సర్పంచ్ బెటర్..!

ఏదేమైనా గ్రామం నుంచి ఎన్నుకోబడిన వ్యక్తి ఉంటే గ్రామం నుండి పూర్తి అవగాహన వ్యక్తి అయి ఉంటాడు కావున ఏది ఏమైనా గ్రామం అభివృద్ధి చెందాలి అంటే గ్రామ వాసి అయిన సర్పంచ్ అయి ఉండాలి అప్పుడే మా సమస్యలు పరిష్కారం అవుతాయి కావున ఈ స్పెషల్ ఆఫీసర్ల వలన మాకు పెద్దగా అభివృద్ధి చేసింది ఏమీ లేదు ఎంతో కొంత సర్పంచే బెటర్ అంటున్న జిల్లా ప్రజలు.

# రామోజీ ఫిలింసిటీకి... హైడ్రా..,

హైదరాబాద్, మార్చి 29,

రామోజీరావు హైదరాబాదులోని హయత్ నగర్ దాటిన తర్వాత అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో రామోజీ ఫిలిం సిటీని నిర్మించారు. ఫిలిం సిటీ అసలు విస్తీర్ణం ఇంతవరకు ఎవరికీ తెలియదంటే అది ఎంత పెద్దదో అర్థం చేసుకోవచ్చు. రామోజీ ఫిలిం సిటీ నిర్మాణం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరగగా.. వైయస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మార్గదర్శి వ్యవహారం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత రామోజీ ఫిలిం సిటీ కి సంబంధించిన అనేక విషయాలు బయటపడటంతో సంచలనంగా మారాయి. అప్పటిదాకా రామోజీ ఫిలిం సిటీ రామోజీరావు కష్టార్జితం అని అందరు అనుకున్నారు. కానీ ఎప్పుడైతే వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటివారు తెరపైకి సంచలన ఆరోపణలు చేయడంతో రామోజీ ఫిలిం సిటీ కి సంబంధించిన అసలు విషయాలు వెలుగులోకి రావడం మొదలైంది. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రామోజీ ఫిలిం సిటీ ని సర్వే చేయించాలని.. అందులో అసైన్డ్ భూములు ఉన్నాయని.. అవన్నీ పేదలకు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఇంతలోనే హెలికాప్టర్ ప్రమాదం చోటు చేసుకోవడంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కన్నుమూశారు. ఆ తర్వాత రామోజీ ఫిలిం సిటీ భూముల సంబంధించిన అసలు విషయం వెలుగులోకి రాలేదు. కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలో రామోజీ ఫిలిం సిటీని 1000 నాగళ్ళతో దున్నుతానని అన్నారు. కానీ ముఖ్యమంత్రి అయిన




తర్వాత రామోజీ ఫిలిం సిటీ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. చివరికి రామోజీరావు కు సంబంధించిన మార్గదర్శి వ్యవహారంలోనూ ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ అయినప్పుడు.. కెసిఆర్ మాత్రం సైలెంట్ గా ఉన్నారు. ఇక ఆమధ్య ఆంధ్రజ్యోతి ఎండి వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన బిగ్ డిబేట్ లో పాల్గొన్న కేటీఆర్.. రామోజీరావు అరెస్టు సంబంధించిన అసలు విషయాన్ని చెప్పారు. రామోజీరావు వృద్ధుడు కాబట్టి.. ఆయన అనారోగ్యంతో ఉన్నారు కాబట్టి.. అరెస్టు చేయించలేదని వ్యాఖ్యానించారు. అంటే రామోజీరావు అక్రమాలు చేసినప్పటికీ కెసిఆర్ సైలెంట్ గా ఉన్నారని కేటీఆర్ పరోక్షంగా వ్యాఖ్యానించారు.ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి లేకపోయినప్పటికీ రామోజీ ఫిలిం సిటీ వ్యవహారం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది.

# తెర మీదకు ఎఫ్ ఎస్ ఐ స్కామ్

హైదరాబాద్, మార్చి 29

వందల కోట్ల రూపాయల్లో ఉంటే? అప్పట్లో మున్సిపల్ శాఖ మంత్రి అయిన కేటీఆర్, కెసిఆర్ క్యాబినెట్లో మంత్రులు, రియల్ ఎస్టేట్ బిల్డర్లు ఎన్ని వేల కోట్లు ఈ ఎఫ్ ఎస్ ఐ స్కామ్ లో వెనకేశారో అర్థం చేసుకోవచ్చు.10 ఫ్లోర్స్ కట్టాల్సిన చోట?..50 ఫ్లోర్లు కడితే? వేల మంది జనం ఒకే చోట పోగుబడిపోతే?. వాళ్లకు సౌకర్యాలు ఇవ్వడానికి ఎంత ఇబ్బంది అవుతుంది. ఇవేమీ ఆలోచించకుండా కేవలం డబ్బులు దండుకోడానికే అప్పట్లో ఎఫ్ ఎస్ ఐ నిబంధనలను సడలించేసి హైదరాబాద్ మొత్తం టవర్లతో వేశారు కేటీఆర్ అండ్ టీం ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్. ఎకరానికి ఎన్ని అంతస్తులు కట్టాలి? ఎంత నిర్మాణం చేపట్టాలి అన్నదే ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ ఎఫ్ ఎస్ ఐ. దీన్ని అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలు, మంచినీటి వసతి, శానిటేషన్ సౌకర్యాలు, రోడ్ల విస్తీర్ణాన్ని బట్టి ఎన్ని ఫ్లోర్లు కట్టాలో నిర్ణయిస్తారు.2006లో అప్పటి వైఎస్సార్ సర్కార్ జీవో నెంబర్ 86 తీసుకొచ్చింది. ఈ జీవో ద్వారా ఎవరు ఎన్ని ఫ్లోర్లైనా కట్టు పోవడానికి అనుమతిస్తూ అపరిమిత ఎఫ్ ఎస్ ఐ తెచ్చారు. ఆ తర్వాత 2012లో ఆ జీవో కి కొన్ని సవరణలు చేశారు. మీటర్ ఎత్తు నుంచి 55 మీటర్ల హైట్ వరకు 16 మీటర్ల సెట్ బ్యాక్ వదలాలి అనే నిబంధన ఉంది. అయితే 55 మీటర్లు దాటిన తర్వాత పెరిగే ప్రతి ఐదు మీటర్లకు అదనంగా అర మీటర్ సెట్ బ్యాక్ వదలాలి అనే నిబంధనని పొందుపరిచారు, అంటే 55 మీటర్ల కంటే ఎత్తులో అపార్ట్మెంట్ ని కట్టాల్సి వస్తే కింద అర మీటర్ చొప్పున సెట్ బ్యాక్ వదలాల్సి ఉంటుంది. అప్పట్లో బిల్డర్లకి దీనివల్ల పెద్ద నష్టపోయేదేమీ లేదు. కారణం రెండు శాతం మినహా ఎక్కువమంది బిల్డర్లు ఇరవై అంతస్తులు లోపే అపార్ట్మెంట్లు నిర్మించేవాళ్లు.2019 నాటికి బి ఆర్ఎస్ ప్రభుత్వం?. కేటీఆర్ సారధ్యంలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా రియల్ ఎస్టేట్ బిల్డర్స్ చేతిలోకి వెళ్ళిపోయింది. ప్రభుత్వం చేయాల్సిన మున్సిపల్ చట్టాలను రియల్ ఎస్టేట్ బిల్డర్లే రూపొందించే స్థాయికి దిగజారి పోయింది అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం.55 మీటర్ల ఎత్తుకు మించి నిర్మించే టవర్లకు అదనంగా వదలాల్సిన 0.5 మీటర్స్ సెట్ బ్యాక్ నిబంధన తొలగించారు కేటీఆర్. ఈ నిబంధన తొలగింపు వెనుక అప్పట్లో రియల్ ఎస్టేట్ కంపెనీల లాబీయింగ్ బలంగా పనిచేసింది. సెట్ బ్యాక్ నిబంధనలను తొలగిస్తూ?. అన్ లిమిటెడ్ ఫ్లోర్స్ కట్టుకోవచ్చు అంటూ కేటీఆర్ తీసుకొచ్చిన జీవో నెంబర్ 50, రియల్ ఎస్టేట్ బిల్డర్లకు వరంగా మారింది ,వేల కోట్లు కురిపించింది. ఈ అన్లిమిటెడ్ ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ కి తోడు సెట్ బ్యాక్ రూలు లేకపోవడంతో ఎకరాకి లక్షన్నర చదరపు అడుగుల కన్స్ట్రక్షన్ కి బదులు 4.5 లక్షల స్క్వేర్ ఫీట్ నిర్మాణాలు చేశారు. కొందరు ఎకరానికి ఆరు లక్షల స్క్వేర్ ఫీట్ నిర్మాణాలు కూడా చేస్తున్నారు.40 అంతస్తులు?.50 అంతస్తులు ఇష్టం వచ్చినట్టు నిర్మిస్తున్నారు. పార్కింగ్ సౌకర్యం ఉందా లేదా అనేది చూడడం లేదు. శానిటేషన్ ఉందా లేదా ? అని పట్టించుకోవడం లేదు. అసలు గ్రౌండ్ వాటర్ దొరుకుతుందా లేదా?.? ఎకరం భూమిలో ఆరు లక్షల ఎస్ ఎఫ్ టి నిర్మాణాలు చేస్తే?.. అందులో నివసించే వాళ్ళ మురుగు అంత ఎటు వెళుంది? వాళ్ల కార్లు ఒకేసారి రోడ్డు మీదకు వస్తే పరిస్థితి ఏంటి? ఇవేమీ పట్టించుకునే నాధుడు లేడు? మై హోమ్, రాజ పుష్ప, అపర్ణ, వంశీరాం బిల్డర్స్, వర్టిక్స్, అరబిందో, వాసవి , అలేఖ్య ఇలా ఒకరేంటి బడా రియల్ ఎస్టేట్ బిల్డర్లు అందరూ కూడబలుక్కుని కేటీఆర్ సహకారంతో హైదరాబాదును ముంచేశారు. అడ్డగోలుగా నిర్మాణాలు చేసి?. ఈరోజు సిటీ ట్రాఫిక్ నరకం తో అల్లాడిపోవడానికి పరోక్షంగా కారణమయ్యారు. హైదరాబాద్ కి సముద్రం లేదు.360 డిగ్రీస్ లో కావలసినంత భూమి ఉంది. హారిజంటల్ గా 120 కిలోమీటర్ల వరకు నగరం ఇంకా తిరగవచ్చు. ఎదగొచ్చు.ఔటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల భూముల్లోనే ఇప్పటివరకు నిర్మాణాలు ఇంకా రాలేదు. ఇప్పుడు రీజనల్ రింగ్ రోడ్డు కూడా వచ్చేసింది. హెచ్ఎండిఏ పరిధి చాలా పెరిగింది. ఇంత భూమి పెట్టుకుని మొత్తం సిటీలోనే కిక్కిరిసిపోయేటట్లు 50?. 60 ఫ్లోర్లు కట్టేస్తే?. జనం అంతా ఒకే చోట పోగుపడి నీళ్లు లేక, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక, నిత్యం ట్రాఫిక్ తో నరకం చూస్తున్నారు. బంజర హిల్స్ జూబ్లీహిల్స్ లాంటి చోట ఇప్పటికీ ఐదు ఫ్లోర్లు మించి కట్టకూడదని నిబంధన ఉంది. మరి అదే నిబంధన సిటీ అంత ఎందుకు పెట్టరు. అలా చేస్తే నగరం ఇంకా పెరుగుతుంది. అవసరమైన చోటు తప్ప ఇలా 50?.60 ఫ్లోర్ల టవర్లు కంట్రోల్ చేయాల్సిందే. కేటీఆర్ సృష్టించిన జీవో 50 నీ రద్దు చేస్తేనే నగరం బాగుపడుతుంది.హైదరాబాద్ రోడ్లపై కారు నడపాలంటే చేతులు వణికి పోతున్నాయి.గంటలు గంటలు ట్రాఫిక్ లో మగ్గిపోతున్నారు జనం. దీంతో పొల్యూషన్ కూడా పెరిగిపోతుంది. ఇరుకు రోడ్లు? కిక్కిరిసిపోయిన వాహనాలతో సిటీలో నరకం చూస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే నగరం హరిజంటల్ గా పెరగాలి.50 ?.60 ఫ్లోర్లు టవర్లు కట్టుకొని జనం అంతా ఒకే చోట ఉండిపోతే బతుకులు నరకం అయిపోతాయి. వాటిని 20 ఫ్లోర్లకు గనుక కుదించి?. నగరాన్ని విస్తరిస్తే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి. ప్రజల జీవితాన్ని నిర్ణయించాల్సింది రియల్ ఎస్టేట్ బిల్డర్లు కాదు? ప్రభుత్వాలు. రేవంత్ సర్కార్ ఆ దిశగా ఆలోచిస్తే ఇప్పటికైనా ఈ ఎఫ్ ఎస్ ఐ అరాచకాన్ని అడ్డుకోగలుగుతాం. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు హైదరాబాదులో నిర్మించిన హైరేజ్డ్ బిల్డింగ్ పర్మిషన్లపై సమగ్ర దర్యాప్తు ఆదేశిస్తే, అసలు అనుమతులు ఎందుకిచ్చారో ఎలా ఇచ్చారో మొత్తం వెలికి తీస్తే ఎఫ్ ఎస్ ఐ స్కాం మొత్తం బయటకు వస్తుంది. ఎఫ్ ఎస్ ఐ స్కాం వెనుక ఏ ఏ రియల్ ఎస్టేట్ సమస్యలు ఉన్నాయో? ఎవరెవరు అధికారులు ఉన్నారో? మంత్రులు ఎవరో బయటకు తీస్తే అసలు ఎన్ని వేల కోట్ల అక్రమాలు జరిగాయి? చివరికి హైదరాబాదును అవి ఎలా నరకం చేశాయో జనానికి తెలుస్తుంది.

======================చీచీచీ

# ఏప్రిల్ 12న విరహనుమాన్ విజయ యాత్ర

## జయంతి కరపత్రాలు, గోడప్రతుల ఆవిష్కరణ చేసిన విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్

కరీంనగర్, మార్చి 29(భారత శక్తి):హనుమాన్ జయంతినీ పురస్కరించుకొని ఏప్రిల్ 12 న విశ్వ హిందూ పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీ వీర హనుమాన్ విజయ యాత్రను నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి అధిముల విద్య సాగర్ , బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ కన్నం శంకర్ తెలియజేశారు. శనివారం నగరంలోని జిల్లా కార్యాలయంలో విర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీ కరపత్రాలు, గోడ ప్రతులను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బైక్ ర్యాలీ నగరం లో నీ గాంధీ రోడ్డు నుంచి రామాలయ దేవస్థాన నుండి ప్రారంభం అవుతుందనీ చెప్పారు.ఈ యొక్క ర్యాలీ ద్వారా హిందూ సమాజని జాగృత్గం చేయడం కోసం విశ్వహిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షులు దే రామ్ సింగ్ గ వస్తున్నారనీ తెలిపారు., అలాగే ధైర్య శక్తి సామర్థ్యాలకు ప్రతీక అయినటవంటి హనుమంతుని ఆదర్శంగా తీసుకొని హిందూ యువత దేశ ధర్మ రక్షణ కోసం పాటుపడుతు, లవ్ జిహాద్ నుంచి, మాతృముత్రుల కోసం , గోసంర్షణ కొరకు మత మార్పిడిల అరికట్టడం కోసం ఈ హనుమాన్ జయంతి ర్యాలీ లో పాల్గొనీ విజవంతం చేయాలి విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాంత గో రక్షక కమిటీ మెంబర్ యు. రాధాకృష్ణా రెడ్డి, జిల్లా సహ



కార్యదర్శి తోట రాజేందర్, విశ్వహిందూ పరిషత్ , బజరంగ్ దళ్ జిల్లా కో కన్వీనర్ రాజేందర్, ఆంజనేయులు, బజరంగ్ దళ్ నగర కన్వీనర్ మహేష్ యాదవ్, సంతోష్, అఖిల్, రంజిత్,అశోక్, సతీష్ లు పాల్గొన్నారు.

# మజ్లిస్ దేశద్రోహ పార్టీ, ఎవరు అడ్డుపడ్డా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆగదు: కేంద్ర మంత్రి సంజయ్ కుమార్



కరీంనగర్, మార్చి 29(భారత శక్తి):భారత రాజ్యాంగానికి భవిష్యత్‌లో ఆర్ఎస్ఎస్ భావజాలంతోనే ముప్పు పొంచి ఉందంటూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మజ్లిస్ పార్టీయే అసలైన దేశద్రోహ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం జాతీయవాద భావజాలంతో పనిచేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లు పై దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. ఒవైసీసహా కుహనా లౌకిక వాదులు ఎంత అడ్డుకున్నా పార్లమెంట్ లో త్వరలోనే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఆమోదం పొందుతుందని స్పష్టం చేశారు. కరీంనగర్ లోని జిల్లా కోర్టు కాంప్లెక్స్ లోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం బండి సంజయ్ రూ.15 లక్షలు మంజూరు చేశారు. అలాగే నిర్మాణానికి మరో 50 లక్షలు ఇస్తానని ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాదులంతా బండి సంజయ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజ్ కుమార్, కార్యదర్శి బేతి మహేందర్, బాస సత్యనారాయణ, కోమల ఆంజనేయు లుతో కలిసి బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసి కేసులు ఎదుర్కొన్న. 109 కేసులు నాపై ఉన్నాయి. పలుమార్లు జైలుకు పోయిన. ప్రతిసారి నన్ను కాపాడుతోంది న్యాయవాదులే. వారి సంక్షేమం కోసం అన్ని విధాలా సహకరిస్తా. న్యాయవాదుల కాన్ఫరెన్స్ కోసం సీఎస్సార్ ఫండ్స్ నుండి మరో రూ.50 లక్షల సాయం చేసేందుకు నావంతు క్రుషి చేస్తా..వక్ఫ్ బోర్డు బిల్లు పై మజ్లిస్ నేత ఒవైసీ అడ్డగోలుగా మాట్లాడుతున్నడనీ, దేశమంతా వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతు పలుకుతున్నరు. ఒవైసీలాంటి ఎంత మంది వచ్చినా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆగదు. పార్లమెంట్ లో ఆమోదించి తీరుతాం.ఈ దేశ ప్రజల ఆస్తిపాస్తులు కాపాడాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై అందరి అభిప్రాయాలు తీసుకున్నామని, దేశమంతా తిరిగి అభిప్రాయాలను సేకరించామని చెప్పారు. పార్లమెంట్ సంఘం సమావేశమై నివేదిక కూడా సమర్పించింది. అతి త్వరలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందడం తథ్యం. మతం కోణంలో ఆలోచించి దీనిని అడ్డుకోవడం సరికాదన్నారం. అలాంటి వారిపై ప్రజలు తిరగబడే ప్రమాదం ఉందనీ తెలిపారు.వక్ఫ్ బోర్డు పేరు తీరుతో పేదలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో నాకు తెలుసు. ఈ కరీంనగర్ లోనే ఓ పేద వ్యక్తి తరతరాల నుండి ఇంటిని నిర్మించుకున్నరు. వాళ్ల తాత, ముత్తాతలు ఆ ఇంట్లోనే ఉంటున్నారు. కానీ వక్ఫ్ బోర్డు స్థలమని చెప్పి అనుమతులన్నీ రద్దు చేసి ఇబ్బంది పాల్జేశారు. ఇలాంటివి దేశవ్యాప్తంగా ఉన్నాయి. అందుకే దేశ ప్రజలను, ఆస్తిపాస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సవరణ బిల్లు రూపొందించాం. దీనిని మతం కోణంలో చూపి రెచ్చగొట్టాలని కుహనా లౌకిక వాదులు చూస్తున్నారు. ఒవైసీ సహా కుహనా లౌకిక వాదులు ఎవరు అడ్డుకున్నా ఈ బిల్లు ఆగదు... దేశ శ్రేయస్సు కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉంది.

# చలి వేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 29: నిర్మల్ జిల్లా జన్నారం మండల కేంద్రంలోని పొన్కల్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్ర కేంద్రాన్ని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలి వెంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఎండ కాలంలో తగిన మోతాదులో ఎప్పటికప్పుడు నీరు తాగాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ నీరు అధికంగా తాగాలని అన్నారు.చలి వేంద్రాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ అభివృద్ధిని మెరుగుపర్చుకోవాలని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. శనివారం ఖానాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన ఆయన, రైతులతో కలిసి చలి వేంద్రాల వినియోగంపై చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రభుత్వం అందించిన వేదికలను రైతులు పూర్తిగా ఉపయోగించుకుంటే, నీటి సమస్య



తగ్గి పంట దిగుబడులు పెరుగుతాయి. రైతులకు అవసరమైన మార్గదర్శకాన్ని అందించేందుకు అధికార యంత్రాంగం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది” అని తెలిపారు.రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే విధంగా ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించిన బొజ్జు పటేల్, రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వం భారత దేశపు గొప్పతనం

## ఓపెన్ ఐస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సులువ చంద్రశేఖర్

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి29:రంజాన్ పండగ సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని సీతారాం నగర్ మదీనా మసీదులో మదర్సా పిల్లలకు 25 కేజీల బియ్యం ,సేమియా పాకెట్ లను శనివారం ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఓపెన్ ఐస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సులువ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా సీతారాం నగర్ లో 25 వార్డుకు సంబంధించిన ముస్లిం సోదరులకు రంజన్ సందర్భంగా బియ్యం, సేమియా పాకెట్స్ అందించడం జరిగిందని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా హిందూ ముస్లిం భాయి భాయి అనే సాంప్రదాయం, భిన్నత్వంలో ఏకత్వం భారతదేశంలో మాత్రమే సాధ్యమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులు వల్లపుదాస్ కృష్ణ, అబ్దుల్ మజీద్, కలాం సంపత్, పగిడి నాగేంద్రబాబు, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.



# శాతవాహన యూనివర్సిటీలోనే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి: ఎస్ఎఫ్ఐ,ఏఐఎస్ఎఫ్



కరీంనగర్, మార్చి 29 (భారత శక్తి)శాతవాహన యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళశాలను ఏర్పాటు చేయాలని, హుస్నాబాద్ కు తరలించవద్దని డిమాండ్ చేస్తూ ఏస్ ఎఫ్ ఐ, ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శనివారం నగరంలోని శాతవాహన యునివర్సిటీ ప్రధాన ద్వారం ముందూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినదించారు. అనంతరం అసిస్టెంట్ రిజిస్టర్ కిషోర్ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిలు గజ్జెల శ్రీకాంత్ , మచ్చ రమేష్ లు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా లో ఇంజనీరింగ్ కళాశాల కళ కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణలో కరీంనగర్ విద్యా కేంద్రం గా మారుతున్న తరుణంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో చేరి డొనేషన్ ఫీజులు కట్టలేక విద్యకు దూరమైన పరిస్థితి ఉందనీ ఆరోపించారు. ఇంజనీరింగ్ కళాశాల కరీంనగర్ వస్తదని కోటి ఆశలతో విద్యార్థులు ఎదురు చూస్తుంటే వారి ఆశలు అడియాశలై నిరాశ మిగిలిపోయిందని మండిపడ్డారు.. దశాబ్ద కాలంగా విద్యార్థి సంఘాల పోరాట ఫలితంగా వచ్చిన ఇంజనీరింగ్ కళాశాలను రాజకీయ స్వలాభాల కోసం హుస్నాబాద్ కు తరలించడం విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి విద్యారంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పెద్దపల్లి లో జరిగిన యువ వికాసం సభ తన ప్రసంగంలో కరీంనగర్ జిల్లాలో కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పుతున్న పరిస్థితి ఉందన్నారు.. ఇప్పటికైనా నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని శాతవాహన యూనివర్సిటీలోనే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పొన్నం ప్రభాకర్ ఇల్లు ముట్టడించి కరీంనగర్ కి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కాంపల్లి అరవింద్, రామారావు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్ , టౌన్ అధ్యక్ష కార్యదర్శులు రాము, హేమంత్, నాయకులు సురేష్ , సాగర్, సందీప్, సందేశ్ , రాకేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం, పరిశుభ్రతతోనే గ్రామాలు ఆరోగ్యం

## ఎన్ఎస్ఎస్ విద్యార్థినుల సేవలు అభినందనీయం

## ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు వంశీధర్ రెడ్డి



కరీంనగర్, మార్చి 29(భారత శక్తి):పరిశుభ్రత, పచ్చదనంతో గ్రామాలు ఆరోగ్యంగా ఉంటాయనీ, దీంతో ప్రజలు అభివృద్ధి చెందుతారని, దానిపై ప్రజలకు వివరించిన విద్యార్థినుల సేవలు అభినందనీయమని గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు గవ్వ వంశిధర్ రెడ్డి అన్నారు.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో గత నాలుగు రోజులుగా ఎన్ ఎస్ ఎస్ వేసవి శిబిరాన్ని నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువు విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యతను, అవగాహనను పెంపొందించుకోవాలని అన్నారు.

విద్యార్థినులను సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వామం చేస్తున్న క్యాంపు నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లలకు మంచి క్రమశిక్షణను నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. సమాజ అవసరాలు, సమస్యలను గుర్తించడం, ఒకరికొకరు సాయం చేసుకోవడం గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని చెట్లను విరివిగా పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

రాబోయే రోజుల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి మురికివాడలు లేని దేశంగా తయారు చేసి చెట్లను విరివిగా పెంచి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలని చెప్పారు.ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తయారీ విదానాన్ని నిషేదించాలని ఆ గురుతర బాధ్యత నేటి విద్యార్థిని విద్యార్థులు, యువతపై ఉన్నదని, మత్తు పధార్దాలు డ్రగ్స్ వంటి చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు దూరం ఉండాలని సూచించారు.మూగజీవాల పట్ల జాలి దయ కలిగి ఉండాలని అన్నారు. ఎన్ఎ స్ఎస్ క్యాంపు క్షేత్ర స్థాయి పర్యటనల ద్వార విద్యార్థిని, విద్యార్థులకు అనేక విషయాలపై అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు. అలాగే విద్యార్థిని విద్యార్థులు మంచి ఆశయాలు నెరవేర్చుకునే ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోవాలని, తద్వారా జీవితంలో స్థిరపడి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వాహకులు గవ్వ వంశీధర్ రెడ్డి గారికి జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు.

# రోగమొకటి.. మందొకటి!

## లోకేశ్వరం మండలంలో అక్రమ వీల్నెస్ సెంటర్లపై ప్రజల ఆందోళన

నిర్మల్, భారత శక్తి ప్రతినిధి, మార్చి 29: నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రంలో అనుమతి లేకుండా హెచ్ఎం వీల్నెస్ సెంటర్ తో పాటు మరికొన్ని వీల్నెస్ సెంటర్లు అక్రమంగా నడుస్తున్నాయి.

అనుమతి లేకుండా నడుస్తున్న ఈ కేంద్రాలు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

::అక్రమ వీల్నెస్ సెంటర్ల వల్ల ప్రజలకు కలుగుతున్న ముప్పు::

1. అనుమతి లేకుండా కార్యకలాపాలు

హెల్త్ డిపార్ట్‌మెంట్ నుంచి అవసరమైన అనుమతులు లేకుండా హెచ్.ఎం.వీల్నెస్ సెంటర్ తో పాటు పలు గ్రామాల్లో ఇటువంటి కేంద్రాలు నిరభ్యంతరంగా నడుస్తున్నాయి.

2. మెడికల్ ప్రమాణాల లేమి, అనుభవం లేని సిబ్బంది

ఈ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన మెడికల్ ట్రైనింగ్ లేదు.

సరైన వైద్య నిపుణులు లేకపోవడంతో రోగులు తప్పుడు చికిత్సల బారిన పడే ప్రమాదం ఉంది.

3. ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం

సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులు ఈ అక్రమ వీల్నెస్ సెంటర్లపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు.

4. ప్రజారోగ్యానికి ముప్పు

అనుమతి లేని కేంద్రాల్లో సరైన పరికరాలు లేకుండా వైద్య పరీక్షలు, చికిత్సలు అందించడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

అనుభవం లేని సిబ్బంది వైద్యం చేయడం వల్ల చాలా మంది అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

::ప్రజల డిమాండ్::




హెల్త్ డిపార్ట్‌మెంట్ వెంటనే స్పందించాలి.

అనుమతి లేకుండా నడుస్తున్న వీల్నెస్ సెంటర్లను మూసివేయాలి.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రజలకు అవగాహన కల్పించి, అనుమతిపత్రం ఉన్న సెంటర్లను మాత్రమే సందర్శించాలని సూచించాలి.

::అధికారుల స్పందన::

ఈ అంశంపై భైంసా డిప్యూటీ డిహెచ్ఎంఓ డాక్టర్ ఇద్దరిస్ గౌరీ స్పందిస్తూ, “అనుమతి లేకుండా వీల్నెస్ సెంటర్ నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం” అని స్పష్టం చేశారు.ప్రభుత్వం ఈ సమస్యపై త్వరగా స్పందించి, అక్రమ వీల్నెస్ సెంటర్లను మూసివేసి ప్రజారోగ్య పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# వెంకట్ బల్మూరి...బిసి సమాజం బుద్ధి చెబుతారు

## నాలుకను అదుపులో ఉంచుకో...తెలంగాణ మహిళలు చిరేస్తారు జాగ్రత్త

### రాష్ట్ర అధ్యక్షుడు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక గుంజపడుగు



కరీంనగర్, మార్చి 29(భారత శక్తి):కామారెడ్డి డిక్లరేషన్ మీద బిసిలకు న్యాయబద్ధంగా రావాల్సిన హక్కుల కోసం బీసీలతో కలిసి పోరాటం చేస్తు నందుకు కవితక్క మీద కాంగ్రెస్ నాయకులు పిచ్చి ముదిరి ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారనీ కనీసం ఒక మహిళ అనీ కూడ చూడకుండా మహిళలు అంటే గౌరవం లేకుండా ఇలా మాట్లాడటం అంటే కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇస్తున్న గౌరవం ఎంటో స్పష్టంగా అర్థం అవుతుంది అని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. గత పది సంవత్సరాలు నిరుద్యోగులను, యువకులను అనేక ఆందోళన పేరుమీద రెచ్చగొట్టి వారిని అందరిని కేసులపాలు చేసి వారు చేసిన త్యాగాల మీద వెంకట్ బల్మూరి రాజకీయంగా లబ్ధి పొంది ఎమ్మెల్సీ పదవీ తెచ్చుకున్నాడనీ అర్పించారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో అసలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కవితక్క మీద మాట్లాడే నైతికత లేదనీ, విద్యార్థుల త్యాగాలతో ఎమ్మెల్సీ పదవీ పొంది ఇప్పుడు ముఖ్యమంత్రి మోచేతి నీళ్ల కోసం కవితక్క వ్యక్తిగతంగా విమర్శిస్తే యావత్ బిసి సమాజం చూస్తూ ఉరుకోదు మీరు మీ పార్టీ బిసిలకు చేసిన వాగ్దానం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చెయ్యకుండా మీరు ఊర్లల్లోకొస్తే మిమ్మల్ని ఊరికించాడానికి సిద్ధంగా ఉన్నారు ప్రజలు అని వారు అన్నారు. యువకుడిగా చిన్న వయసులో నీకు ఎమ్మెల్సీ పదవీ వచ్చింది దానితో నువ్వు ప్రజల సమస్యల మీద మాట్లాడూ బిసిలకు, మహిళలకు నీ ప్రభుత్వం చేస్తున్న మోసాల మీద మాట్లాడూ, మహిళలకు ఇస్తామని చెప్పిన 2500/- గురించి చెప్పు, కల్యాణలక్ష్మి తోపాటు తులం బంగారం గురించి అడుగు. విద్యార్థినిలకు ఇస్తామని చెప్పిన స్కూటిలకు గురించి నిలదియు ప్రభుత్వాన్ని కామారెడ్డి డిక్లరేషన్ లో బిసిలకు ఇచ్చిన హామీలు నెరవేర్చు ముఖ్యమంత్రి అని ప్రశ్నించూ అంతేకాని బిసి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్న కవితక్క గురించి మాట్లడితే యావత్ బిసి సమాజం మీ నాలుకలను చీరుతారని వారు అన్నారు.అబద్ధపు అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు అధికార మదంతో కళ్ళు ముసుకు పోయిన కాంగ్రెస్ పార్టీ నాయకులరా ఇంకోసారి కవితక్క గురించి చిల్లరగా మాట్లడితే తెలంగాణ మహిళల శక్తి ఎంటో మీకు చూపిస్తారనీ చెప్పారు.

# మే డే సందర్భంగా అందించే పురస్కారాల కొరకు నామినేషన్ ఫారాలను సమర్పించాలి

## ఉప కార్మిక కమీషనర్ విజయభాస్కర్ రెడ్డి

### ఏప్రిల్ 10లోగా నామినేషన్ ఫారాలను సమర్పించాలి

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 29:మే డే సందర్భంగా అందించే శ్రమ శక్తి, పారిశ్రామిక ఉత్తమ యాజమాన్య పురస్కారాల కొరకు ఏప్రిల్ 10 వ తేదీలోగా నామినేషన్ ఫారాలను సమర్పించాలని ఉప కార్మిక కమిషనర్ కే. విజయభాస్కర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.కార్మికుల కృషిని గౌరవించడం, సుహృద్భావ పారిశ్రామిక సంబంధాలను ప్రోత్సహించడం కోసం కార్మిక శాఖ ద్వారా ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే మే డే ఉత్సవం ఈ ఏడాది కూడా 2025 మే 1వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు, ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమం కోసం విశిష్ట సేవలు అందించిన కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకులకు ప్రతిష్టాత్మక శ్రమ శక్తి పురస్కారాలు ప్రదానం చేయబడతాయని, ట్రేడ్ యూనియన్లతో, కార్మికులతో సఖ్యతను పరిరక్షించి, రాష్ట్ర ప్రగతికి విశేషంగా సహకరించిన చిన్న, మధ్య, పెద్ద తరహా పారిశ్రామిక యాజమాన్యాలకు ఉత్తమ యాజమాన్య పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు, యాజమాన్యాలు ఖమ్మం ఉప కార్మిక కమీషనర్ కార్యాలయం నుండి నామినేషన్ ఫారాలు పొంది, సంబంధిత పత్రాలతో కలిపి ఏప్రిల్ 10వ తేదీ లోపు తిరిగి సమర్పించాలని, నామినేషన్ ప్రక్రియ, ఇతర వివరాల కోసం ఖమ్మం ఉప కార్మిక కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని ఉప కార్మిక కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# దేశంలో మొదటిసారి సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం

## సిఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్ లు ప్రారంభిస్తారని వెల్లడి

### ఏప్రిల్ లో రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ

### బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం



కరీంనగర్, మార్చి 29(భారత్ శక్తి):తెలంగాణ వ్యాప్తంగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందనీ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. దేశంలోని మొట్టమొదటి కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ప్రారంభిస్తారని మంత్రి చెప్పారు. శనివారం హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చౌక ధరల దుకాణాలకు సన్న బియ్యం చేరాయనీ, రేషన్ కార్డు హుస్నాబాద్ లో ఉండి కార్డుదారులు హైదరాబాద్ నివసిస్తున్న అక్కడ బియ్యం తీసుకోవచ్చన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనే ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించుకున్నామని, రాబోయే కాలంలో తెలంగాణ లో ప్రారంభించుకునే కార్యక్రమాలు అన్ని ఆమోదించుకుంటుమని చెప్పారు.

2024-25 ,2025-26 సంవత్సరానికి సంబంధించి ఇందిరమ్మ ఇళ్లు ప్రతి గ్రామానికి పారదర్శకంగా అర్హుల ఎంపిక జరుగుతుందనీ తెలిపారు.హుస్నాబాద్ లో మొత్తం 309 పోలింగ్ స్టేషన్ లు ఉన్నాయనీ, 160 కి పైగా గ్రామాలు ఉన్నాయనీ, ఏప్రిల్ నెలలో రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ జరుగుతుందనీ చెప్పారు. రైతు భరోసా కార్యక్రమం ద్వారా రైతులకు డబ్బులు వేయడం జరుగుతుందనీ, ఇందిరా భరోసా నిధులు మొదటి విడత పూర్తయ్యాయన్నారు.ఉగాది రోజు వెయ్యికి పైగా సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ గ్రామాల్లో జరుగుతుందన్నారు.గ్రామాల్లో ఎక్కడ నీళ్ళ కొరత ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారి చేశారు.

గ్రామాల్లో ఏ సమస్య ఉన్న గ్రామ కార్యదర్శి ద్వారా జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.కరీంనగర్ నుంచి హుస్నాబాద్ నాలుగు లైన్ల రోడ్డు కు టెండర్లు పూర్తయ్యాయని, మెడికల్ కాలేజి, నర్సింగ్ కాలేజి, లైబ్రరీ వచ్చిన స్థలాలు ఉండేలా ఏర్పాటు చేశామన్నారు.

75 సంవత్సరాల ప్రభుత్వ స్కూల్ ఉత్సవాల్లో పాల్గొన్నప్పుడు పలు సమస్యలు తీసుకొచ్చారు.. వాటన్నిటినీ పరిష్కారం చేస్తున్నామని చెప్పారు.డిసెంబర్ 4 న పెద్దపల్లి సిఎం సభలో శాతవాహన యూనివర్సిటీ కి ఇంజనీరింగ్ కాలేజి ఇవ్వాలని విజ్ఞప్తి చేయడం జరిగిందనీ,100 రోజుల్లో శాతవాహన యూనివర్సిటీ కి హుస్నాబాద్ లో ఇంజనీరింగ్ కాలేజి మంజూరు అయిందనీ స్పష్టం చేశారూ. 10 సంవత్సరాల క్రితమే ఇంజనీరింగ్ కాలేజి స్టార్ట్ అయ్యేదనీ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆలస్యం అయిందనీ చెప్పారు.

# ఉగాది పర్వదినానికి సిద్ధమైన శ్రీ మహాశక్తి దేవాలయం

## ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్, మార్చి 29(భారత శక్తి):కరీంనగర్ పట్టణం చైతన్యపురిలోని మహిమాన్విత శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్ల దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలకు సిద్ధమైంది. తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలను పురస్కరించుకొని శ్రీ మహాశక్తి దేవాలయానికి కరీంనగర్ జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి తరలివచ్చే అశేష భక్తులకు కనువిందు చేసేలా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణతో పాటు దేవాలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో ఆదివారం రోజున ఉగాది పండుగను పురస్కరించుకుని దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం 4:30 గం.లకు శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహా సరస్వతి అమ్మవార్లకు అభిషేకం అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేపట్టనున్నారు. ఉదయం 7 గంటలకు ఉగాది పచ్చడి వితరణ, సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవాలయంలో జరుగనున్న పంచాంగ శ్రవణ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా విచ్చేస్తున్న ఉగాది తెలుగు నూతన సంవత్సరం విశ్వావసు నామ సంవత్సరంలో దేవాలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సమస్త హిందూ బంధువులంతా పాల్గొని అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.

# ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సలహాలు అందించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

### వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అధికారులతో సమీక్షించిన సీఈఓ




కరీంనగర్, మార్చి 29(భారత శక్తి): ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను కోరారు.శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఓటరు జాబితా సవరణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ఎన్నికల కంటే మెరుగ్గా రానున్న రోజుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు, అన్ని వర్గాలకు చెందిన ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు వినూత్న కార్యక్రమాల అమలుకు, పకడ్బందీగా చేపట్టాలని కోరారు. నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికి తమ విధులు గురించి పూర్తిగా తెలిసి ఉండాలన్నారు. సజావుగా శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు చేపట్టాల్సిన చర్యల గురించి సలహాలు అందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మహేశ్వర్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీ కి మెరుగైన వైద్యం అందించాలి:బికెయంయు రాష్ట్ర కార్యదర్శి సృజన్ కుమార్



కరీంనగర్, మార్చి 29(భారత శక్తి):తీవ్ర ఎండతో ఉపాధి హామీ పనులకు వెళ్లి పడిపోయిన సిరిసిల్ల గణపతి కి మెరుగైన వైద్యం అందించి, వారికీ ఆర్థిక సహాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని బికెయంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు.శనివారం తీవ్ర ఎండతో పడిపోయిన గణపతి ని 108 లో కరీంనగర్ ప్రభుత్వ అస్పత్రిలో చేర్చగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామంలో రోజులాగే ఉపాధి హామీ పనికి వెళ్లిన కార్మికులు పని ప్రదేశం గట్టిగా ఉండడం వల్ల ముందు రోజే ఆ ప్రదేశంలో నీటితో తడిపి శుక్రవారం పనికి వెళ్లగా ఎండ తీవ్రంగా ఉండడం వల్ల నీటితో పని ప్రదేశాన్ని తడిపిన చెట్ల పొదలు ఎంత తీసిన రాకపోయే సరికి ఇంటికి వెళ్లి గడ్డపార తీసుకు రావడానికి వెళ్ళుతుండగా ఎండ ఎక్కువ ఉండడంతో అక్కడే కల్లు తిరిగి పడిపోవడంతో 108 కు ఫోన్ చేయగా అంబులెన్సు వచ్చి కరీంనగర్ ప్రభుత్వ అస్పత్రిలో చేరచారని, ఇప్పటికి సంబంధిత అధికారులు అస్పత్రికి రాలేదని, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధి హామీ కూలికి ప్రమాదం జరిగిన ఇప్పటివరకు అధికారులు బాధితున్ని పరామర్శించకపోవడం బాధ్యత రహిత్యమని, ఆ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం అని వేంటనే ఉపాధి హామీ అధికారులు స్పందించి వారికీ మెరుగైన వైద్యం అందించాలని, వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యం, నీడ సౌకర్యం తో పాటు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ పంపిణి చేయాలని, ఎండ ప్రమాదాల నుండి కూలీలకు రక్షణ కల్పించాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బ్రాహ్మణపల్లి యుగేందర్, నాయకులు నల్లగొండ శ్రీనివాస్, రాజయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# వలస కూలీలకు ప్రభుత్వ పరంగా ప్రమాద బీమా, మినీ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

## టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి





సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మార్చి 29:పత్తి మిర్చి కోతకు వెళ్లే వలస కూలీలకు ప్రభుత్వ పరంగా ప్రమాద బీమా సౌకర్యం మినీ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అతి తక్కువ వేతనంతో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన వారిని, నిరుపేదలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదుకోవాలని టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు.హుజూర్నగర్ నియోజకవర్గంలోని గరిడేపల్లి మేళ్లచెరువు పాలకీడు బేతోలు చిలుకూరు మఠంపల్లి తదితరు గ్రామాల నుంచి రోజువారీమహిళ కూలీలకు ఆటోలలో పత్తి మిరప మరియు ఇతర పనులకు దొండపాడు మల్లారెడ్డి గూడెం చింతలపాలెం మండలం తదితర గ్రామాలకి ఆంధ్ర ప్రాంతం గ్రామాలకి కోతలకి వెళు _న్నారని ఈ ప్రయాణంలో అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు వదులుతున్నా రని ఆదివారం ఉగాది సందర్భంగా నిరుపేదలకు 6 కిలోల సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని హుజూర్ నగర్ విచ్చేయుచున్న ముఖ్యమంత్రి ఈ ప్రాంతం పై ప్రత్యేక శ్రద్ధ చూపి రోజువారి కూలీలను కనీస వేతనం కూడా లభించకుండా పనిచేస్తున్న నిరుపేదలను గుర్తించి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి నాయకుడు గుండె పోయిన వెంకన్న యాదవ్, రవి, సాముల కోటమ్మ, అమరవరపు స్వరూప, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

::రైస్ మిల్లులలో రోజువారి దినసరి కూలి 700 కు పెంచాలి::

ఈనాడు పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా రైస్ మిల్లులో పనిచేసే రోజువారి దిన కూలీల రోజు వారి కూలీ700/బిరూ.లు రూపాయలకు పెంచాలని మరియు ఆలయన్స్ పెంచాలని టి యన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోజుపతి మిల్లర్స్ అసోసియేషన్ ను కోరారు. శనివారం హుజూర్ నగర్ మిల్లర్ అసోసియేషన్ భవన్లో రైస్ మిల్ దినకూలీలతో కలిసి ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే అగ్రిమెంట్లు గత సంవత్సరం డిసెంబర్ 31 2024 నాటికి పూర్తయినందున తిరిగి అగ్రిమెంట్ చేసుకొనుట కోసం గతంలో రెండు సార్లు కోరికల నోటు ఇవ్వటం జరిగింది. ఈరోజు చర్చలు జరిగిన ఒక కొలిక్కి రాలేదని. రైస్ మిల్ డ్రైవర్ వేతనాల చర్చలు జరుగుతునాయని వారి వేతనాలు పెరిగాక దినకూలీల రోజు వారి కూలి పెంచుతామని యాజమాన్యం అనడంతో చర్చలు వాయిదా పడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి లక్ష్మీనరసింహారావు, గజ్జి ప్రభాకర్, శ్రీనివాస్ రావు మరియు దిన కూలీల యూనియన్ టి ఎన్ టి సి అధ్యక్ష కార్యదర్శులు సాములు కోటమ్మ, అమరవరపు స్వరూప, రైస్ మిల్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు గుండెబోయిన వెంకన్న యాదవ్, మున్ని, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 53వ రోజు డంపింగ్ యార్డ్ నిరసనలు



సంగారెడ్డి (గుమ్మడిదల),భారత శక్తి ప్రతినిధి, మార్చి 29: పచ్చటి పొలాల వాతావరణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం దారుణమని సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారా నగర్ వద్ద డంపింగ్ యార్డ్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా రైతులు, మండల ప్రజల నిరసనలు శుక్రవారానికి 53వ రోజుకు చేరుకున్నాయి. పచ్చని అడవిలో చెత్త వేస్తే పంటలు దెబ్బతిని, భూగర్భజలాలు కలుషితం అవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, “డంపింగ్ యార్డ్ వల్ల పర్యావరణ హాని జరుగుతుంది అన్నారు. పచ్చటి పొలాల మధ్యలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి,సురభి నాగేందర్ గౌడ్, దోమడుగు బాల్ రెడ్డి, జగ్గారెడ్డి బాల్రెడ్డి, లక్ష్మీనారాయణ, గోపాల్, రమేష్, శంకర్ యాదవ్, బిక్షపతి రెడ్డి, అయుబ్, శ్రీనివాస్ రెడ్డి,దీక్షలో పాఠక్ లక్ష్మారెడ్డి, ఆర్.రమణారెడ్డి ఆర్.రామ్ రెడ్డి, ఆర్.బాల్రెడ్డి,మద్దుల బలరాం రెడ్డి, కావలి అశోక్, కే.రాజిరెడ్డి, కావలి రమేష్, రాజశేఖర్ రెడ్డి, పుట్ట ఎల్లయ్య జేఏసీ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# ఇకపై వాట్సప్ స్టేటస్‌లో సాంగ్ యాడ్ చేయొచ్చు.. ఎలా అంటే?

తక్షణ సందేశం పంపాలన్నా, ఫొటోలు పంచుకోవాలన్నా వెంటనే గుర్తుకువచ్చే మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు, అప్‌డేట్లను అందిస్తూ యూజర్లను ఆశ్చర్యానికి గురిచేస్తుందీ యాప్. తాజాగా మరో కొత్త సదుపాయంతో ముందుకొచ్చింది. స్టేటస్‌లో పాటల్ని జోడించే ఫీచర్‌ని తీసుకొచ్చింది. దీన్ని ఎలా వినియోగించాలంటే?

సాధారణంగా ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ అప్‌లోడ్ చేసేటప్పుడు పోస్ట్‌కు తగ్గట్టుగా మనకు నచ్చిన పాటను ఎంచుకొనే సదుపాయం ఉంది. ఇలా తాత్కాలిక మ్యూజిక్ క్లిప్‌లను జోడించే సదుపాయాన్ని వాట్సప్ కూడా ప్రవేశపెట్టింది. అచ్చం ఇన్‌స్టాగ్రామ్‌లానే ఇకపై స్టేటస్‌లో 24 గంటల పాటు వారి ఫొటోలు, టెక్ట్స్, వీడియోలకు పాటలు జోడించొచ్చు. మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ఈ ఫీచర్‌ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది. ఇప్పటికే చాలామంది యూజర్లకు ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది.

మ్యూజిక్ యాడ్ ఎలా?

సాధారణంగా వాట్సప్‌లో స్టేటస్ సెలెక్ట్ చేసుకొనే లాగా %ూాఎల ర్థ్‌బం% ఆప్షన్‌పై క్లిక్ చేసి గ్యాలరీలో మీకు నచ్చిన ఫొటో వీడియో ఏదో ఒకటి సెలెక్ట్ చేసుకోవాలి. ఎంచుకోగానే క్రాప్, స్టిక్కర్, టెక్ట్స్, ఎడిట్ ఆప్షన్లు సాధారణంగా స్క్రీన్‌పై కనిపిస్తాయి. వాటిముందే మ్యూజిక్ ఐకాన్ కొత్తగా దర్శనమిస్తుంది. దాన్ని క్లిక్ చేసి మీకు నచ్చిన పాటను ఎంచుకోవచ్చు. అయితే ఇలా ఫొటో కోసం 15 సెకన్లు, వీడియో కోసం 60 సెకన్ల వరకు పాటను ఎంచుకోవచ్చు. పాట ఎక్కడినుంచి ప్లే కావాలని కోరుకుంటున్నారో అలా అడ్జెస్ట్ చేసుకొనే సదుపాయం కూడా ఉంది.

# వెండీ బంగారమాయె: పసిడితో పోటీ పడుతున్న వెండి



బంగారం ధర పెరుగుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న డిమాండ్ కారణంగా దేశీయంగా రికార్డు గరిష్ఠాలను నమోదు చేస్తోంది. తాజాగా 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.92 వేల మార్కు దాటడంతో పసిడి కొనుగోళ్లకు వెనకడుగు వేస్తున్నారు వినియోగదారులు. పసిడి పరుగులో చాలా మంది గుర్తించని ఇంకో విషయమేమిటంటే వెండి ధరలూ అదే స్థాయిలో పరుగులు పెడుతున్నాయి. గడిచిన ఏడాదిలో బంగారం, వెండి 37 శాతం మేర పెరగ్గా.. గడిచిన నెలలో బంగారం 6.70 శాతం మేర పెరగ్గా.. వెండి 8.80 శాతం మేర పెరగడం గమనార్హం.

అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం బంగారం ఔన్సు ధర 3,100 డాలర్ల పైబడి ట్రేడవుతోంది. వెండి సైతం ఔన్సు 34 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దేశీయంగా వెండి కిలో రూ.1.03 లక్షల వరకు పలుకుతోంది. గతేడాది మే నెలలో ఔన్సు వెండి 32 డాలర్లు పలకగా.. అక్టోబర్‌లో 34 డాలర్లకు పెరిగింది. దీంతో గతేడాది దీపావళి సమయంలోనే వెండి రూ.లక్ష మార్కు దాటింది. అప్పట్లో అందరూ ముక్కున వేలేసుకున్నారు. ఆ తర్వాత డిసెంబర్ నాటికి ఔన్సు 28 డాలర్ల స్థాయికి దిగొచ్చింది. అక్కడి నుంచి మళ్లీ దాదాపు 20 శాతం మేర పెరిగి 34.45 డాలర్ల స్థాయికి చేరింది. 2020లో 16 డాలర్ల వద్ద ఉన్న వెండి.. గడిచిన ఐదేళ్లలో 19.4 శాతం సీఏజీఆర్‌తో దూసుకెళుతోంది.

ఎందుకు పెరుగుతోంది?

ద్రవ్యోల్బణాన్ని అధిగమించే పెట్టుబడి సాధనాలుగా బంగారం, వెండికి ఎప్పటినుంచో పేరుంది. ప్రస్తుతం ట్రంప్ మూలంగా నెలకొన్న వాణిజ్య యుద్ధ భయాలు, భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు వీటికి డిమాండ్ పెంచుతున్నాయి.

బంగారం మాదిరిగా కాకుండా వెండిని పారిశ్రామిక అవసరాలకూ వినియోగిస్తుండడం మరో కారణం. ముఖ్యంగా ఈవీ, సోలార్ పరిశ్రమల నుంచి వెండికి పెరిగిన డిమాండ్ కారణంగా ఈ లోహం ధర పరుగులు పెడుతోంది.

వెండి డిమాండ్‌కు తగిన సప్లయ్ లేకపోవడమూ మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. 2025లో 1.20 బిలియన్ ఔన్సుల వెండి అవసరం అవుతుందన్న అంచనా కాగా.. సప్లయ్ మాత్రం 1.05 బిలియన్ ఔన్సులే ఉంటుందన్న అంచనాలు ఉన్నాయి.

బంగారం, వెండికి ఉన్న అవినాభావ సంబంధం ఏళ్లుగా కొనసాగుతోంది. 1980ల నుంచి అంతర్జాతీయంగా ఔన్సు ధరలో వీటి ధరల మధ్య నిష్పత్తి 70:1గా ఉంది. ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే 90:1గా ఉంది. ఈ లెక్కన వెండి ధరలు మరింత పెరిగేందుకు అవకాశం ఉందంటున్నారు నిపుణులు. బంగారం ధర తగ్గినా ఈ నిష్పత్తిని చేరుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

మెక్సికో, ఆస్ట్రేలియా, రష్యా, పెరూ వంటి దేశాల్లో వెండి మైనింగ్ జరుగుతోంది. మైనింగ్ కార్యకలాపాలు జోరందుకుంటే వెండి ధరలు దిగొస్తాయని చెబుతున్నారు. వాణిజ్య యుద్ధ భయాలు తగ్గి మళ్లీ స్టాక్ మార్కెట్ల వైపు పెట్టుబడులు మళ్లినా బంగారంతో పాటు వెండి ధరలూ దిగొస్తాయి.

చరిత్రలో వెండి


వెండి ధర ఇప్పటి కంటే దాదాపు నాలుగు దశాబ్దాల క్రితమే ఇంకా ఎక్కువగా ఉండేది. 1980 జనవరిలో అత్యధికంగా ఔన్సు 49.95 డాలర్లు పలికింది. ఆ తర్వాత తగ్గుముఖం పట్టింది. మళ్లీ 2011 ఏప్రిల్ నెలలో 47.94 డాలర్లకు చేరింది. అప్పటి ధరలతో పోలిస్తే నేటి ధరలు తక్కువనే చెప్పాలి.



# పరిమితి దాటితే వాతే.. ఏటీఎం విత్‌డ్రాపై 23 ఛార్జీ

ముంబయి: ఏటీఎంలో లావాదేవీ ఇక భారం కానుంది. నెలవారీ ఉచిత పరిమితి దాటిన తర్వాత ఒక్కో లావాదేవీపై రూ.23 చొప్పున వసూలు చేసుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాబ్యాంకులకు అనుమతిచ్చింది. మే 1 నుంచి పెరిగిన ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. సాధారణంగా కస్టమర్లకు ఒక నెలలో సొంత బ్యాంకు ఏటీఎం నుంచి ఐదు లావాదేవీలు (నగదు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్) ఉచితంగా పొందొచ్చు. అదే వేరే బ్యాంకు ఏటీఎం నుంచి అయితే మెట్రో ప్రాంతాల్లో 5 లావాదేవీలు, ఇతర ప్రాంతాల్లో 3 లావాదేవీలకు అనుమతిస్తారు. ఈ పరిమితి దాటితే లావాదేవీ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక్కో లావాదేవీకి రూ.21 చొప్పున ఖాతాదారుల నుంచి రుసుము వసూలు చేస్తున్నారు. ఆర్‌బీఐ తాజాగా అనుమతించిన నేపథ్యంలో ఆ మొత్తం రూ.23కి పెరగనుంది.

ఒకప్పుడు బ్యాంకింగ్ సేవల్లో విప్లవాత్మకంగా భావించిన ఏటీఎంలు.. ఇప్పుడు డిజిటల్ చెల్లింపుల పెరుగుదలతో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఆన్‌లైన్ వాలెట్లు, యూపీఐ లావాదేవీలు పెరగడంతో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణ గణనీయంగా తగ్గింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2013-14లో డిజిటల్ చెల్లింపులు రూ.952 లక్షల కోట్లు ఉండగా, 2022-23 నాటికి ఇది రూ.3,658 లక్షల కోట్లకు చేరుకుంది. తాజా ఫీజు పెంపు నేపథ్యంలో ఇప్పటికీ నగదు లావాదేవీలపై ఆధారపడే వినియోగదారులపై భారం పడే అవకాశం ఉంది. ఇది వారిని డిజిటల్ చెల్లింపుల వైపు నడిపించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# ఏప్రిల్‌లో బ్యాంక్ సెలవులు.. తెలుగు రాష్ట్రాల్లో ఇలా..

ఒకప్పుడు బ్యాంక్‌కు వెళ్లనిదే పనులు జరిగేవి కావు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక మొబైల్‌లోనే దాదాపు అన్ని ఆర్థిక కార్యకలాపాలూ జరిగిపోతున్నాయి. అయితే, బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవాలన్నా, లాకర్‌లో వస్తువులు దాయాలన్నా బ్యాంకులకు వెళ్లాల్సిందే. ఇవి కాకుండా ఇతర ఏ పని మీద బ్యాంకుకు వెళ్లాల్సి వస్తే.. ముందుగా ప్లాన్ చేసుకోవాలి. తీరా ఆ రోజు సెలవు అని తెలిస్తే ఇబ్బంది పడాల్సి రావొచ్చు. కాబట్టి బ్యాంకు శాఖలు పనిచేసే రోజులు తెలుసుకోవాలి. ఏప్రిల్ నెలలో చాలా రోజులు బ్యాంకులకు సెలవులు వస్తున్నాయి.

దేశవ్యాప్తంగా శని, ఆదివారాలతో కలిపి దాదాపు 15 రోజుల పాటు బ్యాంకులకు సెలవులు రానున్నాయి. స్థానిక పండగల దృష్ట్యా రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య సెలవుల్లో వ్యత్యాసం ఉంటుంది. ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ఖాతాల సర్దుబాటు దృష్ట్యా బ్యాంకులు సాధారణ కార్యకలాపాలు నిర్వహించవు. ఇక ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్ రామ్ జయంతి, 14న అంబేడ్కర్ జయంతి, 18న గుడ్ ఫ్రైడే కారణంగా తెలంగాణలో బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని బ్యాంకులకు జగ్జీవన్‌రామ్ జయంతి రోజు మినహా తెలంగాణ మాదిరిగానే ఏప్రిల్ 1, 14, 18 తేదీల్లో బ్యాంకులు పనిచేయవు. శని, ఆదివారాలు కలుపుకొంటే ఏప్రిల్ నెలలో తెలంగాణలో మొత్తం 11 రోజులు, ఆంధ్రప్రదేశ్‌లో 10 రోజులు బ్యాంకులు పనిచేయవు.

# ఏసీలూ పది నిమిషాల్లోనే.. డెలివరీలు ప్రారంభించిన బ్లింకిట్




క్విక్ కామర్స్ కంపెనీలు తమ వ్యాపారాన్ని మరింత విస్తరిస్తున్నాయి. తొలుత గ్రాసరీకి మాత్రమే పరిమితమైన ఈ కంపెనీలు.. తర్వాత మొబైల్ ఫోన్లు, చిన్న చిన్న ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లనూ 10 నిమిషాల్లోనే డెలివరీ చేయడం ప్రారంభించాయి. ఇప్పుడు, జొమాటోకు చెందిన క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ మరో ముందడుగు వేసింది. ఇకపై ఏసీలనూ పది నిమిషాల్లోనే డెలివరీ చేస్తామని ప్రకటించింది. వేసవిలో ఏసీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్ట్యా బ్లింకిట్ ఏసీలను త్వరితగతిన డెలివరీని ప్రారంభించింది.

ఇందుకోసం ప్రముఖ ఏసీ తయారీ సంస్థ లాయిడ్‌తో బ్లింకిట్ జట్టుకట్టింది. ఆ కంపెనీకి చెందిన వివిధ రకాల ఏసీలను 10 నిమిషాల్లోనే అందించనున్నట్లు ఆ కంపెనీ సీఈఓ అల్బీందర్ దిండ్సా వెల్లడించారు. ప్రస్తుతానికి దిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఏసీల డెలివరీలు ప్రారంభమయ్యాయని, త్వరలో మరిన్ని నగరాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు. ఏసీ డెలివరీ అయిన 24 గంటల్లో ఇన్‌స్టలేషన్ సిబ్బంది ఏసీని కోరుకున్న చోట ఫిక్స్ చేస్తారని పేర్కొన్నారు.

# ఎలక్ట్రానిక్స్ విడిభాగాలకు రూ.22,919 కోట్ల పథకం

దిల్లీ: దేశీయంగా సెమీకండక్టర్ యేతర (పాసివ్) ఎలక్ట్రానిక్స్ విడిభాగాల ఉత్పత్తి పెంచేందుకు రూ.22,919 కోట్ల కేటాయింపులతో.. ఒక 'ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్'కు కేంద్ర మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. పాసివ్ ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ ప్రోత్సాహానికి తలపెట్టిన తొలి పథకం ఇదే. ఆరేళ్ల పాటు అమల్లో ఉండే ఈ పథకం ద్వారా రూ.59,350 కోట్ల పెట్టుబడులు వస్తాయని, ప్రత్యక్షంగా 91,600 మందికి ఉద్యోగాలు వస్తాయని మంత్రి తెలిపారు. టెలికాం, వినియోగదారు ఎలక్ట్రానిక్స్, వాహన, వైద్య పరికరాలు, విద్యుత్ రంగాల అవసరాలను ఇది తీరుస్తుందన్నారు. రూ.4.56 లక్షల కోట్ల విలువైన పరికరాల ఉత్పత్తికి ఈ పథకం ఊతం ఇవ్వగలదని వివరించారు. వచ్చే మూడు వారాల్లో ఎలక్ట్రానిక్స్ తయారీ పథకాన్ని ప్రభుత్వం నోటిఫై చేయనున్నట్లు వైష్ణవ్ తెలిపారు.

సైనిక దళాలకు హెచ్‌ఏఎల్ 156 హెలికాప్టర్లు

స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన భారత తొలి తేలికపాటి పోరాట హెలికాప్టర్ 'ప్రచండ్' సైనికదళాల్లో చేరబోతోంది. మొత్తం 156 హెలికాప్టర్ల కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)తో రూ.62,700 కోట్ల విలువైన రెండు ఒప్పందాలను రక్షణ శాఖ శుక్రవారం కుదుర్చుకుంది. ఇందులో వాయుసేనకు 66, సైన్యానికి 90 హెలికాప్టర్లు చేరతాయి. అంతకుముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సీసీఎస్) ఈ హెలికాప్టర్ల సమీకరణకు పచ్చజెండా ఊపింది.

# లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్.. గతంలోనే కారణమేంటో చెప్పిన ధోనీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 9వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. దూకుడుగా ఆడిన అతడు 16 బంతుల్లోనే 30 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అయితే, సీఎస్కేకు మాత్రం ఓటమి తప్పలేదు. దీంతో ధోనీ మరీ లోయర్ ఆర్డర్ దిగువన రావడంపై సోషల్ మీడియాతోపాటు మాజీ క్రికెటర్ల నుంచి కామెంట్లు వచ్చాయి. మ్యాచ్‌లో ముందొస్తే గెలిచే అవకాశాలు ఉండేవని అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, ధోనీ ఇలా దిగువస్థాయిలో బ్యాటింగ్‌కు రావడానికి కారణమేంటో గతంలోనే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. ఇప్పుడా వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒకటి లేదా రెండు మ్యాచుల్లో ఓడినా సరే కుర్రాళ్లకు ఎక్కువ అవకాశం ఇవ్వడం ముఖ్యమనేది ధోనీ ఆలోచన అని తెలుస్తోంది. గత టీ20 ప్రపంచకప్ ముందు ఐపీఎల్ 2024 సీజన్‌లో జరిగిన సంగతి తెలిసిందే. అప్పుడు కూడా ధోనీ ) 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు.

"నాకు అప్పుడు మోకాలి సమస్య ఉంది. గతేడాది నేను దానినుంచి బయటపడ్డా. ఐపీఎల్ 2024 సీజన్ తర్వాత టీ20 ప్రపంచకప్ జరిగింది. ఈ మెగా లీగ్‌లో రాణిస్తే ప్రపంచకప్ జట్టులో చోటు దక్కే అవకాశాలు ఎక్కువ. సీఎస్కే నుంచి రవీంద్ర జడేజా, శివమ్ దూబె పోటీలో ఉన్నారు. వారికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. నేనేమీ జాతీయ జట్టు సెలక్షన్ రేసులో లేను. అందుకోసం పోటీపడటం లేదు. రవీంద్ర జడేజా, శివమ్ దూబె అద్భుతంగా ఆడారు. పొట్టి కప్ కోసం ప్రకటించిన జట్టుకు ఎంపికయ్యారు. మా ఫ్రాంచైజీ ప్లేయర్ల అవకాశాలను నాశనం చేసేది కాదు. ఆటగాళ్లను ప్రమోట్ చేసేందుకు చూస్తాం. ఎవరికివారు తమ పాత్రను పోషిస్తూ నాపై ఒత్తిడి తగ్గిస్తుంటే అంతకుమించి ఇంకేం కావాలి" అని ధోనీ వ్యాఖ్యానించాడు.

**ఇలాంటప్పుడు వచ్చుంటే..**

"విరిగిపోని దానిని మళ్లీ అతికించడం ఎందుకు? బ్యాటర్లు మంచిగా పరుగులు చేస్తున్నప్పుడు సమస్య ఏముంటుంది. ఒకటీ, రెండు మ్యాచుల్లో ఫలితం అనుకూలంగా రాకపోయినా.. కంగారుపడాల్సిన అవసరం లేదు. ప్రతిసారీ ఇలాగే జరిగితే మాత్రం నా ఆలోచనల్లో మార్పు రావచ్చు. అంతా బాగున్నప్పుడు అలాగే కొనసాగించాలి" అని ధోనీ వ్యాఖ్యానించాడు. ఇప్పుడు బెంగళూరుతో




మ్యాచ్‌లో కష్టాల్లో ఉన్నప్పుడు ధోనీ కాస్త ముందుగా బ్యాటింగ్‌కు వచ్చుంటే బాగుండేదని క్రికెట్ విశ్లేషకులు సూచించారు. తొలి మ్యాచ్‌లోనూ (ముంబయితో) ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. ఈ సీజన్ తర్వాత రిటైర్‌మెంట్ తీసుకుంటాడనే వ్యాఖ్యలు వినిపిస్తున్న వేళ.. సీఎస్కేను మానసికంగా సిద్ధం చేసేందుకు ధోనీ ఇలాంటి ప్రణాళికలు రూపొందించినట్లు క్రీడా పండితులు చెబుతున్న మాట.




# ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందు వచ్చి ఉంటే... : షేన్ వాట్సన్

రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ధోనీ ( బ్యాటింగ్ ఆర్డర్‌లో ఇంకాస్త ముందు వచ్చి ఉంటే... చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధించి ఉండేదని ఆస్ట్రేలియా మాజీ ఆల్ రౌండర్ షేన్ వాట్సన్ అభిప్రాయపడ్డాడు. ధోనీ బ్యాటింగ్‌ను అభిమానులు ఆస్వాదిస్తున్నారని చెప్పాడు. అతడు బ్యాటింగ్ ఆర్డర్‌లో మరింత ముందుగా వచ్చి, మరిన్ని పరుగులు చేయాలని వారు కోరుకుంటున్నారన్నాడు. ధోనీ 43 ఏళ్ల వయసులోనూ వికెట్ కీపింగ్ అద్భుతంగా చేస్తున్నాడని షేన్ వాట్సన్ కొనియాడాడు.

'ధోనీ కేవలం 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు. అతడు బ్యాటింగ్ ఆర్డర్‌లో కాస్త ముందుగా వచ్చి ఉంటే ఇంకా బాగుండేది. నా ఉద్దేశంలో అశ్విన్ కన్నా ముందే క్రీజులోకి వచ్చి ఉండాల్సింది. మరో 15 బంతులు ఇలాగే ఆడి ఉంటే... కచ్చితంగా చెన్నై సూపర్ కింగ్స్ విజేతగా నిలిచి ఉండేది' అని షేన్ వాట్సన్ స్టార్ స్పోర్ట్స్‌తో అన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ కాంబినేషన్ కూడా సరిగా లేదన్నాడు. దీపక్ హుడా (%ణవవజూఖని ఎశీశీఖు%) తన స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయాడని అభిప్రాయపడ్డాడు. అలాగే సామ్ కరన్ ( అయిదో స్థానంలో కాకుండా ఏడో స్థానంలో బ్యాటింగ్ చేస్తే బాగుంటుందని వాట్సన్ సూచించాడు.

రాహుల్ త్రిపాఠి ని ఓపెనర్‌గా పంపడం మంచి నిర్ణయం కాదన్నాడు. రుతురాజ్ గైక్వాడ్ మంచి నైపుణ్యం ఉన్న ఓపెనర్. కానీ అతడేమో తర్వాత బ్యాటింగ్‌కు వచ్చాడని వాట్సన్ అన్నాడు. రుతురాజ్ కూడా హేజిల్‌వుడ్ ( బౌలింగ్‌లో కొన్ని షాట్లు మరింత మెరుగ్గా ఆడి ఉండాల్సిందన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ ఇదే బ్యాటింగ్ లైనప్‌ను కొనసాగిస్తే వారు రానున్న మ్యాచుల్లో కూడా ఇబ్బందుల పాలయ్యే ప్రమాదం ఉందని షేన్ వాట్సన్ హెచ్చరించాడు. శుక్రవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు 50 పరుగుల తేడాతో చెన్నైపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు 196 పరుగులు చేసింది. ఛేదనలో చెన్నై 146 పరుగులు మాత్రమే చేయగలిగింది.

# సెంట్రల్ కాంట్రాక్ట్‌లోకి కొత్త పేరు..? బీసీసీఐ మీటింగ్ వాయిదా

గువాహటి వేదికగా ఇవాళ జరగాల్సిన సమావేశాన్ని బీసీసీఐ వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఇతర అధికారులు సమావేశం కావాల్సి ఉంది. సెంట్రల్ కాంట్రాక్ట్‌లు, ఇంగ్లాండ్ పర్యటన సన్నద్ధతపై చర్చించాల్సి ఉంది. ఇప్పుడు కొత్త తేదీకి మీటింగ్‌ను మార్చినట్లు కథనాలు వస్తున్నాయి. అయితే, ఎప్పుడనేది ఇంకా తెలియరాలేదు. ప్రధాన కోచ్ గంభీర్ కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లిన సంగతి తెలిసిందే. అతడు అందుబాటులో లేకపోవడమూ సమావేశం వాయిదాకు కారణమై ఉండొచ్చని తెలుస్తోంది.

**వారితో చర్చించాకనే..**

ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్‌తో బీసీసీఐ ప్రధానంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్టు భవిష్యత్తుపై చర్చించనుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో కొనసాగించడంపైనా.. భారత టెస్టు జట్టుకు కొత్తగా ఎవరిని సారథిగా నియమించాలి? అలాగే సెంట్రల్ కాంట్రాక్ట్‌ల్లో %ూ% జాబితాలోని రోహిత్, విరాట్, బుమ్రా, జడేజాను కొనసాగిస్తారా? లేదా? అనేది కీలక పాయింట్. టీ20 ప్రపంచ కప్ ముగిసిన తర్వాత రో–కో రాకుండా జడేజా కూడా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అన్నింట్లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే వారికే %ూ% ఇవ్వాలనేది కొందరి వాదన. అయితే, ఇప్పటికైతే వీరి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చనేది పలువురి అభిప్రాయం. ఇక ఇంగ్లాండ్‌తో జూన్‌లో టెస్టు సిరీస్‌ను ఆడనుంది. జట్టు ఎంపికతోపాటు సన్నద్ధతపై తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా ఇందులో చర్చ జరగనుంది.

**వరుణ్‌కు అవకాశం..**

ఛాంపియన్స్ ట్రోఫీలో అదరగొట్టిన




వరుణ్ చక్రవర్తి కి బంపర్ ఆఫర్ తగలనుంది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో చోటు దక్కే అవకాశం ఉంది. అతడితోపాటు గతంలో కాంట్రాక్ట్‌లను కోల్పోయిన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ పేర్లనూ చేర్చడం ఖాయంగానే కనిపిస్తోంది. అదే సమయంలో కాంట్రాక్ట్‌ల్లో పలువురికి పదోన్నతి లభించే ఛాన్స్ లేకపోలేదు.



# ఈసారి హార్దిక్‌ను హేళన చేయరనుకుంటున్నా: మహేల

ఐపీఎల్ 2024 సీజన్ ముంబయి ఇండియన్స్ (కు పెద్ద పీడకల. ఆ జట్టు ప్రదర్శనే కాకుండా.. కెప్టెన్‌గా వచ్చిన హార్దిక్ పాండ్యపై ఫ్యాన్స్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతి మ్యాచ్ సమయంలో హేళన చేశారు. ఆ తర్వాత భారత్ టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలో హార్దిక్ పాండ్య కీలకమైన ఆల్‌రౌండ్ పాత్ర పోషించాడు. దీంతో అతడిపై అభిమానుల్లో మునుపటి ఆగ్రహం తగ్గిందనేది క్రికెట్ విశ్లేషకుల మాట. ఇదే అభిప్రాయాన్ని ముంబయి ఇండియన్స్ కోచ్ మహేల జయవర్ధనె వెల్లడించాడు. గతేడాది స్లో ఓవర్ రేట్ కారణంగా పాండ్య ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో ఆడని సంగతి తెలిసిందే. చెన్నైతో మ్యాచ్‌కు సూర్యకుమార్ యాదవ్ సారథిగా వ్యవహరించాడు. ఇప్పుడు తన పాత జట్టు గుజరాత్ టైటాన్స్ తో తలపడేందుకు హార్దిక్ సిద్ధమవుతున్నాడు.

"క్రికెట్‌లో ఇలాంటివన్నీ సహజమే. అభిమానులు తమకు ఇష్టమైన వాటి గురించి స్పందించడం మామూలే. భావోద్వేగాలన్నీ ఆటలో భాగమే. ఇప్పుడు వాటన్నింటి నుంచి బయటకొచ్చి ముందుకుసాగుతున్నాం. ఆటపై హార్దిక్ విధేయత అందరికీ తెలిసిందే. గత 12 నెలల్లో అతడు చేసిన దానికి ప్రతిఒక్కరూ ఫిదా కావాల్సిందే. అద్భుత విజయాలను అందించాడు. గతేడాది మాదిరిగా ఈసారి ఎవరూ అతడిని అవహేళన చేయరని



భావిస్తున్నా. ప్రతిఒక్కరూ పాండ్య ఆటను ఆస్వాదిస్తారనుకుంటున్నా" అని మహేల వెల్లడించాడు.

**బుమ్రా రిటర్న్‌పై..**

"ముంబయి జట్టులో ప్రతిఒక్కరూ ఉత్సాహంగా ఉన్నారు. తమ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా ఎప్పుడు వస్తాడనేది ఇప్పుడే చెప్పలేం. గతంలోనే అతడి ఫిట్‌నెస్‌పై అప్‌డేట్ ఇచ్చా. రోజూ గమనిస్తూనే ఉన్నాం. అంతా బాగానే ఉంది కానీ, రిటర్న్‌పై ఎన్‌సీఏ నుంచి మాకు ఎలాంటి టైమ్‌లైన్ రాలేదు. అందుకోసమే మేం వేచి ఉన్నాం" అని ముంబయి కోచ్ స్పష్టంచేశాడు. ఆసీస్‌తో గత బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ చివరి టెస్టు సందర్భంగా బుమ్రా వెన్ను నొప్పి తిరగబెట్టింది. అప్పట్నుంచి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లోనే ఉంటున్నాడు. వచ్చే వారం ముంబయితో కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# 'ఆ హీరో రికార్డ్ .. ఐపీఎల్‌లో బద్దలవుతుందా? - 5

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో రికార్డులకు కొదవేలేదు. కొన్నింటిని బద్దలు కొడితే.. మరికొన్నింటి వైపు కనీసం వెళ్లడమూ కష్టమే. ఇలాంటి జాబితాలో 'సిక్సుల' రికార్డూ ఒకటి. మరి ఈ జాబితాలో ఎవరు ఉన్నారు? ఆ రేసులో నిలిచిందెవరు?

ఐపీఎల్‌లో బ్యాటర్ల దూకుడు తెలిసిందే. బౌండరీలతో విరుచుకుపడటం సహజమే. స్టాండ్స్ ఆవల బంతిని పంపించేందుకు బ్యాటర్లు ఆసక్తి చూపిస్తారు. 'కొడితే సిక్స్ కొట్టాలిరా' అన్నట్లుగా మోత మోగించే ఐపీఎల్‌లో యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ ) అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్. అతడు 142 మ్యాచుల్లో 357 సిక్స్‌లు కొట్టాడు. ఐపీఎల్‌లో ఇదే బెస్ట్ రికార్డు.

మరి క్రిస్ గేల్ 'సిక్స్'ల ఘనతను సాధించాలంటే ముగ్గురికే అవకాశం ఉంది. అదీనూ భారత్‌కు చెందిన వారే కావడం గమనార్హం. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (280), విరాట్ కోహ్లి (276), ఎంఎస్ ధోనీ (254) మాత్రమే రేసులో నిలిచారు. గేల్‌ను రోహిత్ అధిగమించాలంటే ఇంకా 78 సిక్స్‌లు బాదాలి. అలా జరగాలంటే ఇప్పుడీ సీజన్‌తోపాటు కనీసం మరో రెండు ఎడిషన్లు ఆడితేనే సాధ్యమనేది క్రికెట్ విశ్లేషకుల మాట.



# తమన్నాతో బ్రేకప్.. రిలేషన్‌షిప్‌పై విజయ్ వర్మ వ్యాఖ్యలు

'లస్ట్ స్టోరీస్ 2' (తో పరిచయమై.. కొంతకాలానికే ప్రేమలో పడ్డారు తమన్నా విజయ్ వర్మ ( సుమారు రెండేళ్ల పాటు ప్రేమలో ఉన్న వీరిద్దరూ ఇటీవల బ్రేకప్ చెప్పేసుకున్నారని గత కొన్ని రోజులుగా కథనాలు వెలువడుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఈ వార్తలు వైరల్‌గా మారిన తరుణంలో తాజాగా నటుడు విజయ్ వర్మ రిలేషన్‌షిప్‌ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రిలేషన్‌షిప్‌లోని ప్రతి విషయాన్ని ఆనందించాలని ఆయన అన్నారు. ఒక బంధాన్ని సంతోషంగా మార్చుకొనే సమయంలో ఎలాంటి పరిణామాలు ఎదురైనా వాటిని స్వీకరించాలన్నారు.

''రిలేషన్‌షిప్‌ను ఒక ఐస్‌క్రీమ్ మాదిరిగా ఆద్యంతం ఆస్వాదించాలి. అలా చేసినప్పుడే నువ్వు సంతోషంగా ఉండగలవు. సంతోషం, బాధ, కోపం, చిరాకు.. ఇలా ప్రతి అంశాన్ని నువ్వు స్వీకరించాలి. దానితోపాటు ముందుకుసాగాలి'' అని ఆయన అన్నారు. మరోవైపు, తమన్నా సైతం ఇటీవల ప్రేమ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. నిస్వార్థమైన ప్రేమను తాను నమ్ముతానని అన్నారు. ప్రేమను ఎప్పుడైతే వ్యాపార లావాదేవీగా చూడటం మొదలుపెడతావో అప్పుడే అసలు సమస్యలొస్తాయని ఆమె చెప్పుకొచ్చారు. రిలేషన్‌లో ఉన్నప్పుడు కంటే లేనప్పుడే తాను ఆనందంగా ఉన్నానని.. భాగస్వామి ఎంపిక విషయంలో ఒకింత జాగ్రత్తగా ఉండాలంటూ ఒకరకమైన హెచ్చరిక చేశారు.

2023లో విడుదలైన 'లస్ట్ స్టోరీస్ 2' కోసం తొలిసారి కలిసి వర్క్ చేశారు తమన్నా, విజయ్ వర్మ. ఈ సిరీస్ చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో ఈ జంట బయటపెట్టింది. రిలేషన్‌లో ఉన్నప్పుడు ప్రతి ఫంక్షన్‌కు కలిసి హాజరైన ఈ జంట.. ఇటీవల జంటగా ఎక్కడా కనిపించడం లేదు. దీంతో వీరిద్దరూ విడిపోయారని ప్రచారం సాగుతోంది. ఆ వార్తలపై వీరిద్దరూ స్పందించలేదు కానీ, రవీనాటాండన్ ఇంట జరిగిన హోలీ వేడుకలకూ వేర్వేరుగానే వచ్చారు. అంతేకాకుండా ఆమె షేర్ చేసిన ఫొటోల్లో ఆయన కనిపించలేదు. ఆయన పంచుకున్న ఫొటోల్లో తమన్నా జాడే లేదు.

# ఎల్2:ఎంపురాన్ వివాదం.. స్పందించిన రచయిత

స్క: మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ ( దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్' . ఈ సినిమాలోని పలు సన్నివేశాల విషయంలో వివాదం నెలకొంది. దీనిపై తాజాగా చిత్ర రచయిత మురళీ గోపీ స్పందించారు. ఈ వివాదంపై తానేమీ మాట్లాడాలనుకోవడం లేదన్నారు.



''ఈ కాంట్రవర్సీ గురించి నేను పూర్తిగా మౌనంగా ఉండాలనుకుంటున్నా. వాళ్లకు నచ్చినవిధంగా అనుకోనివ్వండి. ఒక సినిమాని తమకు నచ్చినవిధంగా ఊహించుకునే హక్కు ప్రతిఒక్కరికీ ఉంది. కాబట్టి.. వాళ్లకు నచ్చినవిధంగా ఊహించుకోనివ్వండి. నేను మాత్రం మౌనంగానే ఉంటాను'' అని అన్నారు. అదేవిధంగా ఆయన వామపక్ష భావజాలం ఉన్న సంస్థలపైనా ఆగ్రహం వ్యక్తంచేశారు. వారు చాలాకాలం క్రితమే తమ భావజాలాలను విడిచిపెట్టారన్నారు.

2019లో విడుదలైన 'లూసిఫర్'లో భాగంగా 'ఎల్ 2: ఎంపురాన్' సిద్ధమైంది. స్టీఫెన్ గట్టుపల్లిగా మోహన్‌లాల్, జతిన్ రామ్‌దాస్‌గా టొవినో థామస్, బాబా భజరంగీగా అభిమన్యు సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని రూపొందించిన పృథ్వీరాజ్ ఇందులో సయ్యద్ మసూద్‌గా నటించారు. ఎన్నో అంచనాల మధ్య గురువారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, ఇందులోని పలు సన్నివేశాల విషయంలో అంతటా తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది.

2002లో గుజరాత్‌లో చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో ఇందులో కీలక సన్నివేశాలుగా చూపించారు. అల్లర్ల సమయంలో సయ్యద్ మసూద్ కుటుంబాన్ని ఒక వర్గానికి చెందిన నాయకుడు దారుణంగా హత్య చేయడం.. కొంతకాలానికి అతడే రాజకీయాల్లోకి అడుగుపెట్టడం వంటి అంశాలతో సాగిన ఈ సన్నివేశాలను పలువురు తప్పుపడుతున్నారు. ఒక వర్గాన్ని తక్కువ చేసి చూపించేలా ఈ సీన్స్ ఉన్నాయని అంటున్నారు. పృథ్వీరాజ్ దర్శకత్వాన్ని విమర్శిస్తూ నెట్టింట వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ చిత్రాన్ని నిలిపివేయాలని వామపక్ష వాదులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు రోజులు ఏ రూ.100 కోట్లు

కలెక్షన్స్ పరంగా 'ఎల్2: ఎంపురాన్' దూసుకెళ్తోంది. 48 గంటల్లోనే రూ.100 కోట్లు వసూలుచేసి చరిత్ర సృష్టించిందని టీమ్ పేర్కొంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మోహన్‌లాల్ తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. తమ చిత్రాన్ని ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు.

# బాలీవుడ్ విషయంలో ఆందోళనగా ఉంది: జాన్ అబ్రహం

హిందీ చిత్ర పరిశ్రమను చూస్తుంటే ఆందోళనగా ఉందని బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన ప్రస్తుతం బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న సినిమాల గురించి మాట్లాడారు. బాలీవుడ్‌లో తెరకెక్కే సినిమాలపై సోషల్ మీడియాలో తీవ్రంగా విమర్శలు వస్తున్నాయని తెలిపారు.''హిందీ చిత్రపరిశ్రమ గందరగోళంగా ఉంది. ఈ ఇండస్ట్రీకి చెందిన వ్యక్తిగా నేను ఆందోళన చెందుతున్నాను. భిన్నంగా ప్రయత్నించాల్సిన సమయం వచ్చింది. కొత్తగా ప్రయత్నించాలనుకునే వారు చాలా తక్కువమంది ఉన్నారు. నేను కమర్షియల్ హీరోని.. ఎప్పుడూ కమర్షియల్ సినిమాలకే పరిమితం కాకూడదు. భిన్నమైన కథలను తెరకెక్కించాలి. అలా జరగాలంటే నటీనటులకు, దర్శక నిర్మాతలకు స్వేచ్ఛ ఉండాలి. అలాంటప్పుడే పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. మనం మంచి సినిమాలు తెరకెక్కిస్తున్నప్పటికీ ప్రతిరోజూ ఎవరో ఒకరు మన ఇండస్ట్రీని విమర్శిస్తుండటంతో బాధ కలుగుతుంది'' అని జాన్ అబ్రహం అన్నారు.

# ఎల్2:ఎంపురాన్ వివాదం.. స్పందించిన రచయిత

మోహన్‌లాల్ (%వీశీష్ట్రుఅశ్రీఖశ్రీ%) ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్' ఈ సినిమాలోని పలు సన్నివేశాల విషయంలో వివాదం నెలకొంది. దీనిపై తాజాగా చిత్ర రచయిత మురళీ గోపీ స్పందించారు. ఈ వివాదంపై తానేమీ మాట్లాడాలనుకోవడం లేదన్నారు.



''ఈ కాంట్రవర్సీ గురించి నేను పూర్తిగా మౌనంగా ఉండాలనుకుంటున్నా. వాళ్లకు నచ్చినవిధంగా అనుకోనివ్వండి. ఒక సినిమాని తమకు నచ్చినవిధంగా ఊహించుకునే హక్కు ప్రతిఒక్కరికీ ఉంది. కాబట్టి.. వాళ్లకు నచ్చినవిధంగా ఊహించుకోనివ్వండి. నేను మాత్రం మౌనంగానే ఉంటాను'' అని అన్నారు. అదేవిధంగా ఆయన వామపక్ష భావజాలం ఉన్న సంస్థలపైనా ఆగ్రహం వ్యక్తంచేశారు. వారు చాలాకాలం క్రితమే తమ భావజాలాలను విడిచిపెట్టారన్నారు.

2019లో విడుదలైన 'లూసిఫర్'లో భాగంగా 'ఎల్ 2: ఎంపురాన్' సిద్ధమైంది. స్టీఫెన్ గట్టుపల్లిగా మోహన్‌లాల్, జతిన్ రామ్‌దాస్‌గా టొవినో థామస్, బాబా భజరంగీగా అభిమన్యు సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని రూపొందించిన పృథ్వీరాజ్ ఇందులో సయ్యద్ మసూద్‌గా నటించారు. ఎన్నో అంచనాల మధ్య గురువారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, ఇందులోని పలు సన్నివేశాల విషయంలో అంతటా తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది.

2002లో గుజరాత్‌లో చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో ఇందులో కీలక సన్నివేశాలుగా చూపించారు. అల్లర్ల సమయంలో సయ్యద్ మసూద్ కుటుంబాన్ని ఒక వర్గానికి చెందిన నాయకుడు దారుణంగా హత్య చేయడం.. కొంతకాలానికి అతడే రాజకీయాల్లోకి అడుగుపెట్టడం వంటి అంశాలతో సాగిన ఈ సన్నివేశాలను పలువురు తప్పుపడుతున్నారు. ఒక వర్గాన్ని తక్కువ చేసి చూపించేలా ఈ సీన్స్ ఉన్నాయని అంటున్నారు. పృథ్వీరాజ్ దర్శకత్వాన్ని విమర్శిస్తూ నెట్టింట వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ చిత్రాన్ని నిలిపివేయాలని వామపక్ష వాదులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు రోజులు ఏ రూ.100 కోట్లు

కలెక్షన్స్ పరంగా 'ఎల్2: ఎంపురాన్' దూసుకెళ్తోంది. 48 గంటల్లోనే రూ.100 కోట్లు వసూలుచేసి చరిత్ర సృష్టించిందని టీమ్ పేర్కొంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మోహన్‌లాల్ తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. తమ చిత్రాన్ని ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు.

# సిద్ధార్థ్ ఎంతో సరదా మనిషి..: అదితిరావ్ హైదరీ

ముంబయి: తన భర్త, నటుడు సిద్ధార్థ్ ఎంతో సరదా మనిషి అని నటి అదితిరావ్ హైదరీ తెలిపారు. తన ఇష్టానికి ఆయన ఎక్కువ విలువ ఇస్తారని చెప్పారు. ఆయనతో ఉంటే తాను ఎంతో సంతోషంగా ఉంటానని తాజాగా ఓ కార్యక్రమంలో చెప్పారు.




"నాకు, నా కుటుంబానికి సిద్ధూ ఎంతో విలువ ఇస్తుంటాడు. కుటుంబసభ్యులతో కలివిడిగా ఉంటాడు. కలిసి ఉండటం తనకు బాగా నచ్చుతుంది. ఉమ్మడి కుటుంబంలో పుట్టి పెరిగిన నాకు అతనిలో ఆ లక్షణం ఎంతగానో నచ్చింది. వ్యక్తిగతంగా తను చాలా సరదా మనిషి. చుట్టూ ఉన్నవాళ్లను సంతోషంగా ఉంచాలనుకుంటాడు. తనతో పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడు.. నేను ఒక్క నిమిషం కూడా ఆలోచించలేదు. వెంటనే ఓకే చెప్పేశాను" అని ఆమె చెప్పారు. సిద్ధార్థ్ అద్భుతంగా పాడతాడని, డ్యాన్స్ చేస్తాడని అదితి తెలిపారు. తన దృష్టిలో ఆయన గొప్ప నటుడని అన్నారు.

2021లో విడుదలైన 'మహాసముద్రం' కోసం సిద్ధార్థ్, అదితి తొలిసారి కలిసి వర్క్ చేశారు. ఆ సినిమా షూట్‌లోనే వీరిద్దరి మధ్య స్నేహం కుదిరింది. కొంతకాలానికి అది ప్రేమకు దారి తీసింది. హైదరాబాద్‌లో తన నాన్నమ్మ కట్టించిన స్కూల్ తమ కుటుంబానికి ఎంతో ప్రత్యేకమని.. ఆ పాఠశాల వేదికగా సిద్ధార్థ్ తనకు ప్రపోజ్ చేశాడని అదితి ఓ సందర్భంలో చెప్పారు. ఆయన ప్రేమను వ్యక్తపరిచిన తీరు తనకెంతో నచ్చిందన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో సిద్ధార్థ్ - అదితి వివాహం జరిగింది.

# 'డీజే టిల్లు' టైటిల్ మార్చడానికి కారణమదే: సిద్ధూ జొన్నలగడ్డ

'డీజే టిల్లు' )తో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్నారు నటుడు సిద్ధూ జొన్నలగడ్డ ( తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు వేశారు. సినిమాల్లోకి రావాలని తాను ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఇంజినీరింగ్ పూర్తైన తర్వాత కుటుంబసభ్యులు ఇచ్చిన ఆఫర్ తనకు నచ్చలేదని ఆయన తెలిపారు.



''ఇంజినీరింగ్ పూర్తైన తర్వాత ఎం.ఎస్.చేయడానికి విదేశాలకు వెళ్లడం అందరూ చేస్తుంటారు. నా కుటుంబంలోనూ చాలామంది అదే చేశారు. నేను కూడా అదే రూట్‌లో ప్రయాణించాల్సింది. విదేశాలకు వెళ్లే ప్రోసెస్ గురించి ఇంట్లో వాళ్లు నాతో చెప్పారు. రూ.20 లక్షలు అప్పు తీసుకొని నన్ను అక్కడికి పంపిస్తామని.. వారంలో మూడు రోజులు క్లాసులు ఉంటాయని.. మిగిలిన రోజులు బర్గర్ షాపులో పనిచేసి వచ్చిన డబ్బుతో అప్పులు కట్టాలన్నారు. అది నాకు ఏమాత్రం నచ్చకపోవడంతో ఇక్కడే ఉండిపోయా. అలాంటి సమయంలో ఆన్‌లైన్‌లో నాకొక ఆడిషన్ కాల్ కనిపించింది. సరదాగా వెళ్లాను. అవకాశం వచ్చింది. కొన్ని సినిమాల్లో చిన్నచిన్న రోల్స్ చేశాను. ఆ తర్వాత యాక్టింగ్‌లోనే ఉండాలనిపించింది'' అని సిద్ధూ జొన్నలగడ్డ తెలిపారు.

# అంగన్‌వాడీల్లో ఇష్టారాజ్యం..?

## అంగన్వాడీ కేంద్రాలను సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు




భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 29: నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లో అంగన్వాడీ కేంద్రాలను సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. దీంతో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ప్రతిరోజూ అంగన్వాడీ టీ చర్లు కొందరు తమ విధులు పూర్తయిన అనంతరం సరుకులు తీసుకువెళ్తున్నారని బలమైన ఆధారాలున్నాయి. ఇప్పటివరకు ఏ ఒక్క అంగన్వాడీ టీచర్లను, ఆయాలను పై అధికారులు పట్టుకోలేకపోయారు. ఇదంతా మామూలుగా కొనసాగుతున్నదని వినికిడి. దానికి తోడు అంగన్వాడీ కేంద్రానికి సరఫరా చేసే బియ్యం బస్తాలు నాణ్యత లేకుండా ఉన్నాయి. 50 కిలోలు ఉండవలసిన బస్తాకు 5,6 కిలోలు తక్కువగా తూకం ఉందని అంగన్వాడీ టీచర్లే చెప్తున్నారు. రెండు నెలల క్రితం 15 కిలో లకు పైగా బియ్యం తక్కువ తూకం వస్తుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై అధికారుల నియంత్రణ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారుల కోసం, గర్భిణుల కోసం ఎన్నో రకాల పోషకాలున్న ఆహార పదార్థాలను అందించాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తుంటే పై అధికారుల నిర్లక్ష్యంతో అంగన్వాడీ కేంద్రాలు వ్యర్థంగా మారిపోతున్నాయి. ఏ ఒక్క అంగన్వాడీ కేంద్రంలో కూడా మెనూ ప్రకారం చిన్నారులకు, గర్భిణులకు ఆహార పదార్థాలు అందించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గత నెల క్రితం ఓ అంగన్వాడీ కేంద్రంలో పప్పులో పురుగులు వచ్చాయని అంగన్వాడీ టీచర్ తెలిపారు. అంగన్వాడీకేంద్రాలపై పర్యవేక్షించే సూపర్వైజర్లు, సీడీపీవోల నియంత్రణ లేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజూ ఉపాధ్యాయులు అంగన్వాడీ కేంద్రానికి లేటుగా వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం 50శాతం పైగా అంగన్వాడీ కేంద్రాల్లో ఇలాంటి సమస్యలే ఉన్నాయని పలువరు పేర్కొంటున్నారు. పై అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా పట్టించుకొని అంగన్వాడీ కేంద్రాలు సజావుగా కొనసాగేలా చూడాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ నిర్ణయం మేరకు మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 29: ప్రభుత్వ నిర్ణయం మేరకు మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కువగా కేటాయించడం జరిగిందని, ఎలాంటి సమస్యలు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. 2024-25 యాసంగి సీజన్ లో వరి ధాన్యం కోనుగోళ్ల పై గ్రామ అధ్యక్షులు, సబ్ కమిటీ, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆకాంక్ష మేరకు మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోళ్లకు ఈ యాసంగి సీజన్ లో 183 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, గతంలో జిల్లాలో 27 కేంద్రాల్లో కొనుగోలు చేసిన మహిళా సంఘాలకు ఈ సారి మరో 156 కేంద్రాలు సంఘాలకు అదనంగా 41 శాతం కేటాయించడం జరిగిందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నాదని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కోతలు ప్రారంభం అయ్యాయని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి అవసరమైన పరికరాలు క్యాలీపర్స్, టార్పాలిన్, తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రం, తదితర పరికరాలతో పాటు కేంద్రంలో త్రాగునీరు, వేసవి దృష్ట్యా నీడ ఏర్పాటు, ఓ.ఆర్.ఎస్. పాకెట్స్, తదితర ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

సన్న బియ్యం కు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రబీ సీజన్ లో వడగళ్ల వానలు పడే ఆస్కారం ఉంటుందని, టార్పాలిన్ లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.17 శాతం తేమ ఉన్న వడ్లను కొనుగిలించేసుకోవచ్చని, దొడ్డు, సన్నం వడ్లను విడివిడిగా పెట్టాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం ను ట్యాబ్ ఎంట్రీ చేసి మిల్లులకు తరలించాలని, రైతులకు రెండు రోజుల్లో చెల్లింపులు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా జిల్లాలోని మహిళలకు ఎక్కువ కొనుగోలు కేంద్రాలు కేటాయించడం జరిగిందని, పురుషులతో సమానంగా కొనుగోళ్లు చేయాలని తెలిపారు. అంతకుముందు వడ్లు కొనుగోళ్లు, కొలతలు వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మురళీ కృష్ణ, మహిళా సంఘాల అధ్యక్షులు, ఏపిఎం.లు, సి.సి.లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి29: ప్రతి ఉద్యోగి విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగులు జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఆకుతోట ఇందిరా అన్నారు. ములుగు జిల్లా, ఏటూరునాగారం ప్రభుత్వ గిరిజన ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్ పనిచేసి పదవి విరమణ పొందిన వల్లాల సదానందం కి చిల్డ్రన్ పార్కు యోగా సాధకుల బృందం శనివారం వారిని ఘనంగా శాలువాతో సత్కరించి, పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలియజేశామని అన్నారు. అనంతరం హన్మకొండలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్ నందు పదవి విరమణ నిర్వహించినా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఆకుతోట ఇందిరా హాజరై మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. గిరిజన శాఖలో సదానందం క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెలిగి అందరి మన్ననలను పొందారని, ఉద్యోగంలో పదవి విరమణ అనేది సహజమని, ఉద్యోగరీత్యా ప్రతి ఒక్కరూ పదవీ విరమణ పొందుతారని అన్నారు. అదే విధంగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యక్తి తన దైనందిన జీవితంలో ప్రతిరోజు యోగా చేయాలని, అదే విధంగా సదానందం దంపతులు చిల్డ్రన్ పార్కులోని గత రెండు, మూడు సంవత్సరాలుగా ప్రతి రోజూ యోగా శిక్షణ తరగతులకు రావడం సంతోషకరమని అన్నారు. యోగా చేయడం వలన జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు మానసిక నరాల సమస్యలు రాకుండా నివారిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. తన ఇంజనీరింగ్ విభాగంలో నమ్ముకున్న వృత్తి పట్ల అంకితభావంతో పనిచేశారని, ఉద్యోగం జీవితంలో వారు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారన్నారు. పదవీ విరమణ అనంతరం వారి శేషజీవితం ఆనందంగా, సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ప్రతిరోజు ఉదయం యోగా చేయడం వలన ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ బత్తుల రాజేందర్, వెంకటేశ్వర్లు , లకావత్ చిరంజీవి, శాంతి , రాజేశ్వరి, మంజుల, కళావతి, కళా, నయన, సురేష్, శివ శంకర్, వెంకట్ చారీ, రవీందర్, గణేష్, సాయిలు తదితరులు యోగా సాధకులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ కార్డులు.. మరో మూడు నెలల పొడిగింపు: నిర్మల్ జిల్లా డిపిఆర్ఓ. విష్ణువర్ధన్.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,మార్చి 29: నిర్మల్ జిల్లా జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాల పరిమితి మరో మూడు నెలలు పెంచినట్లు నిర్మల్ జిల్లా డి పి ఆర్ ఓ. విష్ణువర్ధన్ తెలిపారు.ప్రభుత్వ ఉత్తర్వుల ఆదేశానుసారం మార్చి 31 గడువు ముగియడంతో జూన్ 30 వరకు కాల పరిమితి పెంచారని ఐ అండ్ పి ఆర్ స్పెషల్ కమిషనర్ డాక్టర్ ఎస్ హరీష్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

ఈ అవకాశాన్ని అక్రిడేషన్ కార్డు కలిగి ఉన్న విలేకరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సు రాయితీ కొరకు అక్రిడేషన్ కార్డులను డిపి ఆర్ ఓ కార్యాలయంలో స్టిక్కర్లను అతికించుకోని బస్సు పాసులను రెన్యువల్ చేసుకోవాలని విలేకరులు కోరారు.

# స్మార్ట్ కిడ్జ్ లో నేత్రపర్వంగా తెలుగు సంవత్సరాది ఉగాది సంబురాలు.





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 29:స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం శ్రీ విశ్వా వసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. సూర్య భగవానునికి పొంగలి నైవేద్యంగా సమర్పించి ప్రకృతి మాతకు విశేష పూజలు నిర్వహించారు.

షడ్రుచుల ఉగాది పచ్చడిని పాఠశాల విద్యార్థులు తయారుచేసి అందరికీ పంచారు. ప్రకృతి రమణీయత వెల్లివిరిసేలా అరటి ఆకులు, మామిడికాయలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రకృతిలో కొత్త చిగుళ్ళు పూసి రమణీయంగా ఉండడాన్ని బట్టి ప్రతి ఒక్కరి జీవితం లో గతకాలపు కష్టనష్టాలు తొలగిపోయి కొత్త ఆశలతో నూతన శకానికి ఆవిష్కరణ జరుగుతుందన్న విషయం ప్రకృతి మనకు తెలియజేస్తున్నదని తెలిపారు.

ఉగాది పచ్చడి స్వీకరించడం ద్వారా జీవితంలోని అన్ని అనుభవాలను సమానంగా స్వీకరించాలన్న భావన ప్రతి ఒక్కరిని జాగృతం చేస్తున్నదని వివరించారు. పంచాంగ శ్రవణం ద్వారా రాబోయే రోజులలో సంభవించే నూతన ప్రక్రియలను సూచిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేదలకు ముందుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరాలి

## రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 29:ప్రభుత్వం చేపట్టే వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ముందుగా పేదలకు చేరాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.శనివారం మంత్రి, ఖమ్మం కార్పొరేషన్, రఘునాధపాలెం మండలంలో పర్యటించి రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసారు.ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ శ్రీరాం హిల్స్ లో టి.యు.ఎఫ్.ఐ.డి. సి. నిధులు కోటి రూపాయలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రఘునాథ పాలెం మండలం వి.వి. పాలెంలో వివి పాలెం ఎన్.ఎస్.పి. కెనాల్ నుండి ఇల్లందు - వైరా బైపాస్ రోడ్డు వరకు సి.ఆర్.ఆర్. నిధులు 2 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, వివి పాలెం గ్రామం ఎస్.సి. కాలనీ నందు సి.ఆర్.ఆర్. నిధులు 60 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం ప్రజల ఆశీర్వాదంతో అవకాశం మేరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగు తుందని అన్నారు. అభివృద్ధి పనులలో ప్రజల సహకారం అవసరమని, ఐఏఎస్ అధికారి మున్సిపల్ కమీషనర్ గా ఉన్నారని, ఆయనతో మనం మరిన్ని కార్యక్రమాలు చేయించుకోవాలని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో మంచినీటి సరఫరా పథకానికి మరో 220 కోట్లను ప్రభుత్వం త్వరలోనే మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజి వ్యవస్థ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదిస్తూ నివేదిక పంపామని అన్నారు. ఖమ్మం నగరం చుట్టు చేపట్టిన జాతీయ రహదారులు పూర్తి చేసుకుంటే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని మంత్రి తెలిపారు.అర్హులకు భూ పట్టాలను ఆర్డిఓతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించుకోవాలని అన్నారు. ఎన్టీఆర్ హాయంలో ఎత్తిపోతల పథకం మంజూరు చేయించామని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే అభివృద్ధి పనులను మండల అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మొదటి దశలో పేదలను ఎంపిక చేసి ఇండ్లు, ఇంటి పట్టాలు అందించాలని అన్నారు. ప్రతి సంవత్సరం ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, దశల వారీగా అర్హులందరికీ అందిస్తామని అన్నారు. శ్రీరామ్ హిల్స్ లో నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలో ప్రధాన రోడ్ల ప్రక్కన ఫుట్ పాత్ అభివృద్ధి కోసం 10 కోట్ల నిధులు మంజూరు చేశామని, వారం రోజులలో ఈ పనులు ప్రారంభం అవుతాయని అన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్, ఇండోర్ టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ స్టేడీయం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇల్లందు క్రాస్ రోడ్డు సర్కిల్ లో నగరానికి ఆకర్షణీయంగా క్లాక్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు పారిశుధ్య నిర్వహణ, మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.ప్రజలు కూడా సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి మున్సిపల్ కార్పొరేషన్ కు సహకరించాలని, పారిశుధ్య నిర్వహణలో తమ వంతు పాత్ర పోషించాలని, తడి, పొడి చెత్త వేరువేరుగా మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రానైట్ సబ్సిడీ రూ. 19 కోట్ల విడుదలకు సంబంధించిప్రభుత్వ ఉత్తర్వులు మంత్రి చేతులమీదుగా గ్రానైట్ వ్యాపారులకు అందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు హరినాథ బాబు, యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మార్చి 29(భారత శక్తి): విశ్వావసునామ తెలుగు సంవత్సరాది ఉగాది, అలాగే పవిత్ర రంజాన్ పండుగలను భక్తి శ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని, ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్య సౌభాగ్యాలను నింపాలని కోరుకుంటూ.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి శనివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలందరికీ ఉగాది మరియు రంజాన్ పండుగల శుభాకాంక్షలు తెలిపారు.తెలుగు రాష్ట్రాల్లో ఉగాది పండుగకు ఉన్న ప్రత్యేకతను పేర్కొంటూ, ఆరు రుచుల కలయికగా రూపొందించే ఉగాది పచ్చడి మన జీవన తత్వాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. వైద్యపరంగా కూడా ఈ పచ్చడి వేసవి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ విశ్వావసునామ సంవత్సరంలో ప్రకృతి అనుకూలంగా మారి, జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, జిల్లాలో అభివృద్ధి వేగంగా సాగాలని ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక దృక్పథంలో జీవితం సుఖదుఃఖాల మిశ్రమమని, ఉగాది పండుగ మనకు ఈ జీవిత సత్యాన్ని గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. పంచాంగ శ్రవణం ద్వారా భవిష్యత్ పరిస్థితులను అంచనా వేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ పంచాంగ శ్రవణం చేయాలని సూచించారు.పవిత్రత, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల మేళవింపే రంజాన్ పర్వదినమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

రంజాన్ పవిత్ర మాసం త్యాగం, సహనశీలత, మానవతా విలువలను ప్రతిబింబిస్తుందని, ముస్లిం సోదరులు దీన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల జీవితాల్లో ప్రతి రోజూ పర్వదినంలా మారిందని, ప్రతి ఇంటా సంతోషాల సౌరభం వ్యాపించిందని తెలిపారు.ఈ సందర్భంగా ప్రజలందరూ శాంతి, సౌభ్రాతృత్వంతో జీవించాలని, ప్రేమ, సహనంతో, ఆనందంగా ముందుకు సాగాలని కలెక్టర్ కోరారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా భగవంతుని దీవెనలు, అల్లాహ్ ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy